# మహనీయులు

తెనుఁగులెంక
తుమ్మలసీతారామమూర్తి



తుమ్మల
కళాపీఠం
గుంటూరు

# మహనీయులు

తెనుఁగులెంక

**తుమ్మల సీతారామమూర్తి**

సంకలనకర్త

**తుమ్మల శ్రీనివాసమూర్తి**

తెనుఁగులెంక

# తుమ్మల సీతారామమూర్తి

ప్రథమ ముద్రణ : మార్చి 2009
ప్రతులు : 500
వెల : 10/-

ప్రతులకు :
1. తుమ్మల కళాపీఠము
జె.కె.సి. కళాశాల
గుంటూరు-6
2. తుమ్మల శ్రీనివాసమూర్తి
43- గౌతమపురి కాలని,
ఎఱ్ఱగడ్డ పి.ఒ
హైదరాబాదు-18

ముద్రణ :
రెయిన్‌బో ప్రింట్‌ప్యాక్
అమీర్‌పేట, హైదరాబాద్,
ఫోన్ : 040 - 23731620.

**తెనుఁగులెంక తుమ్మల సీతారామమూర్తి  జీవితము - కృతులు**

**జననము** : 25-12-1901 కావూరు, రేపల్లె తాలూకా, గుంటూరు జిల్లా,

తల్లిదండ్రులు : చెంచమాంబా నారయ్యలు.

**గురువులు** : కావూరి శ్రీరాములుగారు, జాస్తి సుబ్బయ్యగారు, తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు, దువ్వూరి వేంకటరమణ శాస్త్రిగారు

**విద్య** : ఉభయభాషాప్రవీణ (ప్రథమశ్రేణి) ఆంధ్రవిశ్వవిద్యాలయము 1930

వృత్తి : సేద్యము, తరువాత అధ్యాపనము, దుగ్గిరాల, బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల, మున్నగు చోట్లగల ఉన్నత పాఠశాలలు

**దేశసేవ** : 1920 - 30 వరకు కాంగ్రెసు సేవ; శిక్ష -1922.

**అభిమాన విషయములు** : గ్రామజీవనము, గాంధీతత్వము, సర్వోదయము, ఆంధ్రాభ్యుదయము, భారతీయుల సమగ్రత,ప్రగతి, తిక్కన కవితామార్గము చిన్నయసూరి సిద్ధాంతము.

**కృతులు** : ఆత్మకథ, మహాత్మకథ, అమరజ్యోతి, గాంధీగానము, సర్వోదయగానము, రాష్ట్రగానము, ఉదయగానము, పఱిగపంట, శబల, పైరపంట, సమదర్శి, కదంబకైత, చక్కట్లు, దివ్యజ్యోతి, ఆత్మార్పణము, ధర్మజ్యోతి, ఎక్కట్లు, సందేశసప్తశతి, నేను, నాకథలు, తపస్సిద్ధి, తెనుఁగునీతి, గీతాదర్శము, హనుమాన్ చాలీసా, రామకృష్ణస్మృతి ఇంకనూ కొన్ని శతకములు, నాటకములు, హరికథలు, జంగంకథలు మున్నగునవి.

**సన్మానములు** : 1949 నిడుబ్రోలులో గజారోహణము, గండపెండేరము, కనకాభిషేకము, సువర్ణకంకణము; 1960 లో అఖిలభారత తెలుగురచయితల మహాసభ సత్కారము; 1967 లో ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ విశిష్టసభ్యత్వము; 1969లో కేంద్రసాహిత్య అకాడమీ బహుమానము (మహాత్మకథకు); 1969 ఆంధ్రవిశ్వవిద్యాలయము "కళాప్రపూర్ణ". 1985 లో నాగార్జున విశ్వవిద్యాలయము డి.లిట్ బిరుదులతో సత్కారము; 1985లో విశాఖపట్నములో సహస్రపూర్ణచంద్రదర్శన మహోత్సవము; (శ్రీయం. వి.వి.యస్ మూర్తి); మద్రాసులో యల్.వి రామయ్య చారిటీస్ ఘనసన్మానము; 1987లో గుంటూరు, విజయవాడలలో ఘనసన్మానములు.

జయంతి మహోత్సవములు : 1952 నుండి రాష్ట్రమంతటా

బిరుదులు: పండితుల, కవుల దృష్టిలో "అభినవతిక్కన" తన దృష్టిలో "తెనుఁగులెంక"

మరణము : 21-3-1990 అప్పికట్ల

# ❋ రెండు మాటలు ❋

నరునిపేరు నిల్పునది కైతగాక వే
ఱొండు కలదె; కవిత నొదిఁగి మెఱయు
పురుషుఁ జూచి యొరులు పూనెద రుత్తమా
చార;మది శుభం బొసంగు నిలకు-

అని తుమ్మలవారు వ్రాసిన మాటలు అక్షరాలా నిజము కావ్యశక్తి అమోఘమైనది. కవితాబాంధవ్యము వలన చక్రవర్తులేగాదు, ఉత్తమ మానవులు కూడ చరిత్రలో కీర్తి గడించినారు. చరిత్ర అనగా ఒక అభిప్రాయము ప్రకారము- మహనీయుల జీవిత చరిత్రలే. వారి లోకమోహనమైన గుణముల వలన సమాజగతి మారుచుండును. అందు వలననె వారి చరిత్రలు ఆదర్శవంతములైనవి. వారి చరిత్రలు చదివి మానవులు సంస్కారవంతు లౌదురు; సమాజము ఉన్నతీకరించబడును. లోకహితకారులైన కవులు మహనీయుల చరిత్రలను తమ కవితాగానము ద్వారా ప్రజలకు తెలియపరచి, చైతన్యవంతులను చేసెదరు. లేనిచో మహనీయులు చరిత్రమరుగునపడిపోవుటయేగాక, భావితరములవారికి ఆదర్శమానవోత్తములు లభించరు గూడ. అటువంటి మహనీయుల చరిత్ర లను తెలుసుకొనుట జగత్కల్యాణహేతువు కాగలదు.

తుమ్మలవారు లోకకల్యాణమును కాంక్షించినవారు. అందువలననె దేశభక్తుల, గుణగరిష్ఠుల చరిత్ర గానము చేయుట జగద్ధితమైన చేతయని వారు భావించినారు. దేశాభిమానమో, దేహాత్మ విచారమో, ధార్మికావేశమో, నైతికప్రేరణమో, పెద్దలయెడ పొడమిన పేర్మియో, పిన్నలదెస తోచిన కూర్మియో కారణముగా వారు అపుడపుడు అనేక వ్యక్తులపై కవితలను వ్రాసినారు. విశ్వకల్యాణమును అభిలషించు నిస్వార్థజీవనులు సమాజపురోభివృద్ధికి మూలమనియు, అటువంటివారి గుణగానము తమ ధర్మముగా భావించినారు. అటువంటిమహనీయుల చరిత్రలు తుమ్మలవారి కవితావస్తువులై నిస్వార్థ ప్రశంసల నందుకొన్నవి. అటువంటికవితలు సమకాలికులకు ఉత్తేజమును, భావితరములవారికి స్ఫూర్తిని కలిగించును. వారి కవిత 90పాళ్ళు వ్యక్తి ప్రశంసాప్రధానమైనదని చెప్పవచ్చును. ఈ ప్రశంసలు మ్రొక్కుబడిగా(Formality గ) వ్రాసినవికావు; ఎంతో ఆత్మీయతతో, కృతజ్ఞతాభావముతో వ్రాసినవి. ఈ కవితలలో ఆనాటి సమాజ సమీక్ష కలదు; సందేశమును కలదు. సమకాలికుల గుణగణములను కొనియాడుచు, విస్తృతముగా కవితచెప్పినవారు తుమ్మల వారొక్కరే యనిన అతిశయోక్తికాదు.

తుమ్మలవారికవితలో నొదిగి, అమరత్వమును పొందినమహనీయులలో మత ప్రవక్తలు, భారతమహీకల్యాణసంధాత మహాత్మాగాంధి, భూదానోద్యమనిర్మాత వినోబాభావే, కర్షకోద్యమవిధాత ఆచార్యయన్.జి.రంగా, ఆదర్శప్రధానమంత్రి లాల్ బహదూర్‌శాస్త్రి, జాతీయపోరాటమునందు కడిమిచాటిన యోధులు, వీరనారీమణులు, సదాశయులైన రాజకీయనాయకులు, దాతృతానిధులు, ఆత్మవేత్తలు, జాతిసేవకులైన రాజులు, ప్రజాసేవకంకితమైన కవిరాజులు (వైద్యులు), సాహితీవేత్తలు, సాహితీ

పోషకులు, విద్యావేత్తలు, విద్యాపోషకులు, విమలస్వాంతులు, మహితాచార ప్రియంభావుకులు, ఆదర్శమహామహోపాధ్యాయులు, సంఘసేవాధురంధరులు, త్యాగమూర్తులు మున్నగువారు కలరు. వీరందరు సమాజసేవకు అంకిత మైనవారు జగత్కల్యాణమును కాంక్షించిన వారు. జాతికి వీరిచ్చిన సందేశము అమూల్యమైన సంపద. అందువలననె వారి చరిత్రలు తుమ్మల వారి చిత్తమును ఆకర్షించి, వారి మనోహరమైనకవితలో నొదిగిపోయినవి. ఈ కవితలు ఆయామహనీయుల రేఖామాత్రమైన జీవితచరిత్రలు అని చెప్పవచ్చును. వీరి గుణగానము చేసి తుమ్మలవారు జాతిఋణమును తీర్చుకొనినారు. ఈ కవితలను చదివిన ఆధునికభారతదేశచరిత్ర తెలియగలదు.

మరొక విశేషమేమనగా తుమ్మలవారు గాంధిధర్మమును నమ్మినవారు, ఆస్తికులు కూడ అయినప్పటికి వారి ప్రశంసలు పొందినవారిలో గాంధిసరణిని మెచ్చుమనువారు కలరు; నాస్తికులు కూడ కలరు. అయితే వారు ఆయా ధర్మక్షేత్రములలో నిస్వార్థమగుసమాజ సేవచేసి ప్రసిద్ధిగాంచినవారు. కావుననె వారు తుమ్మలవారి ప్రశంసలను పొందినారు. వాదభేదములను విదళించి, విషమదృష్టిని పరిహరించి యితరుల లోకమోహనగుణగానము చేయుట గొప్పవిశేషము. ఇది అచ్చమైన గాంధేయతత్త్వము దీనికి ప్రతీక తుమ్మలవారు; వారి కవిత.

ఇంకొక విశేషమేమనగా జాతికి హాని తలపెట్టిన నాయకులప్రవర్తనను తుమ్మలవారు ఖండించినారు. ఈ విధముగ వ్రాయగల కవులెందరు కలరు? ప్రభుత్వపదవులను, అవార్డులను ఆశించనివారె ఈవిధముగా ధైర్యముగా వ్రాయగలరు. అందువలననె తుమ్మలవారికి దక్కవలసిన ప్రభుత్వ పదవులు, గౌరవములు, అవార్డులు లభించలేదు. "మీకు ఆస్థానకవి పీఠము, జ్ఞానపీఠఅవార్డు, రాజ్యసభ, రాష్ట్రశాసనమండలి సభ్యత్వములు రావలసినవి, అవి రాకపోవుట మాకు చాల బాధగా నున్నదని సాహిత్యాభిమానులు కవిగారిని అడుగు చుండెడివారు. మీ హృదయములలో అవి నాకు రావలసినవి అని అనుకొనుటయే అవి నాకు వచ్చినట్లే అని సమాధానమిచ్చేవారు. సాహిత్యమును సమాజసేవాసాధనముగా వారు భావించినారే గాని, నాయకుల చుట్టు తిరిగి వాటిని సంపాదించుట వారికి గిట్టదు.

ఈ కవితలు తుమ్మలవారి సమదర్శనమును,, మానవతాదృష్టి, లోకకల్యాణదృష్టిని, చిత్తశుద్ధిని, కృతజ్ఞతాభిమానములను తెలియ జేయుచున్నవి. ఇవి పాఠకులకు ఆయా మహనీయుల సేవాత్యాగములను స్మరణకు దెచ్చుచు, వారికి స్ఫూర్తి నివ్వగలవు. మహనీయుల చరిత్రలను పద్యరూపమున కావ్యకళాదృష్టితో నిబంధించుట కత్తిమీదిసాము వంటిది. అయితె తుమ్మలవారి కిది "నల్లేరుపై బండి నడక" వంటిది. వారి కావ్యశైలి, వ్యక్తి కవితలశైలి యించు మించు ఒకేరీతిగా, సాఫీగా, మనోహరముగా సాగిపోవుచుండును. ఈ కవితలు చదువు చున్నపుడు ఆయా విశిష్టవ్యక్తులు చదువరుల మనసులలో సాక్షాత్కరించెదరు. ఈ సంకలనగ్రంథమును "దివ్యమూర్తుల సత్యసత్త్వస్వరూపప్రశంసాజ్యోతి" అని చెప్పవచ్చును.

**సంకలనకర్త**

# కృతజ్ఞతా జ్ఞాపిక

శ్రీ మన్నె చలపతిరావుగారు తెలుగుతల్లి ముద్దుబిడ్డ. సామాన్యరైతు కుటుంబమునందు జన్మించి, గాంధికలలుగన్న గ్రామస్వరాజ్యసారధిగ కీర్తి గాంచెను. వారి రూపము, వ్యక్తిత్వములు ఆకర్షణీయము లైనవి.

ఆ పల్లెటూరిపెద్దఱికము ఉట్టిపడె రూపము, ఆ అచ్ఛాంధ్రత్వము ఉట్టిపడు తెల్లనిపంచెకట్టు, ఆ తియ్యనిమాట, ఆ చిఱునగవుసోయగము, ఆ విశాల ఫాలభాగము, ఆ తిన్నని నాసిక, ఆ నిరాడంబర సాధువర్తనము, ఆ దేశభక్తి, ఆ రాష్ట్రరక్తి ఆ సమాజసేవాదృష్టి, ఆ దానధర్మాసక్తి ఆ సత్యనిరతి, ఆ విరతిలేని కార్యదీక్షాదక్షతలు, ఆ ఆత్మ విశ్వాసము, ఆ స్నేహభావము, ఆ బంధుప్రీతి, ఆ కుటుంబబాధ్యత, ఆ భార్యానురాగము- ఈ లోకమోహనగుణములన్నియు వారికి పెట్టని సొమ్ములు.

వారు ఈతేరు గ్రామమునకు (గుంటూరు జిల్లా) మున్సబ్‌గా నుండిరి. వారు గాంధిపిలుపుతో జాతీయోద్యమములో పాల్గొని, మున్సబ్ పదవికి రాజీనామాచేసి, పెదనందిపాడు మున్సబ్ శ్రీ పర్వతనేని వీరయ్య చౌదరిగారు సాగించిన శాసనోల్లంఘన ఉద్యమములో చురుకుగా పాల్గొనిరి. గాంధి నాయకత్వమున దేశమునకు వచ్చిన స్వాతంత్ర్యమును గాంచి ఎంతో సంతోషపడిరి; అయితె జాతిపితహత్యకు మరెంతో క్రుంగిపోయిరి. తదుపరి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రోద్యమములో పాల్గొని, చివరకు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రనిర్మాణమును గాంచి చాల ఆనందపడిరి.

అటుపిమ్మట వారు ఈతేరు గ్రామమునకు సర్పంచ్‌గా ఏకగ్రీవముగా ఎన్నుకొనబడిరి. ఈ పదవిని వారు అనేకమార్లు ప్రజలందరికోరికపై నిర్వహించిరి. వారు మాటలమనిషికాదు, చేతలమనిషి. గాంధికోరిన గ్రామస్వరాజ్యమునకు కృషిచేసిరి. ప్రభుత్వ, ప్రజల సహకారముతో ఈతేరు గ్రామమునకు పట్టణములకు దీటుగా చక్కని రూపరేఖలను దిద్దిరి. వారు గ్రామమునందు పాఠశాలను, గ్రంథాలయమును, పశువైద్యశాలను, చక్కనిసిమెంటురోడ్లను (మొదట పల్లెలో వేయించిరి), మురుగునీటి పారుదల సౌకర్యమును, త్రాగునీటి సరఫరాసౌకర్యమును, విద్యుచ్ఛక్తిసౌకర్యమును, ఆహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేసిరి. వారు గ్రామసర్పంచులకు మార్గదర్శి అయిరి. రాష్ట్రములోనె ఈతేరు ఆదర్శగ్రామములలో నొకటిగా ఖ్యాతిగాంచినది.



గ్రామమునకుఁ గాదు, సీమకు నొకఁడైన
నిన్నువంటి మాననీయుఁడున్న
దేశభాగ్య మెంత దీపించునో కదా!
మన్నెవంశవన రమావసంత!

("మహనీయులు" గ్రంథము వీరికి కృతజ్ఞతా జ్ఞాపికగా సమర్పించబడినది)

అనుకూలశీలయగుసతి
తన కబ్బినవాఁడె గేస్తు ధన్యతనందున్
మును కూర్చుకొన్నపుణ్యము
వనితారూపమున వచ్చి వరు నలరించున్

అని తుమ్మలవారు వ్రాసినట్లుగా వారికి గతజన్మ పుణ్యఫలముగా నాగభూషణమ్మ సతిగా లభించినది. ఆమె వారికి తగినయిల్లాలు. ఆమె సుగుణసంపన్నురాలు. వారిది ఆదర్శకుటుంబము. వారి కుటుంబము ''చల్లనిసంసారము, చక్కనిసంతానము'' నకు చక్కనిప్రతీక. వారిది పెద్ద కుటుంబము. వారు పిల్లలందరిని క్రమశిక్షణతోపెంచి, విద్యాబుద్ధులను నేర్పించిరి. వారి విజయము లన్నిటియందు ఆమె పాత్రకలదు. ఏ సమయమున (పగలైనా, రాత్రియైనా) ప్రభుత్వాధికారులు, అతిథులు, బంధువులు వచ్చినను ఓర్పుతో నాలుగురకములవంటలు వండి, వార్చి వడ్డించుచుండెడిది. వారిది జన్మ జన్మలబంధము. జీవితమునందేగాక, మరణమునందు కూడ వారు ఒకటిగా నుండిరి. వారిది ''కపోతదాంపత్యము'' అని చెప్పవచ్చును. జీవితమంతయు-మొదటి నుండి చివరి వరకు - అన్యోన్యముగా నుండు. దాంపత్యమును పెద్దలు "కపోతదాంపత్యము" అని చెప్పుచుందురు. అనగా ఒకరులేని జీవితమును వారు భరించలేరు. కనుకనె భర్త మరణించిన 24 గంటలలోనె ఆమె కూడ మరణించినది. ఆదర్శదంపతులుగా వారు వినుతిగాంచిరి.

అటువంటి పురుషోత్తమునకు "మహనీయులు" సంకలనగ్రంథమును కృతజ్ఞతాజ్ఞాపికగా సమర్పించుచున్నాను.

ఇట్లు

**సంకలనకర్త**

# ప్రశంస

2001 డిసెంబరులో తెనుగులెంక శ్రీతుమ్మలసీతారామమూర్తి శతజయంతి సభలను డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి అధ్యక్షతన ఏర్పడిన తుమ్మల శతజయంతి సంఘము చాలా వైభముగా నిర్వహించినది. అంతే గాక జాతీయకవితామూర్తి సీతారామమూర్తిగారి రచనలన్నింటిని నాలుగు సంపుటములుగా ప్రచురించుటయే గాక, ఒక అమూల్యమైన సావనీర్‌ను కూడా ముద్రించినది. ఇంకను డా॥ కొండబోలు బసవపున్నయ్యగారి అధ్యక్షతన తుమ్మల కళాపీఠము నెలకొల్పబడినది. ప్రతి సంవత్సరము తుమ్మల వారి జయంతి, వర్ధంతి సభలు నిర్వహించబడుచున్నవి. అంతేగాక ఉత్తమ రచయితలను ''తుమ్మల సాహిత్యపురస్కారము''తో సన్మానించుకొంటున్నది. 2003లో శ్రీ మన్నవ గిరిధరరావు గారికి, 2004లో శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు గారికి, 2005లో శ్రీ గుండవరపు లక్ష్మీనారాయణ గారికి, 2006 లో శ్రీ యార్లగడ్డ వేంకటసుబ్బారావు గారికి, 2007లో శ్రీ కసిరెడ్డి వెంకటరెడ్డి గారికి; 2008లో శ్రీ సిద్ధేశ్వరానందభారతీస్వామివారికి కుర్తాలం పీఠాధిపతులు (పూర్వాశ్రమములో డా॥ ప్రసాదరాయకులపతిగారు) తుమ్మల సాహిత్య పురస్కారములను అందించి, సన్మానించినది.

తుమ్మల వారి పెద్దబ్బాయి శ్రీ శ్రీనివాసమూర్తి విషయ ప్రధానముగా మహాకవి పద్యరత్నములను సేకరించి తుమ్మల కళాపీఠము ద్వారా ప్రచురించి ఆంధ్రపాఠకలోకమునకు అందించుచున్నారు. ''ఆంధ్రప్రశస్తిని'' చరిత్రకారులు, బహుభాషావేత్తలు, కీర్తిశేషులు పులిచెర్ల సుబ్బారావుగారి జ్ఞాపకార్థముగా; ''పండుగ కవితలు''ను ప్రముఖవాణిజ్యవేత్తలు, విద్యా పోషకులు శ్రీ పోలిశెట్టి ఏకనాథ గుప్తగారికి ఉడుగరగా, ''తెనుగుతీపి''ని ఆదర్శవైద్యులు డా॥ ముద్దన హనుమంతరావుగారికి కృతజ్ఞతా కానుకగా; ''కథాకవిత్వమును'' వారి తల్లి గారైన అన్నపూర్ణమ్మ గారికి కృతజ్ఞతా కానుకగా సమర్పించినారు. '' సుకవిస్తుతి'' అను గ్రంథమును ప్రముఖ ఆడిటర్ సాహితీప్రియులు పోషకులు అయిన శ్రీపాలడుగు లక్ష్మణరావుగారికి కృతజ్ఞతా కానుకగా సమర్పించినారు. ''స్మృతికవితలు'' అను గ్రంథమును వారి బావగారైన శ్రీ గుంటూరు మురహరిరావుగారికి స్మృతికానుకగా సమర్పించినారు. నేడు ''మహనీయులు'' అనుగ్రంథమును ఆదర్శగ్రామసర్పంచ్ శ్రీ మన్నె వెంకటచలపతిరావుగారికి కృతజ్ఞతా జ్ఞాపికగా సమర్పించినారు. ఈ సంకలనగ్రంథము తుమ్మలవారికి ఆయా వ్యక్తుల పట్ల గల హృదయస్పందనను తెలియజేయుచున్నది.

డా॥ పులిచెర్ల సాంబశివరావు
కార్యదర్శి తుమ్మల కళాపీఠము,
గుంటూరు

విరోధి - ఉగాది
2009

# విషయసూచిక


| | | పేజి |
|---|---|---|
| కృత్యాది | | 1 |
| శ్రీయుతులు | | |
| 1. | చల్లపల్లి రాజా | 3 |
| 2. | కొసరాజు లక్ష్మయ్య | 5 |
| 3. | గాడిచర్ల హరిసర్వోత్తమరావు | 11 |
| 4. | పాములపాటి వేంకటకృష్ణయ్య | 13 |
| 5. | కొండ వెంకటప్పయ్య | 14 |
| 6. | పట్టాభి సీతారామయ్య | 15 |
| 7. | ఎర్నేని సుబ్రహ్మణ్యము | 16 |
| 8. | గోగినేని వెంకటసుబ్బయ్య | 17 |
| 9. | రవీంద్రనాథ ఠాగూరు | 18 |
| 10. | కట్టమంచి రామలింగారెడ్డి | 18 |
| 11. | కన్నెకంటి వీరభద్రాచార్యులు | 19 |
| 12. | దొప్పలపూడి అనసూయ | 20 |
| 13. | లేళ్ళ వెంకటరామారావు | 20 |
| 14. | అయ్యంకి వెంకటరమణయ్య | 21 |
| 15. | క్షేత్రయ్య | 23 |
| 16. | త్యాగయ్య | 23 |
| 17. | కొమరవోలు రాజయ్య | 23 |
| 18. | కొండిపర్తి వీరభద్రుడు | 24 |
| 19. | గ్రంధి వరదయ్య | 25 |
| 20. | ముక్త్యాలరాజా | 27 |
| 21. | వినోబా భావె | 29 |
| 22. | కల్లూరి సుబ్బారావు | 31 |
| 23. | గొట్టిపాటి బ్రహ్మయ్య | 31 |
| 24. | మూల్పూరి రంగయ్య | 35 |
| 25. | పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి | 35 |
| 26. | నీలంరాజు వేంకటశేషయ్య | 37 |
| 27. | ఆచార్య యన్ జి. రంగా | 38 |
| 28. | తుమ్మల బసవయ్య | 46 |
| 29. | మన్నె వెంకటచలపతిరావు | 48 |
| 30. | శరణు రామస్వామి | 49 |
| 31. | డా॥ అడుసుమల్లి నారాయణరావు | 50 |
| 32. | శ్రీకృష్ణదేవరాయలు | 51 |
| 33. | సాధువమ్మ | 52 |
| 34. | గోపరాజు రామచంద్రరావు (గోరా) | 54 |
| 35. | డా॥ వెంపటి సూర్యనారాయణ | 54 |
| 36. | రామతీర్థ | 57 |
| 37. | మహాత్మకథ | 58 |
| 38. | కల్లూరి చంద్రమౌళి | 77 |
| 39. | గుళ్లపల్లి సుబ్బరామయ్య | 78 |
| 40. | డా॥ పావులూరి కృష్ణచౌదరి | 79 |

| | | |
|---|---|---|
| 41. | గుళ్ళపల్లి పున్నయ్యశాస్త్రి | 79 |
| 42. | వావిలాల గోపాలకృష్ణయ్య | 82 |
| 43. | పాములపాటి బుచ్చినాయుడు | 82 |
| 44. | లాల్ బహద్దరుశాస్త్రి | 83 |
| 45. | టంగుటూరి ప్రకాశము పంతులు | 88 |
| 46. | అడుసుమల్లి శ్రీనివాసరావు | 89 |
| 47. | అలమేలు మంగమ్మ | 90 |
| 48. | ఆచంట శేషయ్య | 90 |
| 49. | తాళ్ళూరి జియ్యరుదాసు | 92 |
| 50. | మేడూరి నాగేశ్వరరావు | 93 |
| 51. | పరుచూరి వెంకటసుందరవరదులు | 96 |
| 52. | యం.ఆర్. అప్పారావు | 96 |
| 53. | యలమంచిలి వెంకటేశ్వరరావు | 97 |
| 54. | జలగం వెంగళరావు | 99 |
| 55. | నీలం సంజీవరెడ్డి | 101 |
| 56. | రాగం ఆంజనేయులు | 111 |
| 57. | వి. లక్ష్మీ సుందరరావు | 103 |
| 58. | మట్టి చెన్నారెడ్డి | 103 |
| 59. | యార్లగడ్డ వెంకన్నచౌదరి | 104 |
| 60. | బెజవాడ గోపాలరెడ్డి | 105 |
| 61. | మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి | 107 |
| 62. | కొనకళ్ళ వెంకటరత్నము | 107 |
| 63. | సి.వి. సుబ్బన్న | 107 |
| 64. | బ్రౌను | 108 |
| 65. | వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి | 108 |
| 66. | ఘంటసాల వెంకటేశ్వరరావు | 108 |
| 67. | యలవర్తి రోశయ్య | 108 |
| 68. | వట్టికూటి వెంకటసుబ్బయ్య | 109 |
| 69. | బుద్ధుడు | 112 |
| 70. | అయ్యదేవర కాళేశ్వరరావు | 113 |
| 71. | ఇంజనీర్ కె.యల్. రావు | 113 |
| 72. | వెలువోలు సీతారామయ్య | 114 |
| 73. | మంతెన వెంకటరాజు | 116 |
| 74. | గుత్తికొండ రామబ్రహ్మము | 117 |
| 75. | కాకరపర్తి వెంకటేశ్వర్లు | 118 |
| 76. | పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి | 119 |
| 77. | గవిని సీతారామయ్య | 120 |
| 78. | ఆచంట అమరేశ్వరి | 121 |
| 79. | యమ్.వి.వి.యస్.మూర్తి | 122 |
| 80. | ప్రగడ కోటయ్య | 124 |
| 81. | డా॥ కె. సదాశివరావు | 125 |
| 82. | తాతా వెంకటసుబ్బయ్య | 127 |
| 83. | తూమాటి దొణప్ప | 129 |
| 84. | కేలప్ప | 130 |

# ❋ కృత్యాది ❋

రాష్ట్రసిద్ధికొఱకు రక్తమ్ము గార్చిన
కవిని నేను గాంధికవిని నేను
బడలి బడలి తల్లిబాస కూడెము సేయు
కవిని నేను దేశికవిని నేను.

అల నన్నయ్యకు లేరు. తిక్కనకుఁగా కాంధ్రప్రజానీక హృ
జ్జల జోన్మీలనకృత్ ప్రభాకరవిభాసంకాశసాధూక్తి మం
జుల పుంభావసరస్వతుల్ గుణగరిష్ఠుల్ భావుకుల్ భక్తు ల
స్ఖలితస్ఫారయశోమహోధవళి తాశాసానువుల్ మాదృశుల్.

కల్లకసటులేనిపల్లెలో నాఁగలి
దున్నువారు నన్ను గన్నవారు
మడికి నొక్కపూఁట. బడి కొక్కపూఁటగా
దాఁటినాఁడఁ జిన్నతనము నేను.

ఏకశ్లోకరహస్య బోధనముచే నెవ్వాఁడు శిష్యున్ సుధీ
లోకాగ్రేసరుఁజేయు, నవ్విబుధుఁ గొల్తున్ వేంకటప్పార్య్య, న
స్తోక శ్లోకమయూఖ రాజదఖిలాశున్, రామగాథామృతా
ఖ్యాక గ్రంథమతల్లికా జనకు, మద్గైర్వాణభాషాగురున్.

సత్యనిష్ఠ, శబ్దశాస్త్ర మర్మజ్ఞత,
కరుణ కల్గి నన్నుఁ గలఁచు నిరులఁ
దొలఁగఁ ద్రోసినట్టి దువ్వూరి వేంకట
రమణరవికి వందనము లొనర్తు.

నేలవిడిచి సాము నెఱపిన యట్లుండు
సంఘగతికి దవ్వుసాగి వ్రాఁత;
యుక్తిచణతగాదు, యుగలక్షణము గుబా
ళింపవలయుఁ గావ్యలేఖనమున.

ప్రాఁత దన్నది సర్వంబు రోఁతగాదు
క్రొత్త దన్నది సర్వంబు గుణముగాదు
ప్రాఁత క్రొత్తలలో మేలిరీతు లెఱిఁగి
చేయవలయును సాహితీసృష్టి సుకవి.

దేవుఁడు కలఁడని చెప్పిన
ప్రావక్కణవలయుఁ; గాని బాఁపలు మాలల్

దేవునిగుడి కర్చకులై
పోవచ్చునటన్న క్రొత్తబోధయు వలయున్.

గిఱిగీచుకొన్నకవి కృతి
చిరకాలము నిల్వ; దెల్లసిద్ధాంతములన్
దరియించి విప్లవముదెస
కరిగినకృతి సత్యదర్శియై రాణించున్.

కళకొఱకే కవిత్వమని గంతులువేయక, రోఁతరోఁతగా
వలపులు నింపి కబ్బములు వ్రాయక, విశ్వజనీన బోద్ధృతా
లలిత, ముదారవృత్తము, కలాకమనీయము, సంస్కృతిప్రభా
మిళితమునైన సృష్టి నెదమెచ్చితి, జాతికిఁ గాన్కలిచ్చితిన్

కృతిని జీవగఱ్ఱగతి నుపదేశమ్ము
కుదురుకొనుట మేటిగుణము గాన
జాతి కుపకరించు సందేశమును గళా
న్వితముగా వచించు వితము నాది.

మచ్చుమసకలేని మనుగడ నర్థించి
మలఁగినాఁడ వెతల నలఁగినాఁడఁ
ప్రజకు నింపు నింపు ప్రన్ననికబ్బముల్
వ్రాసినాఁడఁ కీర్తి మోసినాఁడ

కాసులకు నాసచేయక
వ్రాసిన కబ్బములనెల్ల వరణీయకథా
భాసురులకు నర్పించితి
నాసుకృతమ్ములు ఫలించినవిలే యనుచున్.

ఈ మేనెంత నలంగిన
నామనుగడ లోకసేవనమ్మున కిడెదన్
సామాజికకల్యాణము
కామించెద నవ్యభవ్యకవితాసృష్టిన్.

అంచితులైనవారు కొనియాడిరి, బంగరుపూలజల్లులో
ముంచిరి, గండపెండియరమున్ ఘటియించిరి, యేన్గుమీఁద నె
క్కించిరి, హైమకంకణము నిచ్చిరి, వేలకొలందికానుకల్
నించిరి; యే వలభ్యములు నీకృపగల్గినయట్టివారికిన్, (భారతీ!)

నను దిద్దెను నను మెచ్చెను
నను( బ్రాణమువోలెఁ జూచె, నావైభవమే
తన వైభవమని పొంగెను
తెనుఁగుజగం; బీ ఋణమ్ము దీర్పంగలనా!

## ఆకాంక్ష

ఎట్టికఠోరదీక్షలు సహించితినో తొలుబాముసందు, నీ
కెట్టిదళంబు, లెట్టివిరు లిచ్చి, నమస్య లొనర్చినాఁడనో!
పుట్టితి నీసుతుండనయి, పోఁడిమిగంటిని తల్లి! వీనికిన్
బెట్టుము భిక్ష నీయనుఁగుబిడ్డఁడుగా నెపుడున్ జనింపఁగన్.

నీరమణీయమూర్తి, కమనీయవచస్స్ఫురణంబు, దాతృతా
గౌరవ, మద్వితీయరసికత్వవిభూతి, విశిష్టశౌర్య, వి
ద్యా రుచిరత్వ, మెంతకొనియాడిన మత్కవితాపిపాస చ
ల్లాఱ దదేమి తల్లి! యిది యాఱక మాఱక యిట్లె నిల్చుతన్,

నాకే కాదు భవచ్చరిత్రము లనన్యప్రాప్యధారా రస
శ్రీకందమ్మన నందగించుకవితన్ చిత్రించుభాగ్యంబు, ను
ద్రేక స్ఫూర్తియు, నస్మదీయమగు పుత్రీపుత్రకశ్రేణి కీ
వాకల్పాంత మనుగ్రహింపఁ గదవమ్మా! ఆంధ్రవీరప్రసూ!

## చల్లపల్లిరాజా శ్రీ యార్లగడ్డ శివరామప్రసాదుగారు

దీక్షంబూనితి నాంధ్రరాష్ట్రమును సాధింతున్, దదీయక్రియా
రక్షన్ జేసెద నెట్టికష్టమయినన్ రానిమ్ము, కానిమ్ము, మా
తృక్షోణీయశ ముద్ధరింతు నని భక్తిన్ గంకణం బూను నీ
కక్షయ్యం బగు నేర్లగడ్డశివరామా! చల్లపల్లీశ్వరా!

ప్రాకటరక్తిఁ బూని పలుబాముల కోర్చి గడించె మొన్నఁ బ
ర్లాకిమిడిప్రభుండు *నిజరాష్ట్రము; నీవు త్రిలింగరాజ్యల * ఒరిస్సా
క్ష్మీకమనీయవైభవవిశిష్ట మహోత్సవ కారణంబవై
నీకృతకృత్యతం బ్రజ గణింప రహింపఁగదయ్య! భూవరా!

కచ్చెల్ పెంచుచు రచ్చకెక్కుచుఁ బ్రజాకల్యాణమం దెన్నఁడే
నిచ్చం జూపక, లచ్చలున్నఘను లిస్సీ! విత్తమున్ రిత్తగా
వెచ్చంపెట్టెడి వేళ, దేశజననీ విక్లేశ విచ్ఛిత్తికై
నిచ్చల్ డస్సెడి నిన్ను మెచ్చవలదా నిస్తంద్ర వాగ్ధోరణిన్!

నీసౌజన్యము నాంధ్రమండలయశో నిర్మాణ కృత్కార్య దీ
క్షా సంపత్తి నెఱింగి పొంగినది నా స్వాంతమ్ము; వాణీవిపం
చీ సఖ్యమ్మును గన్న యీకవిత నిచ్చెన్ గాన్కఁగా నీకు, నే
లా సందేహము? స్వీకరింపఁగదయ్యా! నేతృచూడామణీ!

ఆంధ్రరాష్ట్రసిద్ధి కశ్రాంతసేవతో
నీవితోఁదపించు టెఱిఁగి యెఱిఁగి
చల్లపల్లిధరణివల్లభునకుఁగాన్క
గాఁగ నిడితి "రాష్ట్రగాన" కవిత (1938)

పెల్లుగ భోగభాగ్యములు పిండెడు దేవరకోటరాజ్యమున్
జల్లగ నేలు రాజకులచంద్రుఁడ వయ్యును బేదవాని కి
ట్లల్లుఁడవైతి వొక్కహృదయంబు వినా మఱి ముద్దుముచ్చటల్
చెల్లఁగ నేమికట్నములు సెప్పెద సాలువు లేమి కప్పెదన్.

రోసము చెంది డెందమున రోయకు మీ కవితాలతాంగి నీ
గీసిన గీఁతలో నిలువకే పయనించుచు, నెల్లవారి సా
వాసము లాసచేయు, బలవంత మొనర్చిన మాన దిట్టి య
భ్యాసము లాఱునూఱయినఁ, బాపటవెంద్రుక వెల్లఁబాఱినన్.

కోటల్ దాఁటిన దాఁటుఁగాక, యిది తెల్గుంగొమ్మ లేఁదోఁటలోఁ
దేటల్ చల్లు నొయారిమల్లెపొదరై దీపించి, భూభృత్సభా
వాటీ సత్కవిలోక పండితఘటా వాచా పరిస్తుత్యమై
నీటుం గుల్కెడు కీర్తి నీ కొసఁగు, నీ నెయ్యంబు సామాన్యమే?

## ❋ శ్రీమంతు చల్లపల్లిరాజాగారికి కృతజ్ఞత ❋

(కనకాభిషేకమహోత్సవ సందర్భమున)

బంగరుగండపెండెరము పాదమునం దొడి నన్ను సాహితీ
రంగము నెక్కఁజేసి శివరామవిభూ! కవిజాతి పట్ల నీ
కుం గల మక్కువన్ దెలిపికొంటివి, తావక కీర్తినర్తకీ
భంగిమ కాంధ్రలోకము సెబాసనుచున్ దలయూఁచె ముగ్ధమై

మనుచరితమ్ము సెప్పి నృపమండలమండనుఁడైన కృష్ణరా
యని మురిపించి బంగరపుటందియ నందెను బెద్దనార్యుఁ; డే
ననితరలభ్యపుణ్యుని మహాత్మునిగాథను సర్వకాలమున్
మను చరితమ్ముఁజెప్పి నృపమండన! పొందితి నీ బహూకృతిన్.

పాలకపాలితుల్గలసభన్ బ్రభుకుంజర! నీవు వంగి, నా
కాలికి నందెవైచి కవిగౌరవమున్ గొనియాడుపట్ల నీ
శీలము ముందు సభ్యులు విశిష్టమతుల్ తలయొగ్గ, మోద భా
రాలసచిత్తవృత్తిని జొహారులువెట్టితిఁ దల్లి కాంధ్రికిన్.

"ఇతఁడు కవీంద్రుఁ డంచు నుతియించుట నాపనిగాదు, నా
కయాచితముగ "రాష్ట్రగాన"మిడి చిక్కని చిక్కనికీర్తి గూర్చి, య
ద్భుతమిది మద్గృహాంగణము త్రొక్కఁడు ప్రార్థిఁతుడయ్యు నిమ్మహా
మతి" యని నన్ను నీవు బహుమానము సేయుట చాలు భూపతీ!

(1949 తపస్సిద్ధి)

## ✳ మహాదాత శ్రీ కొసరాజు లక్ష్మయ్య ✳

(నిడుబ్రోలు - గుంటూరు)

చేత నొక కుంభకోణంపుఁ జెంబు తోడఁ
గక్ష నొక వగ్గు వంకర కఱ్ఱతోడ
నొసటిపైఁ దిరునామంపు ముసుఁగుతోడ
గునియు సన సన్నపసిఁడిపోఁగుళ్ళతోడ
మలఁచి కట్టిన నీర్కావివలువతోడ
డాపలించిన మీఁదిపుట్టమ్ముతోడ
బడలి పల్లకిబొంగైన యొడలితోడఁ
దళుపివెన్నెల విరియించు శిరముతోడఁ
దూలి గుంటలువడిన కన్దోయితోడఁ
దేపతేపకు బెదరెడి చూపుతోడ
నల్లనల్లన మనబడి కెల్లనాఁడు
వచ్చి గదిగది చూచు-దేవళముఁజేరి
వలగొనిన యట్ల-బడిఁ జుట్టివచ్చుచుండు
నితనిఁ గన్నంతనే కుఱ్ఱ లిహిహి యంచు
వినుకలిం బాసి గోల గావించుచుందు
రితని రాయిడి నానాఁటి కెచ్చుఁదొడఁగె
నెవ్వఁ డీ వెఱ్ఱివాఁ? డితం డెచటివాఁడు?
గట్టిగా మందలింపక యిట్టివాని
నేల మన్నింతు రొజ్జ? లిదేమి తాల్మి?

రెండేఁడులనాఁ డజ్ఞత
నిండిన యిప్పలుకు లంటి నిడుఁబ్రోల్‌బడిలోఁ

బండిన పాపం బపుడే
పండితుఁగా నిటకుఁదెచ్చి పడవైచె ననున్.

ఆమాటలువిని సుగుణ
శ్రీమన్మణి సాటియొజ్జ చినరోశయగా
రేమేమీ ! నీ వెఱుఁగవె
యీ మానిసికథలు వింత లీ నీ మాటల్.

నిడుఁబ్రోల్ కని పెంచిన దీ
బుడుతన్ గొసరాజువారి పుణ్యగృహమునన్
సడినన్న బాపయాఖ్యుని
కొడుకై లక్ష్మయ్య యితఁడు కొమ రొందుఁ జుమా!

పదియేండ్లకు ము న్నీ బడిఁ
బదిమందియు నాదరింపఁ బ్రజ పాలించెన్
మొదలిటినాళ్ళన్ దీనికిఁ
గొదవలు పె క్కొదవెఁ దగినకోశము లేమిన్.

ఇరువదాఱేండ్లనాఁ డియ్యది పొన్నూరఁ
బూరిపాకలలోనఁ బ్రొద్దువుచ్చు
తరుణమ్మునందుఁ దొల్కరివాన కడవలఁ
గ్రుమ్మరించినయట్ల కురియఁజాగ
నపుడె సముద్దాంతమై మహాసంవర్త
తీవ్రవాతంబునా దిక్కదంబ
మల్లాడ గిరులు కంపిల్లఁ బెల్లుగ రేఁగి,
పెనుగాలి విసరెఁ, దద్భీకరార్భ
టికి జగమ్ముగుండె వికవిక లయ్యె, ను
ద్ధూత మాయె సకలభూతరాశి,
మోకు తిరుగలేని మ్రాఁకులు పెళపెళ
ధ్వనులతోడ వ్రస్సి ధరణిఁ గూలె.

బడిపాకలు తొలిదెబ్బకె
యడఁగెన్, రాడులును గొమరు లాకులు పెండెల్
గడలున్ దడులున్ దొమ్మిది
కడలందున్ జెల్లచెదరుగాఁ బోయిపడెన్.

భావనాచార్యు లల్ల న్యాపతి హనూమ
దాఖ్యు(డును, మాడభూషి రామానుజార్యు(
డాదిగా(గల సభ్యు లయ్యవసరమున
నలమటం దిగ(ద్రావి ధైర్యమ్ము నూ(ది

వేలు గలవారి, లక్షలు
మూలుగులో(గిళ్ళవారిముంగల, బడి బ
న్నాలు వివరించి, మీకృప
కాలంబముగా(గ దీని నరయు(డు విజ్ఞుల్.

అని విన్నవింప నొక(డున్
గనికరమును జూప( డయ్యె(, గర్తవ్య మి(కన్
మన కెద్ది యనుచు( గల(గిన
మనములతో నింటిదెసకు మల(గిరి సభ్యుల్

అనువత్సరకార్తికవన
ఘనోత్సవా వసరమధురఖాదనభక్ష్య
ప్రణిపాత సమభితర్పిత
జను( డెదురై వచ్చె నిత(డు సభ్యుల కంతన్

ఇద్దఱు కూ(తులతో, ముస
లెద్దులతో, రెండుగొర్ల కెచ్చనిమడితో,
నిద్దాతనమ్ముతో, నిలు
దిద్దుకొనున్ నా( డితండు తియ్యనిచెలితోన్

ఎన్న(దగిన కల్మియన్నది లేకున్న
మున్నితండు సల్పు నన్నదాన
మన్నియూళ్ళప్రజలు విన్నది యౌట ల
క్ష్మన్న మీ(ద వారి కన్ను వ్రాలి

ఇన్నెఱి నీతని మెచ్చుచు
నన్నా! లక్ష్మయ్య! కుశలమా! నీ కథలన్
విన్నారము, కన్నారము
*కన్నాకవు నీవ యీవిగలవారలలోన్ *(శేష్ఠుడవు)

నిన్నటి ఝుంఝూ ఝుంపలు
మన్నిగొనియె నొక్కత్రుటిని మనబడి నకటా!
కన్నా(డవె రా రమ్మని
క్రన్నన విద్యాలయంబుకడ కీ సుకృతిన్

తోడుకొనిపోయి, బగ్గము
పాడై దయనీయమైన బడిఁ జూపి, కడున్
వాడిన మొగములతో ని
ట్లాడిరి ధీనిధులు భావనాచార్యాదుల్

విద్యలేమిఁగాదె వేయేండ్లనుండియు
మోవరానిదాస్యమునకుఁ జిక్కి
పరితపించుచుండె భారతదేశమ్ము
తల్లిగోడు మాన్పఁదగదె సుతులు

దానమ్ములందు విద్యా
దానం బది ప్రథమగణ్యతం గను లక్ష్మ
య్యా! నీ వెఱుఁగని ధర్మువుఁ
గానము, మేల్బంతి వీవు, గఱువల కెల్లన్

ఈ పాఠశాలయే మగ
పాప సుమీ నీకు; దీనిఁ బరిపోషింపన్
వేపూను; మిహపరశ్రీ
నీ పాలం బడును ద్రిభువనీ పూజ్యముగన్

అనవుడు ని వ్వీరుఁ డల్లన నవ్వి
యోపెద్దలార! విద్యోన్నతులార!
యేనేడ, నీచేఁత యేడ, నావంటి
బడుగుమానిసి యింతబరు వూను టేడ

నన్ను మన్నింపుఁ డన్నలు! సంతతార్థ
సంపన్ను లగువారి సాయమ్ము గొనుఁడు
నాకుం దగిన కాన్క నన్నేలు ప్రభువు
లనుమతించిన కాన్క నందింతు నెల్లి

ఆనాఁటి రేయి నిద్రా
ధీనున కాస్తిక్యసేవధికి నిజపాద
ధ్యాన సుధాపాన మహా
లీన స్వాంతునకు మధురలిప్సానిధికిన్

ఈ లక్ష్మయకు యశోదా
బాలుఁడు సాక్షాత్కరించి భక్తశ్రేయో
లోలుఁడు దరహాసరమా
లాలితవదనంబుమైఁ కలం బల్కె నిటుల్

వనసమారాధనంబు లవ్వారిగా నొ
నర్చి నను( దన్పుచుంటి వీనా(టిదనుక(;
జాలు ని(క నన్నదానముల్ చాలు, నీదు
మదిని మరలింపు మొండొక మార్గమునకు

ఆపన్నంబగు పాఠశాలకయి సాయం బర్థిమై వే(డ(గా
నాపై భారము వెట్టి వచ్చితివె యన్నా! నిన్ను( బొన్నూరిలో;
నీపావిత్ర్య మనన్యసాధిత మహా! నీ వొజ్జవై లోకపుం
బాపంబుల్ తెగ(జూడ నేర్తువని సంభావింతు నిన్ లక్ష్మణా!

లే లె మ్మెవ రే పగిదిన్
గేలి యొనర్చినను నీవ గెల్తువు; నా ప
*ల్కాలము సేయకు, విద్యా *(ఆలము=ఉపేక్ష)
శాలోద్ధరణప్రయత్న శాలివి కమ్మా!

అని పల్కి తిరోహితు(డై
చనె న(ట; యీసాధులోకసత్తము( డంతన్
దన వేల్పుం గొనియాడుచు(
గనుదెఱచెన్, సతికి స్వప్నగాథలు వినిచెన్

ఆ పడ(తుక యీ పురుషున
కేపుణ్యఫలంబొ "శంక లేటికి బృందా
గోపాలుపన్ను శిరమున
వే పూన( గదయ్య! మల్లెవిరిదండ వలెన్," (అనుచు
నాథు(దెల్పెన(ట)

పదపడి మనలక్ష్మయ డె
బ్బది యేన్డుల బలముతోడ బడిపని( బూనెన్
బదియూళ్ళకు( గూడలియై
పొదలెడి యిచ్చోటు విలిచి పుణ్యాహమునన్

త్రవ్వె( బునాదులు, కార్మిక
జివ్వన రావించె, నెల్లజేపులు మాపుల్
నొవ్వెఱు(గ కన్నిపనులం
దివ్వీరు(డు పాలుగొనియె నించినవేడ్కన్

పాల మమ్మె, న్నగ లమ్మెను
గలవస్తువు లెల్ల నమ్మె(, గడ కిల్ల మ్మెన్

మలమల నెండకు మాడుచు
లలిఁ జెట్టున కుట్టిగట్టి లక్ష్యము గొట్టెన్

ఇతని యీవిచే నహీనయై నిడుఁబ్రోలి
పాఠశాల ప్రాజ్ఞపణిత యయ్యె;
వసుపు నొసఁగియొసఁగి కొసరాజు లక్ష్మయ్య
పెఱలగొడ్లఁగాయు పేద యయ్యె

తన రక్తమాంసములతోఁ
దనసర్వస్వమ్ముతోడఁ దనిసిన బిడ్డన్
దినదినము న్జూడక యీ
జనకుఁడు నిలఁజాలఁ డీ విశాలగృహమ్మున్

ఇతఁ డిచ్చు నింటితో ను
న్నత విద్యాశాలయై తనర్చి మనీషా
చతురుల వెలయించుచు సం
స్తుతి గను నీబడి నితాంతసుందర మగుచున్

ఈతఁడు సక్తుప్రస్థం
డీతండు మరుత్తుఁ, డీతఁ డినసూను, వహెూ!
యీతఁడు బలి, యీతఁడు శిబి
యీతండు దధీచి, పూజ్యుఁ డితఁ డెల్లరకున్

శ్రుతులును బ్రహ్మవేత్తలును సూనృతవాదులు గోవులుం బతి
వ్రతలు నలుబ్దులై నెగడువార లుదారవదాన్యతా కళా
రతులున కాక యిమ్మహిభరమ్మున కెవ్వరు చాలువారు; ప
ర్వతములు నేన్గులు న్ఫణియుఁ పందియు
మోయుటనమ్మనయ్యెదన్

ప్రజల కొఱకు నిట్లు బలివోవు లక్ష్మణు
నూరు పేరు తడవఁ డొక్కఁడేని
లోకమెంత గ్రుడ్డిదో కదా, చెన్నఁటి
వానిఁ బిలిచి పీటవైచి కొలుచు

ఎక్కలేరు చరిత్ర కీ మహామహులు
లేమి కొందఱపేరు లేకుండఁ జేసెఁ
కులము కొందఱపెంపు గోతిలోఁ ద్రొక్కె
మతము కొందఱరూపు మాపి యుప్పొంగె

ఇతఁ డింత యొప్పనే ఋషి
నతిమాత్ర పవిత్రతాసమంచితు వీనిన్
మతిలేక దూఱు నా కే
గతి కలదో మోవరాని కలుషమ వచ్చెన్

వాచాదోషం బిది సెడ
మోచాఫలమధుర విశ్వమోహన చాటు
శ్రీ చిక్కణ మస్మత్కృతి
కీ చారుకథానిధాను నీశు నొనర్తున్

సొరుగల ఖండకావ్యము లేఱియేఱి
'పఱిగపంట' నా మెఱయుచుఁ బ్రజలకొఱకుఁ
గరఁగికరఁగి జాలైన లక్ష్మయకు ధర్మ
వీరునకు దాని నుపదఁ గావించినాఁడ

నాల్గువందలు వెచ్చించినాఁడ విత్త
మితనిసత్కృతి కమనీయగతిని సాగఁ
జిత్ర మితనిది నిర్మింపఁజేసి బడికి
నిచ్చినాఁడ జనుల్ చాఁగురే! యనంగ

పింగళి మనీషిసత్తము, విశ్వనాథ (పింగళి లక్ష్మీకాంతము)
కవివరేణ్యు విమర్శకగణ్యుఁ, బుణ్యు (సత్యనారాయణ)
నున్నవామాత్యుఁ, దెచ్చి కృత్యుత్సవమ్ము (ఉన్నవ లక్ష్మీనారాయణ)
రసమయం బొనరించితి రాముదయను

ఈ కృతిపతికథఁ జాటెడి
నాకవితం జదివి తెనుఁగునాటం గల సు
శ్లోకులు కొందఱు వచ్చిరి
శ్రీ కొసరాడ్వంశ్యు నీక్షచేసి యెలర్పన్

(పఱిగపంట - 15-9-43)

## దేశభక్త, ఆంధ్రోద్యమసారథి
## ❊ శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు ❊

కడలుకొని దాస్యశృంఖలా కాళరాత్రి
ముసురుకొల్పు తమస్సులో ముసుఁగుదిద్ది
కాలు బిగఁదన్ని రేలు పగళ్ళు మఱచి
తరతరమ్ములు శతశతాబ్దములు దాఁటి

గుబ్బువెట్టుచునున్న తెల్గుంబొలమ్ము
దశదిశల నొక్కపెట్టున దద్దరిల్లఁ
గొసరి మేల్కొల్పు పాడిన కోడిపుంజు

నీచ పరతంత్రతాపిశాచీ చిరత్న
గర్వనిర్వాస నారబ్ధ కదనకేళీ
నోడిగిల్లని రక్త మెవ్వాఁడు మోయు
నతఁడు కశ్మలజలవాహియైన యలఁతి
గుంటయని వీరగితమ్ము క్రోల్చి క్రోల్చి
కులముచెవిత్రుప్పు డుల్చిన కోకిలమ్ము

రగిలిరగిలి పైకొన్న పరప్రభుత్వ
రోష దావానలచ్ఛటా రుంద్రధాటి
కోహటిల్లక పిడుగుల నురవడించి
గర్జచేసిన తొలుతెల్గుకాఱుమబ్బు

తూర్పు పడమర లెరుఁగక తొలకరించు
మార్పు తెలియక వేఁడినిట్టూర్పు లూర్చు
తెలుఁగుసంసారమును గాంచి కలముపూని
సార విజ్ఞానచంద్రికాపూర మాంధ్ర
జగతి వెల్లిగొల్పిన కళాసాగరమ్ము

శారదాపాద హైమమంజీరనాద
కాంచికారత్న కింకిణీ క్రమనినద
పులకితమ్ముల జనపదమ్ముల రచించి
లలితవిశ్రుతి నార్జించు తెలుఁగువీణ

పేరుపెంపులు లేక యేఁకారుచున్న
యఱవపితలాటమున నిచ్చ లఱఁగుచున్న
కష్టజనకంబు నుమ్మడికాఁపురంబు
నీఁదలే కాదరించు ది క్కేదియున్న
తల్లిదైన్యమ్ముసూచి స్వార్థమ్ముఁ ద్రోచి
రాష్ట్రనిర్మాణ దీక్షారిరక్ష నాంధ్ర
జన మహోద్యమ స్యందన సారథిత్వ
భరము పూనిన తెల్గులపసిఁడికొండ
గాడిచర్ల కులార్ణవ కౌస్తుభంబు
తెలుఁగుఁదోఁటను విరిసిన వెలఁదిమల్లె

యగుచు మన హరిసర్వోత్త మాభిధానుఁ
డఱువదివసంతముల పెంపు ననుభవించి
మూఁడుకోట్ల తెలుంగు లీనాఁడు పొంగఁ
బంచిపెట్టెను సంక్రాంతిపర్వసుఖము

వీరపూజా మహోత్స వావిష్టులగుచు
నారతులు పట్టి రాంధ్రు లుదారమతులు
జయజయారావ మింటింట సందడించె
నక్షరానంద మింటింట నవతరించె
మాతృసేవాపరాయణ మనసుఁ డగుచు
దేశగౌరవరక్షణో ద్రిక్తుఁ డగుచు
లోకకల్యాణ కృత్క్రియా లోలుఁడగుచు
నీదృశమహోత్సవంబు లెన్నేని బడసి
తెలుఁగువీరుఁ డితండు వర్ధిల్లుఁ గాక!
తెలుఁగుతల్లికిఁ దనివి సంధించుఁగాక! (శబల -10-1-1946)

## ❊ శ్రీ పాములపాటి వేంకటకృష్ణయ్య ❊

(గుంటూరుజిల్లాబోర్డు అధ్యక్షులు - నిడుబ్రోలు).

పాలించితివి గర్తపత్తనమండలం
బఖిలాంధ్ర జయరవాభ్యంచితముగ
నెలకొల్పితివి సీమఁగల పల్లెపల్లెకు
నున్నతవిద్యా ప్రయోగశాల
పోషింతివి నైకభాషా మనీషుల
నుద్యోగ సద్యోగ యుతుఁల జేసి
చిత్రించితివి ప్రజాసేవానురక్తుల
పాలింటి యొజ్జయౌ మేలిబాట

గడనచేసితి హరిదంతకరి కపోల
తటసర ద్వా:కణప్రీత చటుల మధుప
గీతము యశమ్ము వేంకటకృష్ణసుకృతి!
తావకము జీవనం బహో! ధన్యతమము

హిత మిది మాతృభూమి కని యెంచుట నించుట నాంధ్రమండలీ
ప్రతినిధివై సమస్త సదుపాయములన్ సమకూర్చి కర్షక
వ్రతములు పండఁ దెచ్చితివి *భావపుర వ్యవసాయపీఠ; మీ
చతురత కీ యుదారతకు సర్వజగమ్ములు పొంగె ధీనిధీ!

*బాపట్లవ్యవసాయ కళాశాల

ప్రకటితాంధ్రోద్యమ ప్రథమశంఖారావ
    కంపిత దశదిశాకందరంబు
భావనారాయణప్రభు కటాక్షశ్రీ ప
    రంపరా వలయిత రమ్యభూమి
ప్రాగబ్ధివీచికా పరిశీతల సమీర
    శాబక క్రీడాప్రచారవేది
వివిధవిద్యాకలాభవన సంతర్పిత
    భారతీ దరహాసభా విభాసి

*భావనగరంబు సర్వప్రపంచ జీవ            *బాపట్ల
హర్ష కారణ హలికవిద్యామయూఖ
పీఠమై ఖేటమై పంచిపెట్టెఁ దెలుఁగు
గడ్డ కీనాఁ డపూర్వసంక్రాంతి సుఖము     (5-12-46 - శబల+)

## అచంచల దేశభక్తుడు ఆంధ్రోద్యమనేత
## ❋ శ్రీ కొండ వేంకటప్పయ్య ❋

మచ్చ యొకింతలేని ఋజుమార్గము నీది, వరాలు వేలువే
లిచ్చెడువృత్తి దేశహిత మెంచి త్యజించిన మేటివీవు, నీ
పచ్చనిపంటగాఁ దెలుఁగుబంటులు లక్షలు లక్షలై జగం
బచ్చెరువందఁ గాంగ్రెసుమహారథ చోదకులైరి ధీనిధీ!

నీ వాంధ్రోద్యమ జీవదాతవుకదా! నిద్రాణమై దీనమై
చేవంబాసిన తెల్గుజాతి వికసించెన్ నీ ప్రభావమ్మునన్
నీవృన్మండలినెల్ల వెల్లిగొనుచున్ నిండారె నంధ్రక్ష్మా
దేవీకీర్తులు నీసపర్య కతనన్ దివ్యాపగా వేణికల్

గండరగండవై భరతఖండ సముద్ధరణైకదీక్షలోఁ
బండితి వీవు, గాంధిగురుపాదు లొసంగు శుభాశిషమ్ములన్
నిండితి వీవు, బొంకు నవినీతి నధర్మము నూఁచముట్టుగాఁ
జెండితి వీవు, కొండకులసింధుమహోదయ! వెంకటప్పయా!

ఎనుబదియేండ్లు నిండి యొడ లిట్లు కృశించిన నేమి, నేఁటికిన్
రణరణితమ్ము విన్న నపరాజితవిక్రమమున్ వెలార్తు వీ
మనుగడ సాగి సాగి శతమానము నందునటుల్ నినున్ జగ
జ్జనకుఁ డనుగ్రహించు గుణసాగర! త్యాగరమా ధురంధరా!

(శబల - 12-1-1947)

## ✳ జాతిరత్న శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్య ✳

(భారతజాతీయ కాంగ్రెసునకు అధ్యక్షులైన తఱి, మచిలీపట్టణము, కృష్ణాజిల్లా)

.................................................. తెల్గుజాతికిన్
మల్లెలుపూచెరా! మలయమండల మంజుల వాతపోతముల్
మెల్లన వీచెరా! నిరుపమేయమనీషకు నాలవాలమై
యెల్లలులేని ధీరతకు నిల్లయి, శూరతకున్ నిధానమై
పొల్లొక యింతలేని నుడిపొందికకుం గుదురై, జగత్తునన్
జెల్లెడు లెక్కలెల్లఁ దనచేతికనిష్ఠను జూపు యంత్రమై
నల్లవొ! మోహనుండు ఋషినాథుఁడుపల్కిన ఋక్కురూపముల్
తెల్లము సేయఁ జాలిన సుధీమణియై, ప్రతివాది ప్రక్కలో
బల్లెమునై, విపన్నులకు బంధువుడై, పగవాని మృత్యువున్
నల్లను వాంఛసేయని రణమ్మున నోటయొకింతలేని, యే
యల్లరిపాలుగాని మగఁడై, ఫలమొల్లని కర్మయోగియై,
.................... ప్రజల సత్కృతు లందిన యోధుఁడై, విరా
జిల్లిన భోగరాజకులసింహము కాంగ్రెసునేత యయ్యెరా!

భల్లరె! భోగరాజకులపావన! నీ తలఁపెంత యౌచితీ
వేల్లితమోయి! యెంతటివివేకము నేర్చితివోయి! యింతకుం
దొల్లి యెఱుంగనట్టి యకుతోభయతన్ జయపూర్మహాసభన్
బిల్లలు పెద్దలుం జెలఁగి పింపిసలాడ సువర్ణరత్నరుగ్
వల్లరియౌ కిరీటమును వర్ణితమున్ ధరియించి, కుట్రకుం
కల్లకుఁ బేరుపడ్డ రిపుకాండము బమ్మెరవోవఁగా రథం
బుల్లలితం బొనర్చి భరతోర్వియశంబును బెంపవోయి! నీ
యిల్లు తెలుంగుసీమ జగదీడితమై కెడనాఁడు లర్థిమై
నుల్లెడపట్ట రాష్ట్రవిజయోత్సవడోలల నూఁగు లగ్నమున్
ఢిల్లిని దెల్గుమంత్రులు పటిష్టతమై హవణిల్లు భాగ్యమున్
పల్లవపుష్పగుచ్ఛఫలబంధురయై మనగాంధి భావనా
వల్లిక సాగు యోగమును వచ్చునటుల్ కృషిసల్పవోయి! నీ
కొల్లమి రానియట్లు సిరియున్, జవమున్, బల, మాయువబ్బి వ
ర్థిల్లెడునట్లు, నీప్రభుత దీర్ఘతరంబగునట్లు నీవు హెచ్చం
బల్లకి నెక్కునట్లు, జయభారతి హారతినిచ్చి మెచ్చుతన్!

(8-10-48 పఱిగపంట)

## ❋ దండివీరుడు శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యము ❋

(గాంధిశిష్యులు - అంగలూరు - కృష్ణా)

ఏదో పొంగొకనాఁడు రేఁగి ప్రజకై యే వీసమో డయ్యువా
రీ దేశంబున నెందఱో కలరు కానీ జీవితంబెల్ల సే
వా దీక్షన్ నడిపించుపుణ్యులు కృపావారాన్నిధుల్ కాన రా
రే దేశంబునఁ జూచినం బలువు రో యెర్నేని! యుష్మాదృశుల్

అసదాచారులు శాత్రవుల్ పశుబలాహంకార మేపార నల్
దెసలం బేర్చిననాఁడు దేశికుని గాంధిన్‌గూడి సత్యాగ్రహం
బసిగాఁ గైకొని దండిరంగమున శౌర్యజ్యోతివై జాతి మా
నసమున్ దోఁచిన మేటిమానిసికిఁనన్నా! నీకు జోహారువుల్

ఈ చతురబ్ధి ముద్రితమహిన్ మతిసేయవు, నాకభోగముల్
నాఁచికొనం దలంప, వపునర్భవమొల్ల, వనంత దు:ఖ రే
ఖాచితమైన లోకము సుఖంపడఁ గోరుదు వెల్లకాల, మీ
నీ చరితమ్ము వెన్నెలలు నించెనురా! హరిదంతరంబులన్

మీ గుడివాడసీమ నిరమిత్రుని బుద్ధుని ధర్మదుందుభుల్
మ్రోఁగిననాఁడు నెవ్వగల మున్గినపేదల ముక్తికై సుఖ
త్యాగమొనర్చి చన్న శుచితాఖని భిక్షుకరా జొకండు ప్రే
మాగమమూర్తి వెండియు బయల్పడెరా! భవదాకృతిం గృతీ!

ఓ సత్యాగ్రహి ! నీ జగద్ధితగుణ వ్యూహమ్ము నాలించుచో
నీ సౌజన్యము గాంచుచో నెడఁదలో నిండారు నా సాధు సే
వా సంసక్తికి లోఁగి పావనకథావాసద్వచోవైభవం
బీ *“సత్కావ్యము నీ కొసంగితిని నా యీ కాన్క మన్నింపవే!

*(గాంధి “ఆత్మకథ” వీరికిఅంకితమివ్వబడినది)

ఈ పూజాప్రసవంబు నందుకొనవోయీ! సూనృతాహింస లీ
రూపుం గైకొనివచ్చె నార్తజనతా రోచిష్ణుతా కాంక్షమై
బాపూజీ మనవేల్పు దీని నిచటన్ బండించె విశ్వప్రజా
పాపచ్ఛేదకమైన పంట యిది సుబ్రహ్మణ్య! నీపాలురా!
(ఆత్మకథ-1949)

## ❋ దానవీర శ్రీ గోగినేని వేంకటసుబ్బయ్య ❋

(మైకావ్యాపారవేత్త మానికొండ - కృష్ణా)

ఆంధ్రజననీసమార్జి తానంతసుకృత
మధురఫలమూర్తి కౌచితీమానితునకు
స్వాగతము! గోగినేనివంశప్రశస్త
వనవసంతున కౌదార్యవాసితునకు

ఓహెూ! వేంకటసుబ్బయార్య! సుకవివ్యూహంబె తత్తన్మహీ
మాహాత్మ్యమ్మున కాదిహేతువని ధర్మప్రీతి నేతత్సుఖ
శ్రీహాసమ్ములుకోరి వేలొసఁగు నీ చిత్తోన్నతిన్ మెత్తు నీ
మాహారాజిక సంపదల్ వెలయు నమ్లానమ్ము లిద్ధమ్ములై

లక్షలుగల్గువారు బహులక్షలు, వారలలోన దాతృతా
దీక్షితు లెందఱోకలరు, ధీనిశితత్వము చూపి సత్కలా
పక్షముమ్రొగ్గి నీవలె నపారధనమ్ము లొసంగి పొంగువా
రీ క్షితి నెందఱుందురు మహిష్ఠులు? వేంకట సుబ్బయాభిధా!

నను నిచ్చన్ గనకాభిషేకమున సన్మానించు నే చేఁతలోఁ
దనువెల్లం బులకించెఁ, గాని కవితాదక్షంబు శ్రీనాథతన్
గనఁగాఁ జాలితినంచు నించుకయు నే గర్వింప, గర్జాట నా
ధునిగా మాత్రమ నిన్ను మెచ్చి, వినుతింతున్ నీదు రాసిక్యమున్.

తెలుఁగుమహాప్రజా నయనదీధితిలోకములో సహస్ర రీ
తుల భవదీయదానకరతోయజరేఖలు తాండవించె నీ
వెలఁదివెలుంగువెల్లువలు విశ్వము నిల్చిన యంతవట్టు ను
జ్జ్వలములు పొమ్ము! నీజనువు సార్థకత న్గడియించెఁ జౌదరీ!

విన్నార మనవేమవిభుని దాతృత్వంబు
 జలజల నొడనెల్లఁ బులకరింప
పఠియించితిమి సార్వభౌము వాచావీథి
 హరిహరేంద్ర త్యాగనిరతిపెంపు
తెలిసికొంటిమి గుంటుపలి రాయనామాత్యు
 భాస్కరు వితరణ ప్రాభవంబు
విశ్వసించితి మాత్మ వేంకటాద్రినరేంద్రు
 సడిసన్న యౌదార్య సాహసమ్ము

నేఁటి కాంధ్రులభాగ్యంబు నెఱయఁబండి
చూచుటయ కల్గె లోకవిశ్రుతము సాధు
హితమునై పొల్చు నీవదాన్యతను; దాన
వీరునకు నీకు విజయాభివృద్ధిరస్తు!

కలిమిని సత్సంతానము
కలిమిని వితరణగుణమ్ము, కలిమిని గవికో
కిల కులము కాకలీ కల
కలముల నీ కుదురె కుదురుగా రవణించున్

జయ మెసంగుఁగాత సర్వదా శారదా
పాద కటకనాద సాధుమాధు
రీ ఝరీ ప్రసూ వరీయోంధ్రకవితా మ
హెూవిధాతృ పూజ నోత్సుకులకు

(తపస్సిద్ధి -1949)

## ❋ విశ్వకవి శ్రీ రవీంద్రనాథఠాగూరు ❋

(నోబెల్ సాహిత్య అవార్డు గ్రహీత కలకత్త)

రవిరచనలు సాహిత్య
చ్ఛవితో వెల్వడిన యుపనిషత్తులు; తాదృ
క్కవితాస్రష్టల కీర్తికి
నవత వినా, రాదురాదు నవఁత లవమ్మున్

(నవత -క్రొత్తదనము; నవఁత-కృశించుట)

కారణజన్ము విశ్వకవిగా నవనమ్ములు గన్నవాని ఠా
గూరును బూర్జ్వాకవులకోవకు నెట్టి, తదీయసాహితిన్
బేరిచి, పేర్చుచున్ దగులబెట్టిన వీరుల విన్న గుండె బే
జారగుచుండెఁ దచ్చటుల చండిమకున్ బదివేలదండముల్.

## ❋ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి ❋

(మహాకవులు, విమర్శకులు, మైసూరు, ఆంధ్రవిశ్వవిద్యాలయముల కులపతులు -చిత్తూరు)

ప్రాచ్యపాశ్చాత్య సభ్యతాభవ్యమూర్తి
సాహితీపరిశీల కాచార్యమౌళి
వీరతానిధి విద్యాప్రవీణుఁ డెవ్వఁ
డతని రామలింగారెడ్డి నాత్మఁ దలఁతు.

(తుమ్మలవారి కనకాభిషేకమహోత్సవసభకు అధ్యక్షుడైనతఱి)

సాక్షాత్తావకమూర్తి, విశ్వకవితా సౌందర్యరేఖారహో
వీక్షాదక్షమనీషి, మాతృజగతీవిజ్ఞాన పీఠప్రథా
రక్షాశీలుఁడు, కట్టమంచికులమూర్ధన్యుండు, నన్మెచ్చు న
ధ్యక్షుండయ్యె, నిఁకేమికావలయు నంబా! నా తపస్సిద్ధికిన్

తిక్కనకైతలోఁతులు మథించిన రెడ్డి మదీయవాగ్ధునిం
బుక్కిటిబంటిగా మునిఁగిపోయెనటే! "కనులున్నఁ గానరో
చక్కనికొమ్మసొరు" లని చాటె నిజానుభవమ్ము; సాహితీ
రుక్మమనీయ వైభవ నిరూఢున కీతని కంజలించెదన్.

(తుమ్మలవారి "బాపుజీ ఆత్మకథా" కావ్యశైలి యించుమించు ఆంధ్రమహాభారతప్రతిబింబము-అని ప్రశంసించినారు).

(తపస్సిద్ధి-1949)

## ❋ శ్రీ కన్నెకంటి వీరభద్రాచార్యులు ❋

(పల్నాటిసోదరకవులు-మోర్జంపాడు-గుంటూరు)

ఎట్టు రచింతువోయి! బిగువించుకజాఱదు వీరభూమిలోఁ
బుట్టిన నీకు నిట్టినుడిపొంకము సాజమ! శిల్పివీవు చే
పట్టిన వస్తువెల్ల రుచిబంధురసుందరరూపకల్పనా
హట్టముగా రసజ్ఞహృదయాబ్జము లాఁచికొనున్ గవీభమా!

నాకడ నీవు నేర్చినవి నాలుగుముక్కలు; నీకు నీవుగాఁ
బ్రాఁకి గడించుకొన్న ప్రతిభాఫలముల్ శతముల్ సహస్రముల్
చేకొనివచ్చి కానుకలు చేసితి నాకిపు డీయుదారతా
శ్రీకృతి కస్మదాత్మ వికసించెనురా పలునాఁటిసత్కవీ!

*అంజెదవేల పేదనని యాడెదవేల మనోజ్ఞమీ "సువ
ర్ణాంజలి" నిచ్చుచున్; వినయమాయిది? యౌ నది యుగ్గుఁ
బాలతో
నంజినవిద్య నీయెడ; వినమ్రరసాలమకాదె మాధురీ
మంజులముల్ ఫలంబు లిడి మానసమున్ దనియించు నెచ్చెలీ!

* జంకెదవేల (తపస్సిద్ధి-1949)

## ❋ శ్రీమతి దాస్పలపూడి అనసూయాదేవి ❋

(కవయిత్రి - రేటూరు - గుంటూరు)

అది నీకే తగునమ్మ "మాతృహృదయం" బావిష్కరింపంగ, నే
యెదురున్‌లేని మహాకవీంద్రుఁడును దా నీ చక్కనల్ చూచునా?
ముదిమిన్ డాసిన నే మఱొక్కపరి నీ మూలంబునన్ నాదు బా
ల్యదశావాసిత మాతృమాధురులు క్రోలంగల్గితిన్‌సోదరీ!

అనసూయాహృదయమ్మువోలె మధురంబై స్వచ్ఛమై సత్కవి
ప్రణుతిన్ నోఁచిన నీకవిత్వమిడి నాభాగ్యంబు పండించితో
యనసూయా! భవదాదృతిన్ మఱవలేనమ్మా! జగన్మాన్యవై
మనుమమ్మా! కమనీయకావ్యతనయా మాతృత్వ సంపత్తితోన్

కృతికర్తృత్వమునన్ గడించినవి మత్కీర్తులు చిరస్థాయులై
బ్రతుకంగల్గు నటంచు ధైర్యమును జెప్పంజాలఁ; గానీ! భవత్
కృతిభర్తృత్వమునన్ మదీయ యశముల్ క్రీడించు నాంధ్రీకపో
లతటీ నిత్యవినూత్న సాధుసుషమా లావణ్యరేఖాకృతుల్.

(తపస్సిద్ధి-1949)

## ❋ శ్రీ లేళ్ళ వేంకటరామారావు ❋

(పోలీసుశాఖ-కవి-బాపట్ల)

ఆయత్తము శైష్యోపా
ధ్యాయిక మనపట్ల నది సమంచిత కవితా
శ్రీయోగంబిడి రామా
రాయకవీ! నీకు నాకు రాణ ఘటించెన్.

నాకుం బిడ్డలు పెక్కురుండినను బ్రాణంబెల్ల నీమీఁదికే
ప్రాఁకున్, దేశికు లెందఱుండినను నీభావంబు నామీఁదికే
దూఁకున్, నీకును నాకు నేర్పడినబంధుత్వంబు లేనాఁటివో
యీకొమ్మల్ మఱి చిల్వపల్వలుగ నిట్లే సాగి వాసించుతన్.

నీ హృదయపద్మవీథిలో నెగసి చిందు
"తేనెచుక్కలు" గురున కందించుకొంటి
శాబకా! తన్మధూత్సవాస్వాదనమున
నితఁడు బంభరమై విశ్వహితము మొరయు (తపస్సిద్ధి-1949)

## ✳ దేశభక్త శ్రీ అయ్యంకి వేంకటరమణయ్య ✳

(షష్టిపూర్తి సమయము)

కందుకూరి సమాజసంస్కరణదీక్ష
చెళ్ళపిళ్ళ దివాకర శ్రీకవీంద్ర
శతవధాన పరంపరా సరిదఖండ
మధురకవితాప్రవాహముల్ మలసిమలసి
తెలుఁగుబిడ్డలకన్నులు తెఱచువేళఁ
దెలుఁగులోఁగిళ్ళఁ దొలికోడి పలుకువేళ
నుదితమయ్యె సహస్రభానూజ్జ్వలార్చి
రూర్మిచలితంబు గ్రంథాలయోద్యమంబు

శారదామూర్తి యిది సుప్రసన్నఫణితి
నంబయై బుజ్జగించె నాంధ్రాళినెల్ల
నొజ్జయై తెల్గులకు వెల్గు లొసఁగ నేర్చె
రాణిగా నేలెఁ దెనుఁగుమాగాణమెల్ల.

వలదు పరతంత్రతాపీడ వలదటంచుఁ
దగదు బెంబేలుపడి స్రుక్కఁదగ దటంచు
లెండు సమరావనికి సాగిరం డటంచుఁ
దెరలె రణభేరి సాబర్మతీతటాన

ఎవరు దూఁకిరి మంటలో, నెవరు మాతృ
దాస్యభంజకసవనతంత్రస్వతంత్ర
హోతలై పొల్చి రపరాజితోగ్రశౌర్య
నిధులుగా నిల్చి రీ తెల్గునేలఁ జెపుఁడి!

భారతీపాద కనకమంజీరజనిత
ఘల్ఘలారావ మెచ్చోటఁ గడలుకొనియె
సార సారస్వతాంశు లేచాయఁ బ్రాఁకె
నచటనే లేచి రాంధ్రయోధాగ్రగణ్యు
లచటనే పూచె జాతీయతాగమంబు
లచటనే పుట్టినారు మహాకవీంద్రు
లచటనే కానఁబడిరి మహాస్సమగ్రు
లచటనే సాధుసౌందర్య మవతరించె.

ఎవ్వఁడీ యభ్యుదయలక్ష్మి కిచట విత్తు
నాటె, నీరెత్తె నేతెల్గుతోఁటమాలి

యెవ్వఁ డీ చైత్రరథవాటి యివతళించి
సురభిసుమన: కదంబమై సొంపుగుల్కఁ
బాటువడె నన్నపానముల్ మాటమఱచి
యెవ్వఁ డీజాతి రతనాల దివ్వెయయ్యె
నెవఁ డుపఘ్నమై నిల్చె సాహిత్యలతకు
నెవఁడు సర్వస్వమయ్యె సాహిత్యపరుల
కతనిఁ కాంధ్రసవిత్రీ ప్రియాత్మజునకు
నిస్తు లాయ్యంకి వంశాబ్ధికౌస్తుభమున
కమరకీర్తికి వేంకటరమణమంత్రి
కంధ్రసేవా నిమగ్నున కంజలించి
షష్టిసంపూర్తి సమ్మాన సంపదిష్టి
కన్నలుం దమ్ము లీనాఁడు పన్నిరనినఁ
బెద్దలుం బిన్న లీనాఁడు పేర్చిరనిన
నక్కసెల్లెండ్రు హారతు లద్దిరనిన
నద్దిరా! వెలువడ్డ సత్యం బదేమి?
నల్లవో! తేటపడ్డ విన్నాణ మేమి?
తెలుఁగుబిడ్డలు సత్కలాధీనమతులు
తెలుఁగువా రార్యపూజానాధీనమతులు
తెలుఁగునాఁ డుత్తమాచారధీసమగ
మాంధ్ర మాచార్య మన్యదేశౌఘమునకు
నాంధ్రసంస్కృతి మోహనం బనుట గాక !

జాతి నిటు దిద్ది తీర్చెడి జాణపట్ల
జాతికై కొల్వు నెఱపు సచ్చరితుపట్ల
జాతికై బలివోవు సజ్జనునిపట్ల
జాతికిం బ్రాణమిడు కళాసమితిపట్ల
జాతికిం గీర్తి సంధించు సరణిపట్ల
మూరిఁబోయిన యీభక్తిగౌరవములు
చివురుదొడిగిన యీప్రేమ చిహ్నశతము
నిచ్చలుం దెల్గుబిడ్డలో నిలుచుఁగాక!
నిత్యమై తెల్గుగడ్డలో నెగడుఁగాక!

(12-10-1950-పఱిగపంట)

## ❋ వాగ్గేయకారులు శ్రీ క్షేత్రయ్య-శ్రీ త్యాగయ్య ❋

*పొంగుల్వారిన గానమాధురులసొంపుల్ నింపి, తంజావురిన్
శృంగారమ్మును, భక్తి నేలిరిగదా! క్షేత్రయ్య, త్యాగయ్య; లీ
సంగీతమ్మున కంజలించెను సమస్త ద్రావిడక్షోణి; యీ
బంగారమ్ముఁ దెలుంగుబిడ్డలే సృజింపంజాలి *రవ్వారిగన్
*అవ్వారిగ - అపారముగా*(ఉదయగానము)

*సీతారాఘవసత్కథల్ శ్రుతిశిరశ్శ్రీసూక్తి సారంబు లు
ద్ధూతాఘంబులు వస్తువై తనర, మాధుర్యప్రవాహమ్ము సం
గీత బ్రాహ్మిని వెల్వరించి, భువనక్షేమమ్ము చేకూర్చి, య
ద్వైతానందము నందుకొన్న ఋషికిన్ ద్యాగయ్యకున్ మ్రొక్కెదన్.
*(కదంబకైత)

## ❋ శ్రీ కొమరవోలు రాజయ్య ❋

(ఆదర్శ హెడ్‌మాస్టర్, పొన్నూరు, గుంటూరు)

రాజై నన్నెవఁ డేలి హృద్గగనమున్ రంజించె నంచత్కళా
సౌజన్య ప్రభుతావశంగత యశశ్చాంద్రీ విభా మాలికా
రాజీమండిత దిగ్విభాగుఁడగుచున్ రాణించె నెవ్వాఁడు త
ద్రాజామాత్యున కంజలించెద సభారంగమ్ము జేపెట్టఁగన్

ఛాత్రులు, దేశికుల్ విగతశాంతి నలందుచుందురేని, యే
ధాత్రికినైన నుచ్చదశ దక్కదు, నమ్రతలేని శిష్యుఁడున్
గాత్రము, చిత్తమున్ జిఱుత గణ్యత కీయని బోద్ధయున్, యశః
పాత్రులుగారు, తేఱి సలుపందగు నిర్వురు, నీ విచారమున్.

నీ కనుసన్నలో మెలఁగనేర్చిన యొజ్జలు, నీదు శిక్షకున్
లోఁకువయైనశిష్యు లతిలోక పురాకృత పుణ్యవాసనా
శ్రీకు లటన్నమాట పలుసీమల నున్నది; యక్షరాల న
వ్వాకు నిజంబటంచుఁ పగవాఁ డయినన్ నుడువున్ గురూత్తమా!

నీ మృదుభావనల్, నెవరు నిండిన పల్కులు కూచిముల్కులై
ప్రామి యహంకృతిన్ మెఱయు బాలుర వృద్ధులఁదార్చె లజ్జకున్
ప్రేమము ధామమైన *ఋషి వేంకటరత్నము నిన్ను సంయమి
స్వామిని జేసె, శిష్యకులసత్తముఁజేసె నహింసనప్రియా!
*(రఘుపతి వేంకటరత్నము నాయడు)

ఒజ్జన ముజ్జగించి యిఁక నూఱట గందువటయ్య! శేముషీ
సజ్జితమైన నీ యెడఁద సమ్మతి చూపునె యిట్టిచేఁతకున్?
మజ్జనమాడదా యది సమాహిత నిష్ఠను రాజవిద్యలో
విజ్జిన మాయచీఁకటి దవీయ మొనర్చెడి పండువెన్నెలన్.
గడియించితివి దేశికప్రధానుండవై
యనితరప్రాప్తమైనట్టి కీర్తి
చేపట్టితివి కులస్త్రీకదంబకశిరో
ధార్య చరిత్రమైఁ దనరు సతిని
ముద్దాడితివి జగన్మోహనశేముషీ
శీలసంపన్నులై చెలఁగు సుతుల
ఆర్జించితివి ధర్మ వరసి భోగత్యాగ
వహనక్షమంబులై వఱలు సిరులు

కొదవ లిం కేమి కలవు? లోకులకుఁ బండ్లు
పులియునట్లు స్వతంత్రతా లలిత పవన
వీచికాడోలికా సుఖాన్వితుఁడవై చి
రమ్ము నిల్వుము! కొమరవోల్ రాజయార్య! (26-7-52 - సమదర్శి)

## ❋ యతివరుఁడు కొండిపర్తి వీరభద్రుఁడు ❋

(తత్త్వానందుడు)

యతులు గతులు దప్పి *కితవులు విత్తాభి *(మోసకారులు)
రతులు కామదాస్యరక్తులైన
వేళఁ గొండిపర్తి వీరభద్రుఁడు కావి
గట్టి నిల్పె దండి గౌరవంబు

పతిత ప్రజావికాసో
న్నతి కేర్పడె నాశ్రమంబు *నాల్గవయది; భా
*(సన్యాసాశ్రమము)
రతభూమి తద్బలంబున
బ్రతికెన్ బరధర్మ మెంత పైకొనుచున్నన్

ఇచ్చటు విద్యారణ్యుం
డచ్చోటు సమర్థరాముఁ డబ్బుటన కదా
మచ్చ యెఱుంగని సంస్కృతి
నుచ్చైర్దశ పడసె జగమహెూ! యన మెఱసెన్

ప్రాచీన పరివ్రాణ్మధు
రాచారము లూని మానవాభ్యుదయకర
శ్రీ చిక్కణ సేవావ్రత
రోచిష్ణుత నితఁడు యతివరుం డన నెగడెన్

చిక్కినజాతిఁ జూచి వగచెంది తదున్నతి గోరి వైదుషీ
రుక్కమనీయ వైభవ నిరూఢుఁ డితండు తెలుంగుబాసలోఁ
ద్రొక్కని దారిలే దితని దొడ్డతనమ్మునకున్ విధేయులై
మ్రొక్కనివారు లేరు జనమోహన ధర్మపథానువర్తికిన్

ఔచితి గుట్టెఱింగిన మహాశయుఁడౌట నితండు బాపుజీ
గీచినగీఁత దప్ప కవగీర్ణత నంది స్వతంత్రభారత
శ్రీచివురించుపొంటెఁ దన జీవన మర్పణ చేసి త ద్రుచుల్
సూచి సుఖించి ప్రావెలుఁగుఁ జుట్టముగాఁ వెడలెన్ దలిర్చుచున్

తన తృప్తికిఁ బరతృప్తియుఁ
దన ముక్తికి నితరముక్తి తావల మని న
మ్మిన తత్త్వానందుఁ డితం;
డనవద్యం బితని చరిత మాదర్శ మగున్ (శబల - 24-2-1953)

## ఆర్తబంధువు శ్రీ గ్రంధి వరదయ్య శ్రేష్ఠి

(అనాథ శరణాలయ స్థాపకుడు, చిలకలూరిపేట)

కలిమికి నాటపట్టు లనఁగా మనభూముల నెంద ఱెందఱో
వెలసిరి గాని చేపడినవిత్తము నర్థులపాలుసేయు దా
తలు మనకెందఱుందురు? వదాన్యులలో నినువంటి దీనబం
ధులు కరుణావిధేయమతిధూర్వహు లెందఱు? గ్రంధిసత్కులా!

ఎక్కడఁ గన్న నోట్లకొరకే చెరలాడుచు మేడమిద్దెలున్
రొక్కము చేను చెట్టు పదిరోజులగద్దెకు ధారవోయు తి
ర్యక్కులు పొంగి పొర్లుసమయమ్మున నీకు ననాథ బాష్పపుం
జుక్కలు చుక్కలై వెలుఁగు చూపినవా! వరదాఖ్యసత్కృతీ!

వెన్నవలెన్ ద్రవించి గుణవృద్ధు లహో! యన నార్తసేవకున్
బన్నితివా! నినుం దలఁచుపట్టున గౌతమబుద్ధమూర్తి నా
కన్నులముందు నిల్చి పులకల్ గదియించు సబర్మతీసరిత్
సన్నిధి నున్నయోగి వికసన్ముఖుఁడై తనపజ్జ నిల్వఁగన్.

పాయని దీక్షమైఁ దనదుప్రాణములన్ సిరులన్ దరిద్ర నా
రాయణసేవ కిచ్చి యమరత్వము నందిన గాంధికోవ నీ
దై యిటువంటి ధన్యతకు నర్హునిఁగా నినుఁ దీర్చె 'గ్రంథి' కా
దోయి! భవద్గృహాంక మిఁక నుజ్జ్వలమౌ నది 'గాంధి' సంజ్ఞమై

ఎదికర్తవ్యము విత్తవన్మఖుల కీ హిందూమహీ శాంతి సం
పదకుం దావలమెద్ది పుణ్యరమకుం బ్రాసాదమై వొల్చు నె
య్యది కస్తూరిమగండు నేర్పిన మహీయ స్తారకం బేది నీ
వది చేకొంటి వనాథసేవ, మహితాత్మా! నీకు దీర్ఘాయువుల్!

తన కగపడ్డసంపదలు తాన భుజింపక, లేనివాని కా
ధనమునఁ బాలువెట్టు టుచితం బను పాఠము నేర్పి తీవు, నీ
మనుగడబాట నూటఁ బదిమంది వరించిన వర్గభేదముల్
పెనఁకువ లుండునా? ప్రళయభీకరతాండవ మూర్వి నిండునా?

హైందవసంస్కృతి చేత
సౌందర్య మఖండతత్త్వసంపన్నత, నీ
యం దొదిఁగి నిన్ను జగదా
నందకరున్ మధురజీవనపరున్ జేసెన్

వరదయ్యా! నిను గద్యపద్యములతో వర్ణింతు రాపన్నులై
తెరువుంగానని పేదలన్ మనుపు నిన్ దీవింతు రావెన్క నీ
పరమాదర్శము నియ్యకొన్నసతికిన్ బ్రత్యేకశంసా బహూ
కరణం బిచ్చెద రాంధ్రు లేమనెద వీ కల్యాణి భావోన్నతిన్?

సంతతిలేక నెవ్వగలస్రగ్గి నిరాశలఁ గ్రుంగి దుర్భర
ధ్వాంతమువోని జీవనముపై రుచిదప్పి తెగించి యీవికిన్
సంతనకట్టువారుగల జాడ లెఱుంగుదుఁ గాని మీవలెన్
సంతునమున్గియున్ బెఱలసంతును మోసెడివార లుందురా!

తల్లులు తండ్రులై పరమదైవములై యొక దిక్కులేని యీ
పిల్లల నుద్ధరింపుఁ డిఁకఁ బెట్టనికోటలు మీరు వీరికిన్;
ముల్లెల మూల్గులం దనియు మొండికి రిత్త పిసాళి వెచ్చముల్
చెల్లుట మెచ్చుసాహునకుఁ జెప్పనిబుక్కులు మీచరిత్రముల్

దాతల, నేతలన్, బుధవతంసుల మంజులకావ్యశిల్ప ని
ర్మాతల, గీత వాద్య చతురత్వవిధాతల నార్తమానవ

త్రాతలఁ, గన్న *గర్తపురధాత్రి తెలుంగున రాజధానియై *గుంటూరు జిల్ల
నూతనశోభఁ గుల్క నిఁక నోములు పట్టుఁడు మీరు దంపతుల్!

ఉత్తమశీలురతలఁపులు
దాత్తచరిత్రుల తపమ్ము తప్పక పండున్
రిత్తలు వల్కుట కస్మ
చ్చిత్తము సైరింప దేను శిష్టుఁడ నగుటన్ (శబల - 15-10-53)

## నవభగీరథ

## ❋ ముక్త్యాలరాజా శ్రీ వాసిరెడ్డి రామగోపాలకృష్ణ మహీశ భూపతి ❋

(నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ సాధకుడు)

పెత్తనంబు వలచు పెద్ద లూరూర బా
కాల నూఁదుకొంద్రు గగన మదర
నిక్కమైన సేవ నెఱపెడి పిన్నలు
కంటఁ బడరు సెనగపంటవోలె

తలఁకక తెల్గునీరు తమతాతలసొత్తని త్రుళ్ళువారి కు
ట్రలుగని నందికొండ నికటంబునఁ గృష్ణను గట్టుకట్టడల్
వెలువడుదాఁక లక్షలను వీసములట్లు విదిల్చి జాతికై
నలఁగిన వాసిరెడ్డి నరనాథున కెవ్వనిమెప్పు కావలెన్

జాతిపెంపు నాకుఁ జాలును జాతీయ
గౌరవంబు నాదు గౌరవంబు
జాతిసేవ నాదుజన్మంబునకు ఫలం
బని పెనంగె నిమ్మహామహుండు

చల్లనికోటలో వలపుజల్లులు పైకొను తోఁటలో మరు
ద్వల్లభున ట్లఖండసుఖవాహిను లీఁదు నృపుం డితం డహో!
తల్లికి ముప్పురాఁ గదలి దానిని దీనిని గాదు కేంద్రమౌ
ఢిల్లినె యూఁపె రాచసిరిఠీవులు చూపె జగజ్జనాళికిన్

తలలు కూడని తెల్గుసర్దార్లు నంది
కొండకై యొకత్రాటిపై నుండి రనిన
రిపులు కంపిల్లఁగా బొబ్బరించి రనినఁ
జెప్పుమా హేతు వీతనిసేవ గాక

ఎల్లదెసలవార లెల్లవర్గాలవా
రేకమైరి యితనివాకు మెచ్చి
యేల శిరమువంప దిమ్మహి లాభలో
భ ప్రసక్తిలేని ప్రాజ్ఞునెదుట

అఱవల నక్కజిత్తులకు నాహుతియై తెలుఁగుంబ్రజాళి ది
క్కఱి చెడి యాఁకటన్ నకనకంబడి మూల్గి నశించు దుర్దశల్
విరిసినవేళ నీతఁడు త్రివిక్రముఁడై సకలాంధ్ర బాంధవ
స్థిరత గడించె నీదృశుల జీవనముల్ శతధా కృతార్థముల్

హిమధామ ప్రథమానవంశతిలకం బీ 'రామగోపాలకృ
ష్ణమహేశ' ప్రభు మౌళి, ముక్తిపురరాజ్యశ్రీవిభుం డెంత ని
ర్మముఁడై యున్నను మామకీనకవితా మంజూక్తి నేఁ డిట్లు చం
క్రమణంబుల్ పచరింపనోర్చె గుణసక్తంబై నిరాఘాటమై

మతములు వర్గముల్ కులసమాజము లన్న విభేద మీ జగ
ద్ధితునకు నీ యుదాత్తగుణదీప్తున కాదృతి సేయుపట్ల నా
హతమగుటబ్రమా? కువలయాప్తున కెవ్వరు కాన్కవెట్టకుం
ద్రు? తుదకు నూలిపోఁగయిన దోయిట నెత్తక నిల్వనేర్తురా?

నాయకు లధికార సభా
గాయకు లీకర్మయోగి కఱపినబాటన్
బోయినచో సేవావిధిఁ
బాయనిచో మనకు నెన్ని పర్వము లగునో!

పెద్దలతో స్వార్థప్రియ
బుద్ధులతో మనశిరమ్ము బొప్పులుగట్టెన్
రద్ది యెఱుంగని పల్లెల
నిద్దఱ కిద్దఱకు నడుమ నెగసెఁ గటారుల్

పిన్నలలో నాయకుఁ డు
త్పన్నుఁడు కావలయు, నంధ్రపౌరుషరోచి
ష్పన్నుఁడు ధర్మరమా సం
పన్నుఁడు రావలయు, జాతి బలపడవలయున్

## ❋ శ్రీ వినోబా భావే ఋషి ❋

(భూదానోద్యమ విధాత)

ఆతఁ డుగ్రతప; కృశీభూతుఁ డాతఁ
డున్నత శరీరయష్టి సంపన్నుఁ డాతఁ
డాత్మసందర్శ నోజ్జ్వల దక్షియుగళుఁ
డాతఁ డార్షమహస్సున కానవాలు

ఎల్లమతముల సారంబు నెఱుఁగు నితఁడు
సర్వధర్మంబులను మెచ్చు సాధు వితఁడు
సకలభాషలు విద్యలు చక్కనేర్చి
వాణి మగరూపుగా నుతుల్ వడసె నతండు

తత్త్వవిద్యకు విజ్ఞానతంత్రమునకు
సఖ్య మేర్పడవలయు విశ్వము సుఖింప;
బుద్ధికిని మనస్సునకును బొసఁగుపాటు
లేనిచో నుర్వి చెడు నన్నజ్ఞాని యతఁడు

అతఁడు నేర్వనివిద్య లే దతని కగ్గ
పడని భాషయు లేదు ప్రాక్పశ్చిమ ప్ర
పంచసంస్కృతి పుక్కిటఁ బట్టె నతఁడు
నిఖిల మానవతా ప్రతినిధి యతండు

దుర్భరావేశమునఁ దప్పుత్రోవఁ బట్టు
దేశభక్తిని గాంధేయదిశకు మలఁచి
సత్యసంసక్తిమై నహింసాప్రవృత్తి
మై గరిష్ఠతఁ గను కర్మయోగి యతఁడు

జగతి యింద్రియసుఖ లాలసతకు లోఁగి
కామ్యకర్మానుగతికమై కదలువేళ
నిత్య నిరవద్య నిగ్రహనిష్ఠ కండ
దండయై నిల్చు నూర్ధ్వరేతస్కుఁ డతఁడు

పరమగుహ్యమ్ము గీతా నిబంధితమ్ము
బ్రహ్మవిద్యను బసులకాపరికి సైత
మెఱుకపడునట్లుగా నింత లింత లైన
కథలుగాఁ బ్రవచించిన బుధుఁ డతండు

వ్యక్తిసత్యాగ్రహ ప్రధనాంగణమున
నిలువఁ జాలిన మొదటిసైనికుఁడుగా మ
హాత్మునుల్లము లోఁగొన్న యనఘుఁ డతఁడు
వీరులకు వింతగొల్పిన వీరుఁ డతఁడు

ఒక మహాశాస్త్రమర్యాద నొంది వెలసె
నతఁడు చేపట్టినంతన యలఁతి కదురు
ఒక మహావేదబుుక్కు వానికిఁ గరంగి
చల్ల చల్లని దేశియై వెల్లివిరిసె

కుత్తుకలు గోసి నెత్తురుకూడు గాదు
తృష్ణలను ద్రుంచి యమృత మందించు నతఁడు
విప్లవము కాదు వానిది విశ్వశాంతి
కాదరువుగా నెసంగు సర్వోదయంబు

జనచయమ్ములు దేవతాగణము లయ్యె
దాత లెల్లరు హెూతలై తరలివచ్చి
రుభయతారక మగుశాంతి యురలి పొరలె
నతఁడు భూదానయజ్ఞ దీక్షితుఁడు కాఁగ

కలిమి నిచ్చిరి, ముక్కారుపొలము నిచ్చి
రొడలి నిచ్చిరి, బ్రదు కిచ్చి, రోట లేక
బాపురే! వాని పయనించు బాటలందు
నిండె నీవులు పుణ్యముల్ పండిపోయె

అతఁడు నిలువెల్ల నర్మిలి, యతఁ డజాత
శత్రు వాతనినుడికి మస్తకము వంచి
మిత్తికిఁ దెగించి గజదొంగ లుత్తచేతఁ
బట్టువడుదురు సర్కారు చట్టమునకు

కానరాఁ డిఁక బాపుజీ కనుల కనుచు
శోకమయమూర్తియై క్రుంగు లోకమునకుఁ
బట్టుఁ గొమ్మగ నిల్చినయట్టి దీన
బాంధవుఁడు పావనుఁడు 'వినోబా' యతండు

కోటి కొకఁడేని వానికి దీటువచ్చు
పురుషుఁ డుండినమహికి రాచఱిక మేల
శాసనము లేల, యస్త్ర శస్త్రమ్ము లేల
ధర్మదేవత నాల్గుపాదముల నడువ (సర్వోదయగానము 5-2-1955)

## ※ దేశభక్త శ్రీ కల్లూరి సుబ్బారావు ※

కండలు నెత్తురున్ నెఱియుఁ గల్మియు బల్మియు మాతృసేవలోఁ
బిండిన సుబ్బారావున కపేత సుఖాభిరతిన్ ద్రిలింగ భూ
మండలమెల్లఁ గ్రుమ్మరిలి మాపులు ఱేపులు తెల్లవాని రా
దుండఱికమ్ము చాటి సయిదోడులబుద్ధులు దిద్ది బాపుజీ
దండును బెంచి కాంగ్రెసు నుదాత్త మొనర్చిన, షష్టివర్షముల్
నిండిన సుబ్బరావునకు నిస్తులసంపద లెన్ని యుండినన్
దండుగువోనియాంధ్రమును, దక్కిరిబిక్కిరిపొత్తు భారమై
గుండియజాఱి నాంధ్రమును గూర్చి జపించి తపించి రాష్ట్రపుం
బండువు పుట్టుదాఁకఁ దనపట్టు దొఱంగని దిట్టయై ప్రథన్
బండిన సుబ్బరావునకుఁ బ్రాజ్ఞులు తెల్గులు నేఁడు మల్లెపూ
దండలు వైచి తద్గుణకథల్ ప్రకటించి నుతించుపట్ల నే
నెండకు జంకి యిల్ వదల కెండకుజంకని దండ నంపి యీ
పండితు గౌరవింతు సుఖభాజనుఁడై యితఁ డింక నర్వదేం
డ్లుండునుగాక దేశమున కూడిగముం బొనరించువారి కీ
దండితచిత్తుఁ డేగినపథమ్ములు గమ్యము లౌనుగాక ధీ
మండితు లీ సదస్యులకు మంగళ మేర్పడుఁ గాక నిచ్చలున్!

(14-5-57 - సమదర్శి)

## ※ జాతీయపోరాటయోధుడు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య ※

(శాసనమండలి అధ్యక్షులు) (ఘంటసాల-కృష్ణా)
(షష్టిపూర్తి సభలో ఆనాటి ముఖ్యమంత్రి, మంత్రులు కలరు)

పొంగులు వాఱుచున్ సుడులువోవుచుఁ బైకొనివచ్చు వేనవేల్
భంగములన్ గణింపక విపత్కర నక్రకఠోరదంష్ట్రికా
శృంగము లూడ్చి కృష్ణ కెదురీఁదిన దిట్టవు నీవు; నేఁడునున్
ఖంగున ఘంటసాలజయగాథలు నల్గడ మ్రోయ బ్రహ్మయా!

వైరుల నోర్చి బాహుబలవైభవధూర్వహనైక జీవులై
వీరరసప్రధాను లన విశ్రుతికెక్కిరి నీపితామహుల్
వైరుల నోర్చి యాత్మబలవైభవధూర్వహ నైకజీవివై
వీరరసావతార మన విశ్రుతికెక్కితి వీవు సత్కృతీ!

బందురులో మహామహులు ప్రాజ్ఞులు ముప్వురు నీకు నొజ్జలై
వందలు వేలుగా వలయువన్నెలు దిద్దఁగ వచ్చుఁగాని మీ

యందఱిలోన గాంధి కలఁ డయ్యది కారణమై నిరంతరా
నందపునిట్టనై సొగసినాఁడను నేనును నీమహస్సునన్

బంధురదేశదాస్య పరిభావ నికృంతన దీక్ష పూని ని
ర్బంధములెల్ల సైఁచితివి, బాముల లగ్గున నొక్కరీతి ని
ర్మంథరవృత్తి సాగితివి, మాన్యచరిత్రుఁడ వైతి వద్దిరా!
గాంధికి నిన్నువంటి మొనగాండ్రెకదా విజయైక హేతువుల్.

విచ్చిన మోముతోఁ, జెవికి విందులు సేయు మృదూక్తితోఁ, బొరల్
పొచ్చెములున్ గనంబడనిపోకడతో, వెడనిక్కుటెక్కులన్
మెచ్చని చూపుతో, నెనరుమేలిమితో, నెనలేని తాల్మితో,
నచ్చపుఁబల్లెటూరిసొగ సంతయు లోఁగొని తీవు కర్షకా!

ఏ పదవుల్ వశంపడిన నే బెడఁదల్ చలపట్టిముట్టినన్
గాఁపుఁదనమ్ము వీడ్కొనని కమ్మనిమానిసి వీవు; హాలికున్
దోఁపిడి చేసి కుల్కు గజదొంగల వంచిన రైతుపెద్ద వీ;
వాపదనున్న జీవులకు నందఱ కాప్పుఁడ వీవు; బ్రహ్మయా!

హలమును బట్టి ప్రాణులకు నన్నము పెట్టెద బట్టనిచ్చెదన్;
గలమును బట్టి వ్రాసెదను గావ్యము; మోసెద రాజ్య భారమున్;
వలసినవేళ నుగ్రకరవాలముఁబట్టి ప్రపంచశాంతికై
నలఁగెద; నన్న నీపలుకు నామదికిన్ వెలుఁగిచ్చు నగ్రజా!

తిన్నని రూపుతో, బిగువుదేఱెడికండలతో, నెసంగు నీ
యున్నతదేహయష్టి హృదయోన్నతికిన్ బహిరంక మందు; నీ
చిన్నెలు తోఁచువారె కవిశేఖరు లౌటయుఁ గానిపించు, మా
నన్నయ విశ్వనాథపయి నాపయి నింకొక మూరెఁ డుండఁడా?

గంతులు కావు, పట్టములు కావు సదస్యుల ముంచియెత్తు దు
ర్దాంతవచః ప్రవాహములు తంత్రము లాస్తులు కావు, శైలజా
కాంతశిరస్సర ద్దివిజగంగ నదల్చు పవిత్రశీలమే
సంతనచేయుఁ గీర్తి నని చాటెద మూదల నిన్నుఁ జూపెదన్

ఇతరకులమ్ములందు మనసిచ్చి నినున్ గొనియాడువారు, నీ
హితమున కొగ్గువారు, కల రేదెస కేగిన వేన వేలుగన్;
బ్రతు కన నిట్టిదేకద! సెబాసని యూరక పల్కునా జనం
బతులితమౌ నుదారతయు నార్ద్రతయున్ గని కాక బ్రహ్మయా!

రాపునకేమిలే! తెలుఁగురాష్ట్రము వచ్చెను, దానివెంటనే
చేపడియెన్ మహాంధ్ర, మది శిష్టసభన్ సృజియించినంతనే
ప్రాపయి తత్సభన్ నడుపుభాగ్యము నిన్ను వరించె, గర్వమున్
జూపవు గాని నీ విచటఁ, జొక్కుదు నే నొకసాత్త్వికోద్ధతిన్

నే ననఁగాఁ ద్రిలింగధరణీహితగాఢతపోగ్ని దుర్భర
గ్లాని సహించినట్టి ఋషికల్పుఁడ మామక రాష్ట్రగానముల్
వీనుల సోఁకి యీ తెలుఁగువిశ్వము మేల్కొనె నీ యథార్థతన్
గాననివిజ్ఞు లుండెదరుగాక! నతుల్ పదివేలు వారికిన్

నావలె నంధ్రతావికసనమ్మున కెమ్మున మూల్గ మృగ్యమై
పోవఁ గృతుల్ రచించుతమి పొంగి నలంగు తెలుంగులెంకలన్
నీవలె గారవింపఁగలనేతలు పెక్కురు లేమి నిక్క మౌఁ
గావున నీమహోత్సవము కన్నులపండువు మాకు బ్రహ్మయా!

పదపదమందు నీకనుల బాష్పము లూరును నేఁడు, మేనికిన్
గదురు గగుర్పు పైరతఱిఁ గాఁకరగాయకుఁబోలె నౌర! యీ
కదలిక లాభలోభములు క్రమ్మినప్రాణికి రాదు, ధర్మమున్
వదలనివానికే దొరకువైభవ మీయనుభూతి బ్రహ్మయా!

మునికులచక్రవర్తియగు ముట్నూరికృష్ణుఁడు, గాంధి గాక, నీ
కనులకు నీమహాజనము కన్పడునా? యిది కా దటన్నచోఁ
గనఁబడు భోగరాజు, మఱి కన్పడునేమొ నృసింహుఁ, డవ్వలన్
గనుపడవచ్చు నీపరువుకాచిన రాణియు నేఁడు బ్రహ్మయా!

ఒకకూర సరిపోవదో యని నీవన్న
　　　　నతిథికి మఱియు రెం డలవరించి
ఇపు డెట్లు బడలెదవే! యన్న జంకక
　　　　గుండిగల్ నడిరేయి వండి వార్చి
ఏయగ్నికుండమం దీవు దూఁకుదు నన్న
　　　　గెలిచిరమ్మని వీరతిలక మలఁది
తనముక్తియెల్ల నీతనివిలోఁ గల దని
　　　　భక్తియైనిను వేల్పుపగిదిఁ గొలిచి

చిరవియోగవ్యథా పరిస్విన్నమైన
యెడఁద నిను దాఁచుకొని తేఱి యిల్లుదిద్ది
ధర్మధేనువు నీకీర్తివర్మ మైన
మావదినె కీవు కడు ఋణంపడితి వన్న!

ఆలున్ బిడ్డలు నూరునాడును జయవ్యాహారముల్ పల్క ని
ర్వేలోత్సాహము నంది మందిసిరికై వెచ్చింపు మాయుష్యమున్
నీలో సంయమశక్తికిన్ గొఱఁత లేనేలేదు, నీపై నొరుల్
ఊలన్ రువ్వఁగ నెన్నఁడో విరిసరాలన్ రువ్వి తవ్వారిపై

మేడలవారుగాదు మెఱమెచ్చుల మ్రుచ్చులు కాదు వీథిలో
నూడకు నుట్టిగట్టి మనుచున్న విపన్నుఁడు రాజనీతిఁ గొం
డాడవలెన్ దదీయహృది నగ్ని రగుల్కొనకుండు మార్గముల్
చూడవలెన్ మహాశయులు సుస్థిరశాంతిరతుల్ భవాదృశుల్

ఒకవెయిమంది సంతకము లొక్కఁడు వెట్టును; నిన్ను, నన్ను వే
డికొని, యొకండు ఖద్దరు గడించి, ధరించి, వరించుఁగాంగ్రెసున్;
మొకములు కొయ్యవాఱె మనమూకకు, నెత్తురు, చీము చచ్చె; నే
ల! కడుపుచించుకొన్నయెడలన్ బడుఁ బిండము కాళ్ళమీఁదటన్.

పదవుల మీఁది మోహములు పైకొని విస్మృత దేశగౌరవా
భ్యుదయులుగాఁ బ్రజల్ చెదరి, యొడ్డులు పన్నఁ దొడంగి; రీ తెగుల్
ముదురకముందె మందొసఁగి ముష్కరులన్ సవరింప నిర్మముల్
కదలవలెన్ మహామహులు కాంగ్రెసుపెద్దలు పల్లెపల్లెకున్

నీతులు నీకడన్ నుడువ నే నెవఁడన్ ఫలభోగదూర సే
వాతతకీర్తి సౌరభసమంచిత మంజుల జీవనుండవై
మాతృమహీమహత్త్వసుషమా వలమాన పతాకవై ప్రజా
నేతృత గంటివీవు కమనీయచరిత్రఖనీ! సుహృన్మణీ!

లోకము వక్రమార్గములలోఁ బడియెన్, జెడియెన్ భవిష్య మే
పోకలఁబోవునో యనుచు బుద్ధిమదగ్రణు లారటించుచో
నీ కిటు షష్టిపూర్తి మహనీయమహస్సు ఘటించినట్టి సు
శ్లోకుల మెచ్చెదన్ సుగుణలుబ్ధులకున్ గయిమోడ్పు లిచ్చెదన్

మండలి కృష్ణారావు యజమానుఁడుగా నిలువన్ శుభక్రియా
చండిమ చూపి పేర్గనియె సత్కృతిసంఘము; దీని నాంధ్ర భూ
మండలమెల్ల నొజ్జవలె మన్ననచేసి ప్రజాసపర్యలోఁ
బండినవారి కందఱకుఁ బండువులన్ సమకూర్చుఁ గావుతన్

అఱువదియేండ్లు నిండిన రవంతయు జంకని దండి గుండెతో
నిరువదియేండ్లవానివలె నీవు చరింతువు; నీకు *బ్రాఁతియా!
మఱియొకషష్టిపూర్తి? మనుమల్ మునిమన్మలు వారిపంటలున్
*గుఱువునఁగుల్కఁగా మురిసికొందువులే! భగవత్కృపాయతిన్

*(దుర్లభమా) * (తొడలపై) (15-12-1958-పైరపంట)

## ✻ సాహితీపోషకులు శ్రీ మూల్పూరి రంగయ్య ✻

(ఏలూరు, ప.గోదావరి)

తెలుఁగుం బల్కుల తీరు తీయనలకున్ తిక్కన్న దిక్కన్నచోఁ
దల లూఁగింపని ప్రోఢ లుండరుగదా! తన్మాధురీ సాధురీ
తులకున్ నోఁచిన యేటుకూరికవిచంద్రున్ ధన్యుఁగా నెంచు నీ
యలరాజున్ బలనాటికృష్ణుఁ గని సర్వాంధ్రమ్ము నిస్తంద్రమై

సుకభిళమీ మహాంధ్రకవిసూనము పంచిన తావి సోఁకి మై
మఱచితి మింతలోనె మటుమాయ మొనర్చెను దైవ మీ విరిన్;
పరిణతగంధమై ప్రభునిపజ్జ సుమం బిది వెల్గుఁగాక తె
ల్గు రసికలోకమీ కొఱఁతకున్ గలకాలము కుందకుండునే?

ఉన్న కవీంద్రు కబ్బముల కున్నతి గూర్చుట యబ్బురంబె? యీ
చన్న కవీంద్రు కావ్యములు చాటుట గొప్పతనమ్ముగాని; యీ
పున్నెముపై మరుల్కొని యపూర్వయశమ్ము గడించుకొన్న మా
యన్నను రంగయాఖ్యుఁ గొనియాడెద మూల్పురి వంశవర్ధనున్.

అవిరత రాజకీయసమరాంకిత జీవనులైనవారిలో
నెవరికిఁబట్టె నీకవిత లీకళ లీసభ లీవదాన్యతల్?
కవికుల కల్పభూజములుగా నుతు లందెడివార లిద్దఱో
ముపురో తెలుంగునన్ గలరు మూల్పురి రంగయ వంటి
సజ్జనుల్.

సంగరముల్ వివాదములు జాతికి నీతికి నెగ్గుగూర్చి రా
జ్యాంగము నార్చు నన్న పరమార్థము దెల్ప. నసల్పకాల మీ
రంగయకీర్తి నిల్ప "నలరాజు చరిత్ర" తెనుంగు భారతీ
మంగళధామబద్ధ నవమౌక్తికమై కురియున్ ధగద్ధగల్!

**(సమదర్శి-6-5-1959)**

## ✻ రైతు నేత శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ✻

(ఆచార్య ఎన్.జి. రంగా ప్రియశిష్యులు వ్యవసాయశాఖామంత్రి-చిత్తూరు)

తిమ్మారెడ్డి ! త్రిలింగదేశజనయిత్రీ సేవకశ్రేణిలో
సమ్మానార్హత గన్నరెడ్డి ! ప్రతిభా సౌజన్య సౌశీల్యముల్
సొమ్ముల్గా హవణించురెడ్డి ! కృషిక స్తోమమ్ము ప్రాణమ్ముగా
నెమ్మిన్ దేలెడిరెడ్డి ! సంతతజయా నీకమ్ము నీ కబ్బుతన్ !

రైతుపై నీఁగ వ్రాలెనా రక్తమెల్ల
నుడికి ఘూర్ణిల్లునట్టె ! నీ కుదధివోలె
నాంధ్రకర్షకభాగదేయములు పండి
నేఁడు నాఁగేటిప్రెగడ వైనాఁడ వీవు

ఎకరాలు నూ ఱున్న నేమిసంబడ మయా!
కించిత్తు వాన వక్రించెనేని
నిలువెత్తు పైరైన నిండున దే మయా!
గాలిపా టొఱవయై కంకి సెడిన
పంట లవ్వారిగాఁ బండిన నే మయా!
విపణిలో గింజకువిలువ పడిన
బస్తాకు ధర యెంతపల్కిన నే మయా!
బండిపట్టా కైదుపదుల నిడిన

వచ్చెఁబో! రైతునకుఁ బదివంద లేమి
యొఱగు నమ్మాయి పెండ్లిపందిరులు వైవ
ఎవఁ డెఱుంగును గాఁపులయిడుమపాట్లు
మడక దున్నెడి నీవంటిమంత్రి తక్క

మట్టబిగించి యొడ్డెవలె మట్టినిమోయుచు కే.సి. కాల్వకున్
కట్టలుదిద్ద నేర్చితివిగాని మహాంధ్రము నేలుముద్ర చే
పట్టినమంత్రి నే ననెడుభావము నీ వెపుడైనఁ గంటివా!
యెట్టులు నేర్చితీ నడత యీ నిరహంకృతి రెడ్డిసోదరా!

పాటకుఁ దగ్గవీణ జతపడ్డగతిన్ దగుమంత్రి వైతి వీ
నాఁటితెలుంగుహాలికజనమ్ముల; కీ వెట నేది పల్కినన్
దోఁటపాలమ్మునన్ గపిలె దోలెడి సోలెడి రైతుగుండియన్
మాటికి మాటికిన్ గదలు నాదములే మొరయున్ సమశ్రుతిన్

ఈవు శతాధికాయువు సమిద్ధపదమ్ము సుఖమ్ము నంది నీ
చేవ సమస్తమున్ గృషికజీవనరోచికి వెచ్చపెట్టుమీ
పావనభావసౌరభము పర్వ సభాసదు లిచ్చు నచ్చపుం
దీవనలెల్లఁ బండి నవతేజము నీ కొసఁగన్ సుహృన్మణీ!

కట్టడ తప్పనట్టికవి కన్పడినన్ బులకింతు వీవు, స
మ్రాట్టును జూచిన ట్లతని మన్ననచేసెదు, రాచవ్రేఁగు చే
పట్టినవారి కెందఱకుఁ బట్టిన దీ యనురక్తి? నీకు నేఁ
డిట్టిప్రశంస లీయక మ తేగతి మిన్నక యుండ్రు మాదృశుల్?

రెడ్డికి నాంధ్రవాఙ్మయచరిత్రకు నబ్బిన పొత్తు పెద్దయున్
దొడ్డది, సత్కవీంద్రపరితుష్టికి నుత్తమకావ్యసృష్టికిన్
రడ్డి తపించి కాంచె నపరాజితమైన యశస్సు; చంద్రులో
మడ్డిని జూచి తద్ద్యుతులు మాటిమాటికి నవ్వుఁదిమ్మయా!

'తిమ్మ' పదార్థము న్గనిన తెల్గులు పెక్కురు లేరు; 'శాంత' మీ
కమ్మనిమాట కర్థము; వికారములై చను రాగవైర మో
హమ్ములు లేని నీకు నిది *యాహ్వయమై నుతికెక్కె; నిన్గనన్
దిమ్మన కాక, *కాఁక మొలతెంచునె! ధన్యుఁడ వీవు ప్రెగ్గడా!

* నామధేయము *వేడి (5-12-1959-పైరపంట)

## శ్రీరామసేవక శ్రీ నీలంరాజు వేంకటశేషయ్య

(ఆంధ్రప్రభ సంపాదకుడు)

నీకు వెఱచువారు నీముందు మోమోట
పడెడువారు లేరు పదుగురైన
నిన్నివేలవిత్త మెవరు నీకిడిరయా
శేషయా! మహావిచిత్ర మాయె

నీవు సకలప్రజాప్రతినిధివి, నీవు
శుద్ధసంకల్పుఁడవు, ఫలావిద్ధమైన
కర్మయోగము నీభావకవచ మగుట
సిద్ధిగంటివిలే! రామసేవనమున

ఆఁకటిమంటల మ్రగ్గెడి
చాకియు మంగలియు నీదుసందేశమునన్
రూకలు పంపెను రామున;
కీ కదలిక నా కవిత్వహేతువు సుకృతీ!

నాపేరఁ జిన్నకానుక
మీపత్రిక జూచి యేను మిణికెడితఱి 'నే
నే పంపితి' ననె మత్సతి
యీపని చేసిన వెలందు లెందఱు కలరో!

ఆస్తికత నిట్లు రేఁపి స
మస్తాంధ్రప్రియత గన్న మహనీయుఁడ; వీ
శస్తము సామాన్యమె! నీ (శస్తము - కీర్తి)
నిస్తులతప మిట్లు విరిసె నీలమురాజా!

గాంధి యన్న నీవు కరఁగెద, వా యొజ్జ
రాముఁడన్నఁ గడుఁ గరంగి పొంగు
గురునిబట్టి శిష్యుగుర్తు లేర్పడు నన్న
వాదమునకు నిన్ను మూదలింతు

'లక్ష' యనిస నీదులక్ష్య మెప్డో పండి
కురియుచున్నవోయి! కొసరువేలు
కొసరి కొసరి నీవు కూర్తువు రెండవ
లక్షసైత మని తలంతు నేను

శివుఁడు చంద్రమౌళి శ్రీరాముసేవకై
పెనఁగి పెనఁగి యెడఁదపెంపు దెలుప
సెజ్జవై భజించు శేషయా! ప్రభుకార్య
మూన కెట్లు మిన్నకుందు వీవు

నీ విమ్మెయి వేయేఁడులు
జీవింపుము! భక్తలోకసేవధి, తెనుఁగుం
దేవర భద్రాచల సీ
తావల్లభుఁ డలరి నిన్నుఁ దనుపన్ బెనుపన్ (8-11-1960 - పైరపంట)

## ❊ అఖిలభారతకర్షకోద్యమవిధాత శ్రీ ఆచార్య యన్. జి. రంగా ❊

(60 సం॥లు పార్లమెంటు సభ్యుడుగా రికార్డు సృష్టించెను)

అఖిలభారత కర్షకానీకముల కన్ను
విప్పి వెల్గులుపంచు వేగుఁజుక్క
సకల కార్మికలోక సంతాపదావాగ్ని
చల్లార్చు నాషాఢజలదరేఖ
ఆంధ్రీచిరోపవాసావిర్భవత్తప:
క్రతుఫలంబైన బంగారుబిడ్డ
సతతప్రజాహిత వ్రతదీక్షలోఁ బండి
కమ్మతావులు చిమ్ము కర్మయోగి

తెలుఁగుఁదోఁటను మూఁడుపూవులకు నాఱు
కాయ లందింపఁ జాలిన గడుసుమాలి
రంగనిజయంతి నవ్యభారతముపాలి
మధురపర్వమ్ము హర్షసామ్రాజ్యరథము

పుట్టినవారి కందఱకుఁ బుట్టవు జన్మదినోత్సవమ్ము; లె
ట్టెట్టి విపత్తు లేర్పడిన నిగ్గక, మ్రొగ్గక లోకసేవకై

కట్టినతోరమున్ విడక గాఢతపోగ్నులఁ గ్రాఁగి నిల్చి నీ
యట్టి మహర్షికే పొసఁగు నందము లియ్యవి రంగనాయకా!

చిరతర భక్తిగౌరవ విశిష్టవచ: కమనీయసాహితీ
భరముల గద్యపద్యసుమబంధములన్ రచియించి నేఁడు నీ
యఱువదియేండ్లపండువున కాయితమైతిమి, నెయ్య తియ్యముల్
పఱపి పరిగ్రహింపవె! యుపాయన మీయది రంగనాయకా!

అఱువదియేండ్లు మానవునియాయువునం దొకమెప్పుమెట్టు; త
ద్గరిమము నెల్లవారలును గాంచరు; లోకహితక్రియాధురం
ధరు, లనవద్యశీలరుచిధాములు, విశ్వజనీన వైదుషీ
పరిణతులౌ భవాదృశులె పాత్రులు తన్మహనీయలబ్ధికిన్.

రంగా మహత్త నెవ్వ రె
ఱుంగరు? కర్షకసమాజరోచిష్ణుతకై
యంగదలు సైఁచు నాయక
పుంగవుఁ డితఁ డఖిలవిశ్వపూజార్హుండున్.

కర్ణాటీ నవహీరహారము, త్రిలింగక్ష్మాసతీ మల్లికా
పూర్ణోద్యానము, ఘూర్జరీ ముఖకళాపుంజంబు, విశ్వక్షమా
స్వర్ణద్యంబరచుంబి వా:పటలమై సభ్య ప్రపంచమ్మునన్
వర్ణింపంబడు నీ యశంబు మృదుభావా! భారతీవల్లభా!

(ఈపద్యమునందు కర్నాటదేశము, తెలుగుదేశము, ఘూర్జర దేశములు (గుజరాతు) స్త్రీ మూర్తులనుగా మానవీకరణ మొనర్చి మనోహరముగా చిత్రించబడినవి. కర్నాటదేశమను స్త్రీ ధరించిన వజ్రములదండవలె; తెలుగుదేశమనుస్త్రీ విహరించే మల్లెపూవుల ఉద్యానవనమువలె; గుజరాతుదేశమను స్త్రీ యొక్క ప్రకాశవంతమైన మొగమువలె; ఆకాశమును ముద్దిడుచున్న గంగాజలమువలె - రంగాగారికీర్తి ప్రకాశవంతమై సభ్యప్రపంచమున వర్ణించబడుచున్నది. వజ్రములు, మల్లియలు, ఘూర్జర దేశస్రీల ముఖకాంతులు, పై కెగసిన నీటితుంపరులు తెల్లగా ప్రకాశవంతముగా నుండును. అటులనె రంగాగారి కీర్తి ధవళమై ప్రపంచమంతయు వ్యాపించినది)

ఒకభారతికిన్ నాథుఁడ, (రంగాగారి భార్య)
వొకభారతి కర్చకుండ; వొకనాఁటికి నం (భారతదేశము)
దక పర్వులెత్తుచుట్టమ,
వొకనాఁటికి లెంక; వెట్టివోయీ! లీలల్

కడపన్ నిద్దురలేచి, హస్తి నగరిన్ కాఫీని సేవించి, చే
రెఁడు రొట్టెన్ కెయిరో కడన్ నమలి, పారిస్ పూఁటకూటింటిలోఁ
కడుపున్ నింపి, హితోక్తులాడును *ట్రుమన్ కల్పించు దర్బారులో
నిడుఁబ్రో లీసుతుఁ డెట్లు వచ్చె జననీ ! నీశక్తిఁగాకుండినన్

(తుమ్మలవారి కనకాభిషేకమహోత్సవమునకు రంగాగారు ముఖ్య అతిథిగా వచ్చిన సమయమున వ్రాసిన పద్యమది). *అమెరికా అధ్యక్షుడు

తెలుఁగుంగడ్డనె కాదు, భారతమునందే కాదు, సర్వక్షమా
వలయంబందును "రైతుపాలఁగలఁడెవ్వం" డన్న నిన్నేకదా
తొలుతం జెప్పెద, రిట్టినీవు, తెనుఁగుందోఁబుట్టువై మా తపం
బులు పండించితె! వాసికిన్ దగిన కాపుం జూపె నీసేద్యముల్

నీ తలఁపులు, నీపల్కులు
చేఁతలు కర్షకులపాలిసిరికే వెడలున్
నీతప మెందఱ కబ్బెను?
రైతులలోఁ జూతు వీవు రాము, రహీమున్.

కాఁపులకల్మిలో జగముకల్మిని జూచినమేటి వీవు, రా
రాపులు ముట్టడించినను రైతులఁ గాచెడినేత వీవు, నీ
చూపునఁ దోఁచుసత్యమును సూరెలవారిమొగాలు ప్రేలినన్
దాఁపక బాహిరించు శుచితారుచిమన్మణి వీవు నాయకా!

రాచఱికమ్ము సేయుటకు రైతొకఁడే తగునంచు, ధర్మముం
బ్రోచు నతండ యంచు, మనపూజలు కొన్న గురుండు కాయముం
ద్రోచుచుఁబల్కె, గాంధి; ఋషితుల్యుఁడతండు మనమ్ములో నినుం
జూచియ చెప్పె, న ట్లనుట సూనృతమోయి? జగద్ధితాగ్రణీ!

ఏలిక లెట్టిదుర్గతుల కీడ్చి కలంచిన, లేమి యెంతగా
మూలగ జుట్టి నెవ్వగల ముంచిన ముప్పులకెల్ల దైవమే
మూల మటంచు నమ్మి, కనుమోడ్చిన కర్షకజాతిపాలి వై
తాళిక! నీకుఁ గల్గుత! నితాంతసుఖమ్ములు రంగనాయకా!

జాతికి మూలకందమగు సైరికవర్గము క్రుంగి దీనతా
యాతన కగ్గమై వగచునట్టిదినమ్ముల హాలికప్రజా
కేతన మెత్తి విశ్వమునకే వెఱ గూర్చిన దిట్ట వీవు; నీ
నేతృతలో నడంగినవి నిండినచీఁకటు లెల్లపల్లెలన్

నుతిపాత్రంబగు శేముషీపటిమతో, నూనూఁగుమీసాలతో
నతివేలప్రభుశక్తితో హాలికదైన్యధ్వాంతవిచ్ఛేదక
క్రతు దీక్షాధ్వజ మాంగిలేయుల యొడల్ కంపింప నిచ్చోఁ బ్రతి
ష్ఠితముం జేసితి *వప్పికట్ల సుకృతశ్రీ పొంగి ఘూర్ణిల్లఁగన్

*గ్రామముపేరు-గుంటూరు

నెవ్వలు సైఁచిసైఁచి ధరణీప్రజయాఁకలి దీర్చు కర్షకుల్
గవ్వకు రువ్వ కేని కొఱగాక తపించు తఱిన్. దదాపదల్
దవ్వులుసేయ నిల్చిన యుదాత్తచరిత్రుఁడ వీవు, నీకథల్
కవ్వముపాటలై శ్రుతిసుఖంబు నొసంగును రంగనాయకా!

పదుగురుబిడ్డ లేర్పడి శుభమ్ము లభమ్ములు సందడింపఁగాఁ
జిదికిన రైతె కార్మికుఁడు, చేవలుదేలిన కార్మికుండె రై
తిదిగద నగ్నసత్యఁ మిక నీప్రజలోఁ దెరగట్టి కయ్యముల్
మొదలిడువారు వెఱ్ఱు లని మూదలచేసిన నిన్ను మెచ్చెదన్

కాఁపులు కూలివాండ్రు నొకకాఁడికిఁ గట్టిన రెండుగిత్తలై
రాపిడిలేనిబాటలఁ బరస్పర బాంధవసౌహృదమ్ములన్
జూపిననాఁడె *నాఁడెములు చొప్పడు వీరి కటంచు వేఱిమిం *(శుభములు)
జోపి వెలుంగునిచ్చు జగజోతికి నీకు నివే నివాళికల్

మట్ట బిగించి పాఱగొని మాగిలిచెక్కక చెట్టునీడలో
గట్టుననిల్చి చుట్ట లెగఁగాల్చుచు నిక్కుట నేర్తువేని నీ
పుట్టి మునుంగు నీబ్రదుకు బోరగిలంబడు నంచు సేద్యపుం
గుట్టెఱిఁగించి కాఁపు నెసకొల్పితివే ! తడికయ్యలో దిగన్

కాఁపుఁదనమ్ము సార్థకముకావుటకున్ దటినీసమంత మెం
తో పాల ముండుఁగాక పతితో మడికింజని కంకణమ్ములన్
రాపిడిసేయుచుం బసిఁడిరవ్వలగాజులు గుల్క నోర్మికిన్
బ్రా పయి నాటువేయవలెఁ బైదలి యన్న నినున్ గణించెదన్.

ఎకరా లేఁబదిలేవు ముప్పదియులేవే యంచు నిట్టూర్చు క
ర్షకులారా ! చిఱుదోఁటతోఁ బదుగురన్ రక్షించు పూరింటి హా
లికునిం జూడుఁడు చెమ్మటల్గురిసి వెల్లిం దీర్చు నేర్పున్న ఖం
డ్రిక లేలా తలద్రేఁ గటందు విది ధాత్రిం దేర్చు సూత్రమ్మురా!

ఇది సర్వోదయరుక్ప్రసార, మిది వహ్నిజ్వాలికామాలి కా,
స్పద నిర్భాగ్యనరప్రపంచముఖ వర్షావారివాహచ్ఛ టా

భ్యుదితాసారము, ధర్మపూర మఖిలాంహ్రిూవాసనాదూర మి
య్యది, భావేపరమర్షిబోధిత మహీయస్త్యాగసారమ్మురా!

జాతిపిత కలగన్నరాజ్యమున కిపుడె
యంకురార్పణ జరిగె నియ్యది ఫలింప
నలఁగవలయు నీ వంటి నాయకాగ్ర
గణ్యు లీనేల గొన్నాళ్ళు పుణ్యనిధులు.

ఆర్థికసమానతాసిద్ధి యైనఁ గాని
విడువ దావేశ మీనాటి విప్లవంబు
సాంఘికసమానతాకృషి సాగదేని
దేశమున కెన్నఁదగినంతదీప్తి రాదు.

విత్తము పంచిపంచి యొక విశ్వకలాపరిషత్తు శేముషీ
మత్తకుఁ బేరుగన్న గురుమండలి నిల్పి జగాన కెంత వి
ద్వత్త నొసంగు నంత కొకవందమడుంగులు హెచ్చుగాఁ దమ
శ్చిత్తి యొనర్చి తీవు పలుసీమల వేసవిపాఠశాలలన్.

ఆచార్యుం డన నీవ! నిన్గొలిచి విద్యాచాతురి న్గన్నవా
రేచాయం గనుఁగొన్న నుందురుకదా యీసీమ; నీశిష్యకుల్
సాచివ్యమ్మున గ్రామపాలనమునన్ సామర్థ్యముల్ నింపి చాం
ద్రీ చారు స్థిరకీర్తికిం గుదురులై దీపింతు రీ ప్రొద్దులన్

*అంతేవాసుల పెంపు నీ పెనుపుగా హర్షింతు, సేవారత *(శిష్యులు)
స్వాంతుల్ దాంతులు ముద్దుసేయఁదగుత్రోవం బోదు, వేదిక్కునన్
శాంతిచ్ఛేదకవాదముల్ వొడమినన్ సైరింప - వుర్వీహిత
క్రాంతిప్రేరక ధర్మపీఠమవు రంగా! నీవు ముమ్మాటికిన్

ఆస లడంగి నింగిదెస కక్షులుసాఁచిన రైతుపట్ల నీ
చేసిన సేవకున్ విలువ చెప్పఁగఁ జాలినవాఁ డెవండు? నేఁ
డీ సకలావనిన్ హలికుఁ డేలుచు నుంట యథార్థ; మాతఁ డీ
వాసికి వచ్చుటెల్ల గుణవన్మణి! నీకృషిచేతనే కదా!

క్రొత్తతెలుంగురాష్ట్రమునకున్ సమకూడిన చీడ లెన్నియో
తుత్తుమురై నశింపఁ దఱితో మొనకట్టిన జెట్టి వీవు, నీ
సత్తయుఁ దేశభక్తియుఁ బ్రసన్నతయుం బ్రతిలేని శౌర్య సం
పత్తియుఁ ద్యాగరక్తియును బ్రస్ఫుటమయ్యె నిటన్ మహామతీ!

నిను దేశభక్తుఁగా మె
చ్చిన వారలు కలరు మహి నశేషప్రజ; లీ
వొనరించిన భాషా సే
వ నెఱింగినవార లెన్ని వందలు కలరో!

సాహిత్యంబును మానవాభ్యుదయబీజం బన్న సత్యంబు నీ
యూహం దోఁచుటఁ దద్వికాసమున కీ వుద్యోగముం జేఁత, వా
చా హేవాకవిశిష్ట శిష్టరచనల్ సాగించుటంజేసి నీ
స్నేహంబున్ వరియింత్రు మాదృశకవుల్ శ్రీభారతీవల్లభా!

చక్రవర్తుల ముత్యాలశాలలందు
నగ్రహారాల నడిబొడ్డులందుఁ గులుకు
కవులు కనలేని తెలుఁగు చక్కందనమ్ము
చూఱలాడిన శారదాసుతుఁడ వీవు.

పల్లెటూరఁ బుట్టి పల్లెల సేవించి
బీదవారి కులముపేదవారి
పలకు గుట్టెఱింగి పసగల జాతీయ
రచనసేయు సుకవిరాజ వీవు

తెలుఁగునుడికారమందున్న మెలపు నెఱిఁగి
తెలుఁగుహృదయంబు నందున్న తీపి నెఱిఁగి
తెలుఁగుసంస్కృతియందున్న చెలువ మెఱిఁగి
తెలుఁగునకు నీవు సరిక్రొత్తవెలుఁగు లిడితి

పలికిన వ్రాసిన తెనుఁగుం
గలితనమును జాటు నితఁడు, కవివర్యుల వే
ల్పులఁ బోలెఁ గనుంగొను, నే
యిల కేగిన పల్కరించు నీయన్న ననున్.

శరవేగమ్మునఁ గమ్మవ్రాసెదవు భాషాదేవిమంజీర మం
జు రవంబై మధుకోశమౌ నదియు - నెచ్చో నేర్చి తీపల్కు? నీ
పరమ ప్రేమలుగన్న పల్లియల సంపాదించితో, భారతీ
తరుణీ సంతతసాహచర్యముల నందంగంటివో తెల్పవే!

ఆంగ్లభాషాప్రధాన విద్యాలయములఁ (ఆక్స్‌ఫర్డ్-లండను)
జదువు నేర్చినవాఁ డయ్యు నదిర! యితఁడు
కోవిదుఁడు మాతృభాషలోఁ, గొంకులేని
వక్త యితఁ, డెట్లు వడసె నీవైభవంబు!

నీజత కెందఱోకవులు నిచ్చలు వత్తురు, కావ్యగోష్ఠిలో
రోజులు రోజులే మఱచు రూపము నీది-గుణాగుణజ్ఞతా
రాజితబుద్ధి నీది-రుచిరం బగు తర్కము నీది-కావునన్
రాజులఁ గొండపల్లిబొమరాజులఁ గన్గొన వొక్కతీరునన్.

కవి యెవఁడో ప్రజాభ్యుదయకాముకధీపరిణద్ధుఁ డెవ్వఁడో
ప్రవిమలవృత్తిదీప్తి పరిభాసురుఁ డెవ్వఁడొ నిగ్గుదేల్చువా
రవనికి నేతలై వెలసినప్పుడె ధర్మువు గెల్చు గారడీ
రవరవ లిచ్చటం బనికిరావు కులమ్ములు గావు నిచ్చెనల్.

భారతిపొత్తు నీ మధురభాగ్యము-దక్షిణభారతక్షమా
భారము నోర్చినట్టి *గణపత్యవనీంద్రుని ముద్దుపట్టి రే *రుద్రమదేవి
ఖారమఁ జూతు మా వదినగారిముఖమ్మునఁ గాకతీయ రో
చీ రమణీయమై తెలుఁగుసీమ వెలుంగుత! మీకతమ్మునన్.

నీ కఠినవ్రతమ్మునకు నిగ్రహచండిమ కండయై పురం
ధ్రీ కులరత్నమై వెలయు దేవిని భారతి నుగ్గడింతు న
స్తోకశుభానుషంగపరితుష్టిని మీ రిఁక నర్వదేఁడు లీ
లోకమువారికిన్ గనువెలుంగులు కం డని పల్కరించెదన్.

పతి కెనలేనిగౌరవము బల్మియు నేర్పడఁ దత్పథమ్మునన్
బ్రదుకు టపేక్షణీయ మని భారతి భారతమాతృవేదనా
చ్యుతికి నతీవకష్టముల నోర్చి నపారతపమ్ము సైఁచె సం
తత మగుసేవ కీవికిని దా నొకమూదలగా నిలంబడెన్.

నడివేసంగితఱిన్ ఖరాంశుఁడు జగానన్ నిప్పులన్ గ్రక్క న
య్యుడుకున్ సైఁచి విదేశవస్త్ర విపణివ్యూహంబు మ్రోలన్ నిలం
బడి నీవై పికిటింగుచేసిన కథల్ భావంబునన్ దోఁచి మా
యొడలెల్లన్ బులకించు నిప్పటికి; నోహెూ! దేశసేవాకృతీ!

ఒక్క చెఱఁగాదు రంగా
యెక్కడ నేచెఱలఁ బడియె నీవును నా యా
యిక్కట్లఁ బడితి వోడక
నిక్కపు సహధర్మచారిణీత్వము వెలయన్.

పదవుల కాసింపక సం
పదలకు నారాటపడక పతిత సమాజా
భ్యుదయము నర్థించిన నీ
బ్రదుకు నెలంతలకు మేలుబంతిగ నిలుచున్.

మనకడ నేర్చినేర్చి పదిమందికిఁ జెప్పఁగఁజాలు ప్రోడలై
మనెడి కుమారకల్పుల కమాత్యత కావలె, వారి దిద్దుచున్
దనియుట నీకు నాకు నుచితక్రియ కావలెఁ గాని పీఠముల్
మన కవి యేటి కంచు విభుమక్కువ దోఁచుట నీక చెల్లెఁబో!

సేవామూర్తివి నీవు నీనడతకున్ జే పల్కు శ్రీభారతీ
దేవిన్ నీసతిగా సృజించి విధి కీర్తిన్ బేర్చె నల్దిక్కులన్;
ప్రావృణ్మేఘమువోలె సత్కవులు మీపై హృద్యపద్యోక్తిమా
లావర్షమ్ములు నింప నీతెలుఁగునేలన్ నిల్వుఁ డాకల్పమున్.

నీకు లభింపఁదగ్గ మహనీయ పదమ్ములు రామి నిక్క; మీ
లోకము గ్రుడ్డి దౌట నిట లుప్తము ధర్మువు; దీనికేమి సే
వాకమనీయజీవన మెవండు వరించి నలంగు నాతఁడే
కాక ప్రభుత్వధూర్వహుఁడు కన్పడునా చరితన్ మహామతీ!

నీకు నుదాత్తపీఠ మిడనేరద! లోక మటంచు మామనం
బాకులమౌను గాని జగదద్భుత నిర్మమతానిరూఢ యో
గాకృతివైన నీ విట రవంత కలంగవు క్రుంగ; వీతపం
బేకొనకొమ్మజుంటిచవు లిచ్చి నినున్ దనియింపనున్నదో!

ఎందరుచక్రవర్తు లిల నేలరు? గౌతమబుద్ధుకైవడిన్
గాంధివిధాన వారు కనఁగల్గిరొకో జనతాకృతస్తుతుల్;
కందనికర్మయోగమున గాసిలు నెవ్వఁ డసంగబుద్ధికిన్
మందిర మెవ్వఁ డాతఁడ సుమా! గణనీయుఁడు సర్వకాలమున్.

అన్నవు నీవు నాకు, నటులయ్యును దమ్మునికంటె లేఁతగాఁ
గన్నుల కింపుగూర్చెదవు, "కారణమెయ్యది దీని" కంచు నా
కున్న మనీషతోఁ దఱచి యొక్కరహస్యము గంటి, గెల్పులన్
*బన్నములన్ సమానపరిపాటి గణించి గడింతు వీసిరిన్.

* (ఓటములలో)

ఇది యాత్మోన్నతి లేనివారిసిరి కానేకాద! గీతాజను:
పదమై కృష్ణుఁడు నిర్వచించిన "స్థితప్రజ్ఞత్వమే" దీని తీ;
రదిరా! నీ *వజరుండ వౌట యొకలెక్కా? యర్వదేండ్లేమి? నీ
బ్రదు కెన్నెన్నియొ పుట్టుపండువులతోఁ బ్రత్యగ్రమౌ నగ్రజా!

* (యువకుడు)

హృద్యగద్యరచన నుద్యన్మనీషుల
మెప్పుగన్న తెన్గుమేటి రంగ;
అస్మదాదు లీ మహ త్తకు మురిసి యీ
యన్న మేలు వలతు రగ్గలముగ.

లోకహితంబు నెంచి, పవళుల్ నిశలున్ కృషి సల్పి, జాతికిన్
రేకలుదిద్ది, గద్దెల వరింపని సేవల మెచ్చి, సత్కవి
శ్లోకము లందుకొన్న గుణసుందరమూర్తికి, సాధుకీర్తికిన్
నీకుఁ జిరాయు వాంధ్రజననీప్రియదారక రంగనాయకా!

(పైరపంట++ - 1960)

## ❋ దేశభక్త శ్రీ తుమ్మల బసవయ్య ❋

(వినయాశ్రమ స్థాపకులు - కావూరు, గుంటూరు)

దేశమాతృ దాస్యపాశ విచ్ఛేదన
దీక్షమై సబర్మతీమహర్షి
శస్త్రదూరమైన సైన్యమ్ము నడిపిన
తొలిదినాల నాత్మఁ దలఁచుకొందు.

ఏ పల్లె దీపించు రేపల్లెసీమలో
పాఁడిపంటల కాటపట్టనంగ
నే పల్లె నిజదేశహితకార్యనిరతులౌ
కాంగ్రెస్సుయోధులఁగని రహించు
నే పల్లె పరధర్మ మాఁపంగ నెలకొల్పె
జాతీయవిద్యానికేతనంబు
నే పల్లె గాంధీదయాపూరసిక్తమై
యనవద్యమయ్యె నయ్యనఘురాక
నెందు "గాంధిశిలాస్తంభ" మెత్తఁబడియె
నెచటఁ తుమ్మల బసవయ ప్రచురదాన
మానితంబైన "వినయాశ్రమంబు" వెలసె
మీరు నేపల్లెపేరు "కావూ" రనంగ.

హరిజన ప్రవేశ మంగీకరించిన
తెనుఁగునాట మొదటిదేవళమ్ము
కానిపించె నపుడె కావూర మాయూరఁ
తెలిచె నది సబర్మతీమహర్షి.

కడిమిన్ దాలిమి నెంతయున్ మెఱసి మాకాణాచి 'కావూరు' ముం
దడుగై నిల్చెను దన్మహారణమునం; దాయాస్మృతుల్ రేఁగి నా
యొడలెల్లన్ బులకించు నిప్పటికి; నోహెూ! యెవ్వఁడాజోదు మా
*పడవాలా?యవు నాతఁడే ! బసవయా! భక్తిప్రణామం బిదే! *నాయకుడు

ఆరబ్ధమయ్యె నెయ్యది పుత్తలీబాయి
సుతుఁడు వెల్గించినజోతి తోడ
అండయై నడిపె నెయ్యది పరాధీనతా
వ్యూహభంజక సకలోద్యమముల
ఆశ్రయం బొసఁగె నెయ్యది దురాధివ్యాధి
మగ్నయై భుగ్నయై మ్రగ్గుప్రజకు
కదలింప నేర్చె నెయ్యది తన్నుఁ దిలకింప
రాజర్షిమౌళియౌ రాష్ట్రపతిని (శ్రీ రాజేంద్రప్రసాదు)

యోగమున కార్తసేవానురాగమునకు
సదనమై పొల్చె నెయ్యది, యది దిగంత
విశ్రుతవికాసఖని వినయాశ్రమంబు
బసవయా! నీ వదాన్యతాఫలము సూవె!

చెఱలఁబడుటకాదు, సేవ కా దంతంత
యీవి కాదు, కలిమినెల్ల నిచ్చి
బసవయార్యుఁ డచ్చ బైరాగియై విన
యాశ్రమధ్వజమ్ము నవధరించె

ఒక్క నీసతి నీ కిట నుద్ధి వచ్చు
నేమొ దుర్గాంబ - లోభమ్ము నీసడించి
త్యాగమయ కంటకావృ తాధ్వమ్మునందు
నిడుమలకు నోర్చి నీవెంట నడిచె నీమె

గురుఁడు గొల్లపూఁడికులుఁడు సీతారామ
శాస్త్రి మిమ్ము దిద్దఁజాలె నిట్లు
నవభగీరథుని, మనస్విని, బాపుజీ
ఛాత్రమౌళి నితని సంస్మరింతు

కడగండ్లమునిఁగి యట్టడుగునఁ బడియున్న
బడుగుల తలపుండ్లు కడిగికడిగి
నా యన్నదిక్కు గానక యేడ్చు నిసుఁగులఁ

ప్రేమామృతమ్మునఁ బెంచి పెంచి
మంచానఁబడి యుమ్మలించెడురోగుల
నెనసి విణ్మూత్రంబు లెత్తి యెత్తి
ముదుకబట్టలమూట మోసి నల్గడ నమ్మి
పేదరాలికి బువ్వ పెట్టి పెట్టి

యీ సమస్తకార్య మీశ్వరసేవగాఁ
జిత్తగించి తనివిసెందు నిన్నుఁ
జూడఁ జూడ మాదృశులమస్తకమ్ములు
తమకుఁదామ యవనతమ్ము లగును

అఖిలభారతసౌహార్ద మాహరింపఁ
గనిన వినయాశ్రమమ్మును గాచు సుకృతి
బసవయకుఁ గాన్క వెట్టితి మసృణమధు ని
ధానమైన "సర్వోదయగాన" కవిత (1961)

పేదలెస్సకై తపించు వినోబా మ
హర్షి వాణి వేణియై తెనుంగుఁ
బుడమి సామ్యయోగ భోగమ్ము పండింప
నొదవుకైత ప్రగతి కూఁత యిద్ది.

లోకంబు హింసాకులంబు, సత్యమ్ము లుప్త, మీవేళ
నేకడన్ గన్నఁ జీఁకట్లు తీండ్రించు; నీ విపద్దశను
బోకార్పఁ బెనఁగు నీబోంట్లకుంగాక పూని యెవ్వాని
కీ కైత నిడెద? సర్వోదయధ్యేయ! యీకొనంగదవె!

( సర్వోదయగానము - 1961)

## ❋ జాతీయపోరాటవీరుడు శ్రీ మన్నె వేంకటచలపతిరావు ❋

(గ్రామాభివృద్ధి చేసిన సర్పంచ్ - ఈతేరు)

గ్రామమునకుఁగాదు, సీమకు నొకఁడైన
నిన్నువంటి మాననీయుఁడున్న
దేశభాగ్యమెంత దీపించునోగదా!
మన్నెవంశవనరమావసంత!

ప్రజలసొమ్ము నిప్పపగిది భావింతువు,
పరులమేలు కొఱకుఁ బరితపింతు;
వెవరు నేర్పిరయ్య! యీ చందమును నీకు?
నెందఱుంద్రు నిన్ను నెనయువారు?

చలపతివి కావు, సజ్జన
కులపతివే! నీవు; నిన్నుఁ గొనియాడుట నా
కెలమిం గూర్చును; గావునఁ
బలికెద నీకైత మేనిపస చెడియున్నన్

ఎంత చిన్నదైన "నీతేరు" నీసేవ
కతన శతవికాసకలిత మయ్యె
నగరమందు లేనిసొగసుల నీయూరఁ
జూచి పెఱలు శిరము లూఁచుచుంద్రు

ఇంత గొప్పవాఁడవీ; వయ్యు నీదారి
నొదిఁగి యొదిఁగి పోవు చుందు వెపుడు
నెంత పండినాఁడ! వీ నమ్రతయ కదా!
మానవునిమహత్త కానవాలు (25-4-1961 - సమ్మానసంచిక)

## ✻ దేశభక్త శ్రీ శరణు రామస్వామి ✻

(అమృతలూరు గుంటూరు)

మదివికసింప వాఙ్మయ సుమమ్ములు చల్లెద వెల్లమేనికిన్
బెదరుచు దేశమెల్ల దురపిల్లెడువేళ సబర్మతీమహా
నదికడ మ్రోసినట్టి రణనాదముతోఁ బులకించి సింగపుం
గొదమవిధాన రంగమునకున్ జనుదెంచిన రామసామికిన్

కత్తి కటారిలేని పెనుకయ్యము రేఁగిననాఁడు శాత్రవుల్
తత్తఱపాటుసెంద సముదాత్తము నాత్మబలమ్ముఁ జూపి ధీ
మత్తతి మాయురే! యనుచు మైమఱపుం గన మాతృదాస్యవి
చ్ఛిత్తియొనర్చినట్టి శుభశీలుని మాశరణున్ గణించెదన్

పన్నుల ధిక్కరింపుఁ డని పల్లెలకున్ రణశిక్ష నిచ్చుచున్
'బొన్నురి' లో నితం డెగసి బుఱ్ఱయ సత్రము ముందటన్ దొరల్
పన్నినకట్టు త్రెంచి శ్రుతి పర్వముగా వెడలించినట్టి ప
ల్కెన్నఁటి దైననేమి ధ్వనియించును నా చెవిలోన నేఁటికిన్

గుంటురిపేరు విన్నదొరకున్ వణఁకెత్తెను పార్లమెంటులో
గంటకు మూఁడుమా ర్లిచటికయ్యము చర్చకువచ్చి సీమకున్
గంటకమయ్యె నాఁడు; మొనకట్టినయోధవ రేణ్యు లిట్టివా
రుంటఁగదా లభించె యశయున్నతి గర్తపురీ ధరిత్రికిన్

రక్కసి రాజ్య ముక్కడఁగి, రావలయున్ బ్రజపెత్తనమ్ము, నల్
దిక్కుల నవ్యదీధితులు దీటుకొనన్వలె నంచు నిష్ఠమై

రక్కెసతాల్మి నొడ్డి పలురాపులుపడ్డమగండితండు నేఁ
డెక్కినపీఠ మెట్టిదని యెంచి కలంగకపోరు మాదృశుల్ (5-9-1961 - పైరపంట)

## ✻ డా॥ అడుసుమల్లి నారాయణరావు ✻

( కవులు, సాహితీపోషకులు గుడివాడ)

అడుసుమల్లివారి కర్వదియేఁడులా
మొగముమీఁద నొక్కముడుత లేదె
కన్నుగుట్టి యెవరొ పన్ని రీయాగము
ముసలితనము చూడ నెసరుపెట్టి

కాకానివారి తంత్రమొ
కాకున్నను విన్నకోటకవి కల్పనమో
లేకున్న నెజ్జియొజ్జల
ధీకిటుకో యింతవఱకుఁ దెచ్చిన దనెదన్

వెఱచె నధర్మ మసత్యము
వెఱచినగతి నితనిఁ జేర వృద్ధతయు నహో!
గరువమ్ము వోనికైవడిఁ
బరువమ్మును బోవ దితనిప్రాపున కెడయై

కష్టములన్ సుఖముల సమ
దృష్టిం గను కర్మయోగి యితఁడు జరాసం
దష్టుఁ డగు టెట్లు పొసఁగును
శిష్టున కీయగ్ని కెట్లు చెద లంటు నయా!

రాచవారలడెందము ఱాతిముక్క
పలుకు సరిక్రొత్త వెన్నయై పరఁగు నన్న
నన్నయకు దిద్దెఁగద పంగనామ మితఁడు
కూచినుడి మెత్తమెత్తనిగుండె వడసి

క్షత్రియుఁడు కాఁడు కమ్మని
ధాత్రీసురుఁ డితఁ డటన్నఁ దగవాడక తౌ
ర్యత్రిక మంగళగౌరవ
పాత్రుని గావింతు సత్యభారతి నితనిన్

కవి యయ్యు నితఁడు నిచ్చలు
కవిపూజ లొనర్చుఁ బరసుఖము తనసుఖ మం

చవిరత విపన్న సేవా
ప్రవణమతిన్ బడలు నిట్టిప్రాజ్ఞులు కలరా!

రాజకీయాది జీవనరంగములకు
నన్నిటికి నీదృశు లుదారు లబ్బి రేని
దేశమున కెంత కాంతి ప్రాప్తించి యెంత
శాంతి సమకూడి యెంతసంక్రాంతి యగునొ

నారాయణరాయ! భవ
చ్చారిత్రము సాధులోక సంభావ్యము, నీ
గౌరవమున కీ నవసుమ
హారము నర్పించువాఁడ నంజలితోడన్ (5-1-62 - సమదర్శి)

## ❊ చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు ❊

కృష్ణరాయ! కళింగమహీజిగీషఁ
గదలి శ్రీకాకుళస్వామికరుణ వడయ
నతనిసన్నిధి నీవు ని ట్రవధరించి
భక్తిలో స్మృతిలో హరిపాదసేవ
నార్చనాదులలో బ్రుంగి యలసి సొలసి
మైమఱచి నిద్ర గన్నపు డాయురారి
నీకలన్ గనిపించి గోదాకుమారి
రంగమునఁ దన్ను వలచిన రమ్యకథను
దేశభాషల లెస్సయౌ తెలుఁగునందు
నందములుగుల్క నిర్మించి యస్మదీయ
చిత్త మలరింపు మని శుభాశిషము లొసఁగి
నిన్నుఁ గరఁగింప మెలఁకువగన్న వెనుకఁ
గైతవ్రాసితివా! మంచికథయ; పగఱ
నెద్రిచి పోరాడఁ జనువాని కేని కేని
రక్తసంసిక్త రణవిహారములుగాక
జయపరాజయ లాస్యదాస్యములుగాక
యిట్టికల వచ్చునా? మఱి యిది యసత్య
మనుట నీపట్లఁ బొసఁగునా? యదిర! యెంత
వింతమనుగడ నీది? భూకాంత! యెంత
సుస్థిత ప్రజ్ఞ నీది? నీజోడువచ్చు
యోగి యెవ్వఁడు? రసరసాభోగతృష్ణ

లొాదిఁగె నీలోనఁ; గానిచో నురక నిన్ను
"సాహితీసమరాంగణసార్వభౌమ!
కృష్ణరాయేంద్ర! కృతి వినిర్మింపు" మనుచు
వివిధవిద్వజ్జనావళి వినుతిసేయ
నెంచునా? దక్షిణాపథం బెదురులేని
చేవఁ బాలించునీవు రాసిక్య మేచి
యెంతసేయవు కవులకై! యెంతభక్తి
బాహిరింపవు! పెద్దన్నపదము పట్టి
తొడిగితివి పెండెరము; కవీంద్రుని కడాని
పల్లకీ మోసితివి; తెన్గుఁబలుకు వెలఁది
పున్నెములు పండి కైవ్రాలి పుట్టి తీవు;
'రాయ' లనినంతనే 'కృష్ణరాయ' లన్న
యర్థమే తోఁచుఁ గాని విద్యాపురాధి
పతులు హరిహరముఖ్యు లిప్పట్ల మాకుఁ
గానిపింపరు పరమభాగ్యమ్ము నీది;
నీకళారాధనాసక్తి నీకవిత్వ
సృష్టియును గారణంబు లీశ్రేయమునకు
నెంతసిరి యున్న నెంతవిక్రాంతి యున్న
నెంతదొరతన మున్న సాహిత్యమైత్రి
లేనివాఁ డెవ్వఁడు చరిత్రలో నెసంగె?
నున్నవాఁ డెవ్వఁ డుద్దీప్తి నొందకుండె?
ధన్యతామూర్తి వీవు విద్వత్కవీశ!
మాన్యతారాశి వీవు సమ్రాడ్వతంస! (సమదర్శి - 10-3-62)

## ✲ అనాథలపెన్నిధి సాధువమ్మ ✲

(సత్తెనపల్లి-గుంటూరు)

పిల్లలకు మంచిపే రిడు తల్లిదండ్రు
లెల్లతావులఁ గలరు గానీ, తదాఖ్య
సార్థకమ్మును గావించు సాధువమ్మ
వంటిపిల్లలు లేరు లే రింటనింట

అకట! విధి బలీయమై యీమె యెడఁదలోఁ
జిన్నతనమునందె చిచ్చువెట్టె
సెగలు వగలు రేఁపి చెరలాడుచిచ్చున
కెదురుతిరిగి నిల్చి యీపె గెలిచె

ఆర్తసేవానురక్తిమై నార్ద్రమైన
యీమెహృది నుండలేక పర్వెత్తె నగ్ని
భగ్నజీవనలకు నొజ్జబంతి యగుచు
మమ్మరే! పండినది సాధువమ్మబ్రదుకు

రెండుకాళ్ళ పశువురీతి నుగ్రారణ్య
వీథిఁ దిరుగుబాల విదుషి యయ్యె
మానవత నడంచు మతకులకుడ్యముల్
చిద్రుపలయ్యె నీమెసేవకతన

దిక్కులేనివారి తిండికి సత్రమ్ము
పెట్టె నీమె కరుణ పెరిఁగి పెరిఁగి
మొండి తనముసైఁచి కొండంత మేనితో
దేశమెల్లఁ దిరిగి తెచ్చె బువ్వ

పరులకొఱకు నవయు బ్రదుకుగదా! ముక్తి
కారణమ్ము, విజయతోరణమ్ము;
సాధువమ్మ! నీకు సమకుఱినట్టి యీ
గొప్పతనము వీరగురుని కృపన!

గురునికీర్తి నిల్ప వరణీయకవితా వి
ధాతృపూజ కొగ్గి తనిసె దీవు
కవులు జాతిజీవగఱ్ఱ లన్న రహస్య
మెఱుకపడిననీకు నెవ్వ రీడు?

నీకు నఱువదేండ్లు నిండ నీసేవకు
నలువదేండ్లె నిండినవిగదమ్మ!
చేయవలయు నీదుసేవకు శతవార్షి
కోత్సవమ్ము లాంధ్రు లూర నూర!

నీ సేవలు నీత్రోవలు
నీసైదోడులకు మాననీయమ్ములుగన్
వాసంతమల్లికాసుమ
భాసంతయశమ్ముతోడ బ్రదుకుము చెల్లీ!

(21-3-1962 - పైరపంట)

## ✳ నాస్తికఋషి శ్రీ గోపరాజు రామచంద్రరావు (గోరా) ✳

(విజయవాడ)

కులమతవర్గ పిశాచా
వలి కోఱలు నఱికి మానవతకున్ నవతా
కలితద్యుతి చేకూర్చిన
బలుమానిసి గోపరాజ వంశజు మెత్తున్

పురుషకారంబు మఱచి సోమరితనమ్ము
వలచి తన భారమెల్ల దైవంబు నెత్తి
నునిచి గుఱువెట్టు మూఁక నల్లన కదల్చి
దిద్దఁజాలిన 'గోరా' కృతిత్వ మెంతు

సత్యనిష్ఠ యున్న జంకమి యున్న సే
వానురక్తి యున్న మానవునకు
నెంతవార లైన హితు లౌదు రనుట కీ
గఱువ తారకాణగా లభించె

ఆస్తికులమనసు దోఁచిన
నాస్తికుఁ డీగోపరా; జనన్యార్జిత మీ
*శస్తము; సేవా త్యాగ * కీర్తి
ప్రస్తత నదలించి యితఁడు తగె నీపనికిన్

బాపూజీ భావేఋషి
యీ పురుషునిచరిత మెచ్చ నితరుల మెప్పే
లా? పరమాయుస్సౌఖ్యము
లీ పండితుపాలివై మహిన్ దనుపవలెన్ (7-9-63 - సమదర్శి)

## ✳ సర్వోదయ నాయకుడు డా॥ వెంపటి సూర్యనారాయణ ✳

(తెనాలి)

తన సుఖమ్ము కొఱకుఁ దన యాలుబిడ్డల
సుఖము కొఱకుఁ గాక నిఖిలజనుల
సుఖము కొఱకు బ్రదుకు సూర్యనారాయణు
నెడఁద పెంపు నుడువ నెవని తరము?

ఎన్నఁదగిన యెడఁద యెది? విపన్నుని గని
నంత జాలువాఱు నదియ కాక
నరున కిదియ గుర్తు నాఁ జెల్లు రెండు కా
ళ్ళుంట కాదు బువ్వఁ దింట కాదు

అనఘమైన శాక్యముని కోవలో మేటి
నరుఁ డితండు పొడమినాఁడు నేఁడు
ఇతని కొజ్జ లైరి *యెరవాడసంయమి *(గాంధి)
ధీమదుత్తముఁడు వినోమహర్షి

కరుణ సత్యము నిష్కామకర్మయోగ
మేకమై సూర్యనారాయణాకృతిఁ గనె
ఇమ్మహామతి సర్వోదయమ్ము దక్క
వలచునా స్వీయ ధనధాన్య వైభవములు

మాడ కాసపడిన మా డాక్టరు తెనాలి
వాడ కొక్క మేడ వైచుఁ గాని
మాడ కాసపడక మహినెల్ల మేడలు
కట్టె నితఁడు కీర్తికాంత లుండ

ఇది మల మిది మూత్రం బని
యెద రోయక వీథు లూడ్చు నీతనిబ్రదుకే
బ్రదు; కీ పాకీ సూరయ
పద మంటినచోటు శౌచపద మౌ టరుదా?

తా నూడ్చెడితావును భగ
వానునిముంగిలి యటంచు భావించు నహో!
తా నుపచార మొనర్చెడి
ప్రాణి నితం డూహసేయుఁ బరమేశ్వరుఁగన్

నిక్కమైన సేవ నిగ్గులు తిలకింప
నేగుదెంత్రు సుజను లితని కడకు
నాఫ్రికోర్వినుండి యమెరికా నుండి యిం
గ్లాండునుండి తాయిలాండు నుండి

ననుఁ జూడనేల మీ రల
తెనాలికిం బోయి కనుఁడు తెనుఁగన్న భిష
జ్మణి వెంపటి నని భావే
పనుపన్ జనుదెంతు రాత్రపాటున వీరల్

వెలఁదుల నితండు వందల వేలఁ దీర్చి
సకలభూముల శాంతిదూతికలఁ జేసె
ఇతని యాచార్యకంబున కెంతయేని
ఋణపడె నయారె! తెల్గునారీ జగత్తు

అగ్నిశిఖల వంటి యతివ లూరూర స
ర్వోదయోద్యమ ప్రయోగ నిపుణ
లగుట చూచి పురుషు లణఁతురు తమబింక;
మెంతచేసె డాక్ట రెఱుఁగనట్లు!

లోకంటిని సవరించుట
పైకంటికి మం దటంచు బడలు నితం డీ
పోకడ బహుభవసుకృత
శ్రీకతమునఁ గాక ప్రజ్ఞచే వశపడునా?

సహధర్మచరీ పదభర
వహనక్షమ సుందరమ్మవల్లభుఁడై యీ
మహముంగనె మా డాక్టరు;
నహి! నహి! తత్సతిని దొరయునారి జగానన్

స్వకజీవితమే జాతికి
నొకసందేశముగ సాగు యోగీశ్వరుఁ డీ
యకలంకచరిత్రుఁడు గాం
ధి కుటుంబము పరువు నిల్పుఁ దెనుఁగుంబుడమిన్

నీకు నర్వదివత్సరాల్ నిండె ననుచు
సలుపుచున్నారు పెద్ద లుత్సవము నేఁడు
సతత సర్వోదయోద్యమ వ్రతుని నిన్ను
నెంత కరఁగించు వెంపటీ! యీ మహస్సు?

నిన్నువంటివారి నిస్స్వార్థయోగాన
సిద్ధిగన్నవారి సేవ లీవు
లిట్లు మెచ్చి మెచ్చి యేనాఁటికైన వీ
రాసచేయవచ్చు నన్యహితము

గాంధికవిని నేను దదాత్మకథను మున్ను
వ్రాసితిని దెల్గుబాసలో వాసికెక్క
నీకథకుఁ బ్రాణమౌ గీత నిపుడు తెనుఁగు
సేఁత మత్పరమప్రీతి హేతువయ్యె.

గీత చదువఁ జదువఁ గైతయు నవశమై
పొంగివచ్చి నన్ను లొంగఁ దీసె
గీత నేను గన్నరీతి "గీతాదర్శ"
మనెడుపేర నిట్టు లవతరించె.

గీతార్చకు నిను ముఖ్య
శ్రోతను గావించి మెఱయఁజూతును దీనిన్
నా తలఁ పిది పాటింపుమ!
నా తృప్తికి సాధుసాధనముగా నగుమా!

జయ! జయ! వెంపటివంశజ!
జయ! జయ! సర్వోదయ ప్రచారస్విన్నా!
జయ! జయ! భావేప్రియపథ!
జయ! జయ! గాంధేయ ధర్మసత్యపతాకా!

(24-6-1964 - సమదర్శి) ("గీతాదర్శము" వీరికి అంకితమివ్వబడినది)

## ❊ మహాయోగి శ్రీ రామతీర్థ ❊

అతఁడు నిశితబుద్ధి యతఁ డింగిలీసు ప
రాసు బాసలందు రాణకెక్కె
అతనిచదువు లింతమెతుకునకు బడాయి
బ్రతుకునకును సాయపడఁ దొడంగె

"రామకథను ద్రచ్చి రమణీయ కావ్యమ్ము
వ్రాసినట్టి తులసిదాసుకోవ
నీవు పుట్టి చదువనేలేదె సంస్కృత?"
మని తృణీకరించె నతని నొకఁడు

అపుడు కన్ను దెఱచె నతఁడు వంశస్మృతి
చేసిచేసి కనియె దోసమెల్ల
నిర్వికల్పనిష్ఠ నేర్చె గీర్వాణంబు
నుపచరించి గురులకృపను గాంచి

శ్రుతుల నాలించె నుపనిషత్సుధను గ్రోలె
బ్రహ్మసూత్రార్థ మెడఁదలోఁ బదిలపఱిచె
దిట్టయై భగవద్గీత గుట్టెఱింగెఁ
దెలివి పొంగి యాతఁడె రామతీర్థుఁ డయ్యె

అతఁ డాత్మానాత్మజ్ఞత
నతివేలప్రౌఢి వడసె నక్షరతత్త్వ
ప్రతిపాదకుఁడై సకల
క్షితికిన్ వెలుఁగిచ్చె బుధులు జేజే యనఁగన్

ఇంతి యొకతె, కొడుకు లిద్ద, ఱొక్కకొమార్త
యింతచిన్నలంబి నిముడఁ జాల
విడిచి వైతు దీని విశ్వకుటుంబముం
బడతు ననియెఁ బ్రేమ పండి యతఁడు

హిందువులు ముస్లిములు సిక్కు లేసుభక్తు
లంద ఱాత్మస్వరూపులే యంద ఱస్మ
దనుజులే, జగమెల్ల మదాలయంబె,
యనిన యద్వైతియై ముక్తుఁడయ్యె నతఁడు

తనవంశస్మృతిచే నతఁ
డనవద్యచరిత్రుఁ డయ్యె నందఱు నరు లీ
పనికిం బూనినఁ జీఁకటి
విరియుఁగదా జగమునుండి విటతాటముగన్

ప్రతిపురుషుని వంగడమున
యతీంద్రుఁడో, భక్తుఁడో, మహాయోగియొ, మా
నితకవితానిధియో, పం
డితుఁడో, కనిపించు నరయ నేర్చినవేళన్

తనతాతలు, ముత్తాతలు
ఘను లని పైకొనక, వారిగౌరవ మందన్
బెనఁగవలె నరుఁడు నిచ్చలు
మనసంస్కృతి నిల్చు నిట్టిమానిసికతనన్ (25-9-1964 - సమదర్శి)

## ❋ మహాత్మ కథ ❋

(తుమ్మలవారి "గాంధికవితల" నుండి క్లుప్తముగా కూర్చినది)

ఆకాలమ్మున గౌతముఁ,
డీకాలమునందు గాంధి, యిద్దఱు హింసా
వ్యాకులజగతికి శాంతి
శ్రీకరులు, దయావిధేయ జీవననిరతుల్

ఎవని పుట్టువు మహాకవిగేయవిఖ్యాతి
సంధించె హైందవసంఘమునకు
నెవని రూపంబులో రవణించె నద్వైతీ
యంబు సనాతనం బార్షతేజ

మెవని సేవా త్యాగసవనంబు భారత
    మాతృదాస్యముఁ దూల్చు మంత్రమయ్యె
నెవని ధర్మంబు సర్వవసుంధరాప్రజా
    సంతానమునకు మేల్బంతియయ్యె

విశ్వమానవకల్యాణ విధివిధాత
యీతఁడే యంచు జయపెట్టె నెవని జగతి
యట్టి గుణకంధి గాంధిమహాత్మచరిత
నాతలంపున మెఱసెఁ బుణ్యంబు విరిసె

పరిశుష్కదేహుఁడై బడలినవాఁడయ్యు
    నందఱికంటెఁ దా ముందు నడిచె
ఊఁతగా నొకకఱ్ఱ నూనినవాఁడయ్యు
    నఖిలజగత్తున కండయయ్యె
అపరిగ్రహవ్రతం బానినవాఁడయ్యు
    నిత్యపూర్ణస్థితి నెగడనేర్చె
అస్త్రశస్త్రమ్ముల కవ్వలివాఁడయ్యుఁ
    కవ్వించు వైరివర్గమును గెలిచె

నెతఁ డతండు పుట్టె నీ పుణ్యభూమి ను
ద్వేలమైన యార్షతేజ మలర
మర్త్యుఁడయ్యు, నతఁ డమర్త్యుఁడు, భవియయ్యు
నభవుఁడతఁ; డహెూ! మహాత్ముఁ డతఁడు.

ఏ సూరినో, పేరినో, సుబ్బినో నిల్పి
    పచ్చి సింగారంబు పల్కు కంటె;
హేతువాదమ్మున కింత నిల్వఁగలేక;
    బూతులబుంగలై, జాతివైర
ములకు, మతద్వేషముల కుపాధ్యాయులై,
    యౌదార్యమునకు దవ్వగుచు, నీతి
రతుల కెంతయు రోఁత రాఁజేయునట్టి పు
    రాణమ్ములన్ బూని వ్రాయు కంటెఁ;

కాసులకు దాసుఁడగుచు ముక్కడిని బొగడి
కల్లకైతల నల్లుటకంటె; నిట్టి
గుణగరిష్ఠుల, దేశభక్తుల చరిత్ర
చెప్పుట జగద్ధితంబైన చేఁత గాదె

(ఈ పద్యము సమకాలికకవుల ధోరణిని తెలియజేయుచు, కవిగారి కవితాశయమును తేటతెల్లము చేయుచున్నది).

ఎవఁడు నుడువనేర్చు నవభారతస్రష్ట
జాతిపిత సమగ్రచరిత మరసి
కట్టెఁ గొట్టెఁ దెచ్చెఁ గాకుత్థ్సుఁ డన్నట్లు
పలుకనోర్తు నెఱుకపడిన దనుక

పలికెడిది గాంధికథయఁట
పలికించెడివారు తెనుఁగుఁ బ్రజలఁట; దీనిం
బలికిన నూఱట యౌనఁట
పలికెద నిఁక నొండుమఱచి బాపుచరిత్రన్

భారతోర్వి యెంత భ్రష్టమైనను దాని
యాత్మ రూపుమాయ దనుట నిక్క
మప్పుడపుడు దీని కభ్యున్నతిం గూర్ప
వచ్చుచుంద్రు గాంధివంటి ఋషులు

మగువ నంటక మద్యమాంసంబు లొల్లక
    పొగడికల్ గనె భోగభూమియందు
చేసినదోషముల్ మూసిపెట్టక చాటి
    మప్పెఁ బాఠమ్ము సమాజమునకు
జగమిచ్చినట్టి లక్షలకొలందిధనమ్ము
    వెచ్చ పెట్టెను బ్రజావితతికొఱకు
గుడులలో లేఁడయా, గుహలలో లేఁడని
    చూపించె నీశ్వరు సూనృతమున

లోకమెల్ల నెదుర్కొనుగాక నిలిచి
గెలిచె, నసిలేని కసిలేని కలను దీర్చి
బాపుజీ యెట్లుపడసె నీప్రాభవమ్ము
కన్నవారల నడవడి కతన గాక

నిత్య సత్యాశ్రయుండు, గణేయవినయ
కలితుఁ, డౌదార్యమూర్తి, నిష్కంపధైర్య
రతుఁడు, లంచం బెఱుంగని ప్రగడ, కీర్తి
రాశి, నాతండ్రి యనె సబర్మతిమహర్షి!          (కరంచందుగాంధి)

గృహగతదైవతార్చన ముగింపక ముట్టదు భోజనంబు, న
న్వహమును సంజ, ప్రొద్దు గుడి కాదట నేగి ముకుందుఁగొల్చు, దు
స్సహముల నౌపవస్తముల సైఁచును వేమఱు మత్సవిత్రి, త
న్మహిమ మపార మంచు మతిమన్మణి గాంధి కరంగు నెంతయున్
(పుత్తలీబాయి)

తుమ్మలవారు గాంధి జీవితచరిత్రను ''ఆత్మకథ'' ''మహాత్మకథ'' అను రెండు మహావీర కావ్యములుగా వ్రాసినారు. ''ఆత్మకథ''లో కవిగారికి స్వేచ్ఛలేదు; ''మహాత్మకథ''లో కొంతస్వేచ్ఛ లభించినది. గాంధిమహాత్ముని స్వీయచరిత్రము లోకారాధ్యమైనది. సర్వజనాదరణీయమును, సేవ్యమును. ఆత్మకథలోని గాథ ఉత్తమ పురుషలో కలదు. గాంధి తొలిజీవితమున జరిగిన కొన్ని సంఘటనలు అతని భావిఔన్నత్యమునకు మూలములయ్యెను.

గాంధి పాఠశాలాజీవితమున ''సత్యహరిశ్చంద్ర'' నాటకమును చూసెను. ఈ గాథ అతని చిత్తమున చెఱగని ముద్రవేసెను. అపుడు-

ఆ యనఘునిగతి సత్యముఁ
బాయక, తద్ధర్మమూర్తి భంగి విపత్తుల్
మాయించు టొప్పను నభి
ప్రాయము న న్నావరించె బంధుర మగుచున్ -

గాంధి వివాహజీవితము చాల తమాషాగా ప్రారంభమైనది. ఆ తొలినాటి ప్రణయఘట్టమును కవిగారు అతిసహజముగ, చిత్తమునందు నాటుకొనురీతిగ అతిరమణీయముగ వర్ణించినారు.

ఆ తొలిరేయి నోహెూ! తూర్పుపడమరల్
గుర్తింపనేరని కుఱ్ఱజంట
మొనసి సంసారసముద్రగర్భమ్మునం
దు నమాంతముగ నొక్కదూఁకు దూఁకె
నారేయి కర్తవ్యమంతయు నాకు మా
వదినె బోధించెఁ, బావనగుణాఢ్య
నాకొమ్మ కెవ్వరా పోకడ ల్మప్పిరో
యిసుమంతయేని నా కెఱుకపడద

యెఱుఁగ వేఁడనైతి నెన్నఁడు, ముందైనఁ
గోరవలయునన్న కోర్కి లేదు
మాకు సిగ్గు నిరుపమాన, మన్యోన్యము
భావలోకసిద్ధి యబ్బ దెపుడు -

భార్యానురాగం బపారమై నెలకొంట
బడినైన నా కదే గొడవరేఁగి
దినకరుం డపరాంబుధిని బ్రుంగు టెప్పుడో
కాసంత చీఁకటి క్రమ్ము టెపుడొ
యడరి లేజవరాలికడ వ్రాలు టెప్పుడో
మించుఁబోఁడిని గుస్తరించు టెపుడొ
చెలువచిన్నారి చూపులఁ గాంచు టెప్పుడో
జిలిబిలి సరసముల్ చిమ్ము టెపుడొ

యని నలంగితి, దుర్భర మావియోగ
మవసరంబున్న లేకున్న నవియు నివియుఁ
గల్లవొల్లులు వల్కి వాల్గంటి కేను
ఱెప్ప వడనీయ నద్దమరేయి వఱకు -

గాంధి "శీలమ్మన యందన్యుఁడు వ్రేలు మడఁచి చూప నెట్టివీలును గలుగంజాలని లీల" నడచుకొనెను. అయితే అతని మిత్రుని కల్లబొల్లిమాటలు నమ్మి కల్లు త్రాగెను; మాంసమును తినెను. అంతేగాదు-

అతఁడొకనాఁడు, నన్ను వెలయాలి గృహమ్మును జేర్చి, యెల్లప
ద్ధతులను మప్పి, లోపలికిఁ దాఁ బనిచెన్, దురితోగ్రదేవతా
శితతర దంష్ట్రికల్ నడుమఁ జిక్కితిఁగాని, మదీయ దుష్కృతి
ప్రతిఘటనం బొనర్చి, భగవానుఁడు నన్మనిపెన్ గృపామతిన్

ఆ పాపకందర మందేమి సెప్పుదుఁ
గన్నులఁ జీఁకటుల్ క్రమ్ము కొనియె
మందునకే నొక్కమాట వెల్వడదయ్యెఁ
జెమరుచే నొడలెల్లఁ జెమ్మగిల్లెఁ
గంపమ్ము హెచ్చె, నగ్గలమయ్యె గగ్గోలు
సెజ్జపై బోగపుం జెలువ కెలన
నధివసించితిఁగాని యంకిళ్ళు బిగువయ్యె
నాకొమ్మ తడ కోర్వలేక తిట్టి

నెట్టి, వాకిలి సూపె, నప్పట్టునందు
వచ్చె నాపుంస్త్వమున కయో మచ్చయనుచు
సిగ్గుపడి తల్లి! వసుమతీ! శీఘ్రముగను
దారి నొసఁగుము నా కంచుఁ దల్లడిలితి

దైవవశతఁజేసి యావంతలోపలఁ
దొలఁగెఁగాని వాని చెలిమి నన్ను
ద్రోసియుండు నకట దుర్వ్యభిచార కూ
పంబు నందుఁ పాపభవనమందు

తదుపరి గాంధి లండను వెళ్ళి, చక్కగా చదివి, బారిష్టరు పట్టమును సాధించెను. అటుపిమ్మట బొంబాయి నగరమునందు న్యాయవాదవృత్తిని ప్రారంభించెను. అతడు ఏర్పరచుకొన్న నియమముల వలన ఆవృత్తిలో రాణించలేకపోయెను. ఆ సమయమున అబ్దుల్లా అను భారతీయవ్యాపారి దక్షిణాఫ్రికాయందు తన న్యాయస్థానసమస్యలకు తనన్యాయవాదులకు సహకారిగా నుండుటకు గాంధిని అచటకు రమ్మని కోరెను. వెంటనే అంగీకరించి, గాంధి ఆఫ్రికాకు పయనమయ్యెను.

ఆఫ్రికాప్రయాణము గాంధి జీవితమునందు ఒకపెద్దమలుపు. అచటి అనుభవములె తదుపరి భారతదేశ స్వాతంత్ర్య సాధనకు మార్గదర్శకములైనవి. నౌకా ప్రయాణము చేసి గాంధి నేటాలు నగరమును చేరెను. అచటినుండి ప్రిటోరియా పట్టణమునకు రైలులో బయలుదేరెను. ఈ రైలుప్రయాణమునందు జరిగిన అవమానము అతని నౌకఉద్యమ నిర్మాతగా రూపొందించెను. ఆఘట్టమును చదవండి-

పొదలు హర్షమ్ముమైఁ బొగబండి నెక్కి -వెడలి నేటాలు పెస్వీడు మారిట్జు
బర్గుఁజేరితి రాత్రి పదిగంటలకును-బఢికుఁడొక్కండు నా పయనించుమొదటి
తరపుఁబెట్టియఁ జేరి, తన్ను వీక్షించి-భారతీయుఁడ నౌట భరియింప లేక
చిటచిటలాడి చెచ్చెర లేచిపోయి-తెచ్చినయధికారి తిలకించి నన్ను
నిలువరా దిచ్చోట నీవు, పిఱింది-పెట్టెకుం జనుమని బింకానఁ బలుకఁ
తాళుమా యిందుండఁ దగినట్టి చీటి-విలిచితి నంచు, నే వినిచితి, న్గాని
దిగక తప్ప దటంచుఁ దీంఢ్రించె వాఁడు-పెట్టె వీడ నటంచు బిగిసితిన్నేను
భటుని బిల్చెద నంచుఁ బదరె నుద్యోగి-యతఁడు నెట్టినఁబోదు నన్నాఁడ నేను.

అంతలోఁ దలారి యరుదెంచి నన్నుఁదా-వెలికి నీడ్చి వైచి వెడలిపోయె
వెనుక కేగనంచు నిక్కెడు నావంకఁ-జూచి చూచి బండి సురిఁగిపోయె
మాత్రసంచితోడ మాత్రమ నే బాట-సారు లాఁగు సజ్జఁ జేరినాఁడ
సెజ్జ, పెట్టె, గొడుగు చిమ్మినచోటన-కలవు, కోలుకాని కాపు వడసి
చలిచట్ట మందసమ్మునఁ-గల దయ్యది సీతు పొంగుకాలం, బిఁక నా
నిలిచిన తా వధ్రులతో-మలసిన పెనుమిట్ట, సమయమా నిసిగడియల్
ఏ పని కొగ్గుదు నిత్తఱి-నా పరువు న్నిల్పుకొనఁ బెనంగుదునా? యీ

ద్వీపమ్ముఁ దలఁగి భరత - క్ష్మాపయనము వేగవేగఁ జాగించెదనా?
ఈ పరాభవం బదెల్లను నాకుఁ గా-దని తలంచి వచ్చినట్టి కర్జ
మనువు పఱిచి సెట్టినలరించి యవ్వలఁ-జూతునా మదీయ మాతృభూమి
అరుగుదెంచిన చెయిదమ్ము నట్టె విడిచి-క్రమ్మఱిల్లుట భీరులక్షణము గాదె?
యిపుడు కుడిచిన యవమతి యెంత? దీని - కోహటిల్లిన నవ్వి పోదో
జగమ్ము?

తెల్ల, నల్ల వన్నె తెవు లిది, మగతనం
బున్న దీనిఁ జంప నుద్యమింతు
సంతసమ్ముతోడ సైరింతు నిందెన్ని
బెట్టిదమ్ము లెసఁగి చుట్టుకొన్న - అని గాంధి శపథము చేసెను

తదుపరి గాంధి నేటాలునందు భారతీయులకు ఒక విద్యాలయమును, గ్రంథాలయమును నెలకొల్పెను. ఆనాడు ఆఫ్రికాలో భారతీయులపైగల అవమానకరమైన ఆంక్షలను, పన్నులను తొలగించవలెనని గాంధి అహింసాయుతముగా ఆందోళనసాగించెను. చివరకు ప్రభుత్వము వాటిని రద్దు చేసెను. ఈ విజయముతో భారతీయులకు నూతనజవము కలిగెను.

ఆ సమయమున గాంధి బ్రహ్మచర్యదీక్షను పూనెను. అన్ని ధర్మములలో నిదియుత్తమ ధర్మమని అతడు భావించెను. అప్పటికి గాంధికి నలుగురు కుమారులు కలరు.

బ్రహ్మచర్యంబు నిర్దుష్టభంగి నెతఁడు
నడుపు నతఁ డాత్మసందర్శనం బొనర్చుఁ
తనువునకు, బుద్ధి, కాత్మకున్ ద్రఢిమ మొసఁగి
నిత్యమును గాచు నింద్రియ నిగ్రహంబు

వేయేల దీని మహిమమ
నా యుద్యమకోటి నెల్ల నడుపుఁ దదీయ
శ్రీ యొఱపు నన్ను ముగ్ధునిఁ
జేయుచు నానాఁడు పెంపుచెందుచు నుండున్ -

ఆనాడు బోయరుయుద్ధము ప్రారంభమయ్యెను. అపుడు గాంధి సేవాదళమును ఏర్పాటు చేసి, గాయపడిన వారికి సేవచేసెను. ఈ సేవల వలన గాంధికి మంచి కీర్తి లభించెను; భారతీయులకు గౌరవము లభించెను.

ఆ సమయమున జాన్ రస్కిన్ వ్రాసిన ‘‘Unto the Last’’ అను చిన్నగ్రంథము గాంధిని చాల ప్రభావితము చేసెను. అందరి సుఖములో తన సుఖము కలదనియు, మితవెచ్చము మంచిదనియు, నిరాడంబరజీవితము ఉ

త్తమమనియు, అన్ని వృత్తులు గౌరవ ప్రదములైనవే ననియు రస్కిన్ వ్రాసెను. ఈ సూత్రములను తన జీవితసూత్రములుగా గాంధి చేసికొనెను. ఈ సూత్రములే గాంధీ సర్వోదయమునకు పునాదులయ్యెను.

కొంతకాలము తర్వాత గాంధి స్వదేశమునకు తిరిగి వచ్చెను. అతని రాజకీయ గురువైన గోపాలకృష్ణగోఖలేను పూనాలో కలిసెను. గోఖలే సూచన మేరకు గాంధి దేశమంతయు పర్యటించి ఆంగ్లప్రభుత్వనిరంకుశపాలనలో ప్రజల స్థితిగతులను తెలిసికొనెను. తదుపరి అహ్మదాబాద్‌లో గాంధి "సత్యాగ్రహ ఆశ్రమమును" నెలకొల్పెను. అటుపిమ్మట చంపరాన్, ఖేడా రైతుల సమస్యలను, అహ్మదాబాద్ కార్మికుల సమస్యలను అహింసా మార్గమున గాంధి పరిష్కరించెను. ఈ విజయములతో సత్యాగ్రహము ధర్మమార్గమని గాంధి గట్టిగా విశ్వసించెను.

ఇక "మహాత్మకథ" మాధుర్యమును చవిచూతము. 1920లో గాంధి భారతజాతీయ కాంగ్రెసునకు సారథి అయ్యెను. ఆనాటినుండి మరణించేవరకు (1948) గాంధి జీవితము ఈ గ్రంథమునందు వర్ణించబడినది. చదవండి. ఆస్వాదించండి.

భగవదవతారమన గాంధి భారతమున
బుట్టి, తనజాతి నాడిని బట్టుకొనియె
*నడిదములులేని బవరంబు నడిపి సకల *(ఆయుధములు లేని)
ధరణి కబ్రమ్ము గూర్చె సోదర్యులార!

బ్రదుకునం దహింస పాటించి గెల్చిన
ఘనులు కొంద ఱవనిఁ గలరు; గాని
గాంధి తక్క నెవఁడు కలఁ డహింసను రాజ
నీతితో బిగించి నెగ్గి నతఁడు?

యావద్దేశము పర్యటించి మన మీ యన్యాయ్యపు న్దయ్యమున్
ద్రోవంజెల్లును, జీమునెత్రుగల హిందూ, ముస్లిముల్, క్రైస్తవుల్
భావైక్యమ్ము గడించి, దీక్షితులరై, బంధచ్యుతిన్ గండు, నా
త్రోవన్ రండని విన్నవించెను మహాత్ముం డత్తఱిన్ దప్తుఁడై

ఈ పరతంత్ర జీవనము నెట్లుభరింతురు, విశ్వమెల్ల ను
ద్దీపితమై స్వతంత్రత కతీవకృషిం దలఁదాల్చి మాన రే
ఖా పరిపుష్టమయ్యెఁ, ద్రిజగంబుల గెల్చినవారిబిడ్డ లీ
యాపద నుందురా? సమయమైనది లెండిఁక భారతప్రజల్!

మాతృదేశం బన్యమనుజేశ్వరుని చేతఁ
జిక్కి, స్వాతంత్ర్యంబు దక్కి, తనదు

జాతీయతను బాసి, చేతోగతంబైన
తలఁపు వెలువరింపఁ దగిన హక్కు
నెడసి, లోలోపలనే క్రుళ్ళి కుములచు,
నీచదాస్యమునమునింగి, పిఱికి
తనము వరించి, నితాంతకష్టపరంప
రల నీఁగి, దారిద్ర్యమలమ, దిక్కు

లేక శోకించువేళఁ, తల్లిమొఱ నాల
కించి, మై పులకింపఁ చలించి, కొంచె
మేని నామెకుఁ తోడ్పడలేనిబిడ్డ
బ్రతు కదేటికి ధాత్రికి బరువుచేటు

(ఈ పద్యమున ఒకే ఒకదీర్ఘవాక్యము కలదు. ఇది దీర్ఘమైన, దుర్భరమైన దేశదాస్యస్థితిని సూచించుచున్నది).

ఉత్తమవాగ్మినా నొప్పారె నురక గ
ర్జించియా? కాదు వర్జించి నుడులు
అతిలోకబలసమంచితుఁడయ్యెఁ గండలు
పెంచియా? కా దలయించి యొడలు
చిరజయశ్రీ ధురంధరుఁడయ్యె రిపుల ఖం
డించియా? కాదు పండించి కృపలు
అమృతత్వమందె యాగము లాచరించియా?
కాదు నిష్కామయోగము వరించి

యతఁడు సామాన్యుఁడెట్లు? వీరత కపూర్వ
జీవములువోసి వాసిదెచ్చిన మహాత్ముఁ
డతని నడచిన బాటలయందు నడిచి
పందయును విక్రమక్రమాస్పందుఁడయ్యె

సత్యాగ్రహంబ మన కిపు
డత్యాదరణీయ మనియె, *నాసేతు తుషా
రాత్యర్థ నగము జనతా
నుత్యంచితుఁడయ్యె నిత్యనూత్నపథానన్

రాఁగలదోయి! ధర్మసమరం; బిది భారతజాతిముక్తికై
సాగినదోయి! దాస్యమునఁ జచ్చియుఁ జావనివార లందఱున్
ద్యాగము, శాంతి, సత్యమును దప్పని యస్త్రములై జగజ్జయ
శ్రీ గురియింప సంగరముసేయుఁడు, త్రోయుఁడు మాతృదు:ఖమున్

అన్నువులేదు, కుట్రలకు నక్కఱలేదు, కటారు లీఁటెలున్
బన్నుట లేదు, శాత్రవులప్రాణముఁ దీయుటలేదు, నెత్తురున్
జున్నువిధానఁ బట్టి తెగజుఱ్ఱుటలేదు, జగచ్చరిత్రలోఁ
గన్నదిగాని విన్నదియుఁగాని రణం బిది విక్రమింపుఁడీ!

వచ్చెఁ బరీక్షాసమయము
విచ్చేయుఁడు రంగమునకు; విశ్వము సకలం
బచ్చెరుపడ, నధికారులు
ఱిచ్చపడన్ మీ రథ:కరింపుఁడు ప్రభుతన్

ఈ సమరంబునందు మన మెల్లపనిన్ గనుగల్గిసేఁత క
భ్యాస పడందగున్, ప్రభువు లాగ్రహముం బొడమించుకార్యముల్
చేసినఁ జేయవచ్చు, మన చిత్తము లత్తఱి నిగ్రహంబు వోఁ
ద్రోసిన ముప్పువచ్చు, నకుతోభయతన్ బయనింపుఁ డెల్లరున్

ఇది కృత్యంబని బాపూ
యెదిసెప్పిన దాని కొగ్గె నిమ్మహి, నిందా
స్పదమైన తనదు బానిస
మదృశ్య మగువేళ తఱిసె నని అంపిలుచున్

నగరసీమలఁ బెత్తనముసేయు కాంగ్రెస్సు
 పల్లెపల్లెకు బహి:ప్రాణమయ్యె
నెఱ్ఱటోపీఁ జూచి యి ట్టింకునెడఁదలో
 వెల్లియై ప్రవహించె వీరరసము
పొగలతో సెగలతోఁ బోరాడుతెగలలో
 నన్యోన్యసౌహార్ద మవతరించె
నెండకన్నెఱుఁగని యింతి ధిక్కృతిపల్కె
 రవి యస్తమింపనిరాజ్యమునకుఁ

గత్తికంటెను గవచమ్ముకంటె సత్య
దీక్షయు, నహింసయును మేటిరక్షలయ్యె
బాపుజీకనుసన్నలో భారతమ్ము
నడచి పడసిన యీ బల్మి చెడనికల్మి

విన్నపముల్ విధేయతలు విజ్జఁగ నేల్బడివారి భిక్షపైఁ
గన్నిడి, తన్నిరాకృతులఁ గందుచుఁ గుందుచునున్న కాంగ్రెసే
తన్నిమిషంబుఁ దొట్టి నవతారుచిరంబుగ విప్లవోర్మి సం
పన్నముగా నెసంగెఁ దనపాలితపంబులు పండఁ బాఱుటన్

తెఁగబడె భారతోర్వి, యిఁక దీని నెదుర్కొని యేలుబెట్టు, లీ
జగమనఁ జిన్నదా కడువిశాలము, నల్వదికోట్ల మానవుల్
నెగడుదు రిందు, వీరిపుడె నిద్రను వీడిరి, వీరి బీరమున్
బ్రగతియు సైఁపరాని వని వందురి రాంగ్లమహీమహారథుల్

ఎండ కన్నెఱుఁగని లేమ యిల్లు వీడి
వీరతా ధీరతా రుచిస్ఫార యగుచుఁ
తెల్లదొరశాసనమ్మును ధిక్కరించె
గాంధిపల్కులు వేదవాక్యములు కాఁగ

ఒక విలయాగ్ని రేఁపఁగల యోద్ధ మహాత్ముఁడు, వీని పల్కు, పా
డికిఁ బ్రజ లాఁకసెప్పరు, కడిందుల కోడరు, గాంధి యైంద్రజా
లికుఁ డెపు డేమిసెప్పి కదలించునొ యీ జనతాపయోధి, నే
ది కలుగనున్నదో యని మదిందలపోసిరి హస్తినాపురిన్.

కాఱుచిచ్చువోలెఁ గదలె ధిక్కార సం
గరము నగరములకు గ్రామములకు
మొదట రిత్తచేఁత యిదియని నవ్విన
పాలకులకు ఱిచ్చపాటు వొడమె

ఱిచ్చవడెన్ బ్రభుత్వ మిటురేఁగిన భారతజాతిఁ జూచి, కా
ర్చిచ్చు విధాన మండిపడి చిందులు ద్రొక్కుట కంగవించె, నీ
రచ్చల మీఁద, శాంతజనరాసులమీఁదఁ బిసాళిహేతువుల్
దెచ్చి తుపాకిగుండ్లు వదలెన్ బలుతావుల హస్తినాదులన్

రాచవారుచూపు రాక్షసత్వమున కా
నాఁడు బెగడువడిన వాఁడెవండు?
తెల్లదొరతనమ్ము త్రెళ్ళినఁజాలు, నా
బ్రదిమి కేమి యనియెఁ బ్రతినరుండు

అణఁచిన కొలంది భారత మపుడు బంతి
కరణి మీఁదికి లేచె; నాంగ్లప్రభుత్వ
మాస చావమిచేఁ దెగునంత దనుక
లాఁగఁ దొడఁగె వివేకంబు, లజ్జ, విడిచి

**వచనము:** గాంధి నాయకత్వమున భారతీయులు జాతీయ పోరాటమును సమధికోత్సాహముతో సాగించిరి. మొదట సహాయనిరాకరణోద్యమ (1920) విజయముతో ఆంగ్లేయులు త్రుళ్ళిపడినారు; తదుపరి శాసనోల్లంఘనోద్యమ

ఘనవిజయముతో (ఉప్పుసత్యాగ్రహము-1930) వారు కలవరము చెందినారు; తుదకు క్విట్ ఇండియా ఉద్యమ (1942) అపూర్వవిజయముతో వారి ధైర్యమణఁగి, భారతదేశమునకు స్వాతంత్ర్యము నిచ్చినారు.

ప్రొద్దుగ్రుంకని పుడమికి నుద్దిలేని
ఱేఁడుగానున్నయెదిరి, నిర్వీర్యుఁ డాయె;
సత్యమునకు నహింసకు జయము వచ్చె (15-8-1947)
గాంధి నవభారత స్రష్టగా వెలింగె

రమ్ము రమ్ము స్వతంత్రభారతము నేల
రమ్ము బాపుజీ! యని మహారథులు వేఁడ
వలదు వలదని దు:ఖితావన చికీర్ష
నౌఖలికిఁ జన్న గాంధికే నరుఁడు జోడు

రాజదండము వలదు, స్వర్గంబు వలదు
జననమరణార్తు లంటని జగము వలదు
తెఱపిలేనిదిగుళ్ళతో దేవురించు
జనులఁదేర్చుట వలయు నాకనియె నతఁడు

**మహాత్ముని చరమదినము :- (30-1-1948)**

**వచనము** : ఈ సందర్భమున తుమ్మలవారు రసస్ఫూర్తిని కలిగించుటకు ఒకే విధముగా నంతమగు పద్యములను వ్రాసిరి. ఇట్టి రచనవలన పాఠకులను ముందునకు వెళ్ళనీయక నిలబెట్టి, మహాత్ముని గుణములను మరల గుర్తునకు దెచ్చి సహృదయుల మనస్సులను దు:ఖపూరితముగా జేయును.

వచ్చె దుర్దినమ్ము వసుధ కహింసా మ
హత్త్వ మెఱుక చేసి యాంగ్లజాతి
బింక మణఁచి తల్లిసంకెలల్ త్రెంచిన
బిరుదుబ్రదుకునందుఁ జరమదినము

వచ్చె దుర్దినమ్ము వాడివాడి వగర్చు
జాతి కాత్మశక్తి సంతరించి
విశ్వగణ్యమైన విజయమ్ము గూర్చిన
బిరుదు బ్రదుకు నందుఁ జరమదినము

వచ్చె దుర్దినమ్ము వగపులో బెదరక
సుఖము నాసచేయ కఖిల వికృతి

దూరుఁడై ప్రసన్నతారూఢమతియైన
బిరుదు బ్రదుకు నందుఁ జరమదినము

**వచనము :** ఆరోజు ప్రార్థనాసభలో గోడ్సేఅనుయువకుడు బాపున కతిసన్నిహితుఁడై, జోహారువొనరింప వంగిన చాడ్పునవంగి, జేబునందలి పిస్తోలు వెలికి లాగి-

పటపట మ్రుమ్మఱు ప్రేల్వన్
జటుల గతిన్ రెండుగుండ్లు సంయమికుక్షిన్
విటతట మొనర్చి చనె; నొ
క్కటి గుండియలోను సొచ్చి కదలక నిల్చెన్

మూఁగిన పేదర్మి కతనఁ *బ్రాఁగోక మూరెఁడు లేక *(పాతచీర)
వేఁగు దీనులఁ గని, కుంది, కుబుసము వీడి, మహాత్ముఁ
డే గుండె నెండకు, వానకుఁ, జలికి, నిరవుఁ గావించె
నా గుండెపైఁ గాల్చె, నతని తమ్ముండ యగ్నిగోళమ్ము

ఈ గడ్డవారి నెత్తురును, గండల, *నెమ్ములఁ, గుడిచి
*(ఎముకలు)
వీఁగు నాంగ్లేయుల నెద్రిచి, మార్తురు విడిచెడు గుండ్ల
కే గుండె నొడ్డి, బాపూ మహీదాస్య మిల్లిగ్గఁ జేసె
నా గుండెపైఁ గాల్చె, నతని తమ్ముండ యగ్నిగోళమ్ము

ఏ గుండె సూనృతా హింసన తపోర్చు లిన్ని నాళ్ళో ర్చె
నే గుండె దీర్ఘోపవాసభర ముద్వ హించుట నేర్చె
నే గుండె విశ్వహార్దమున నార్ద్రత నెనసి జాల్వాఱె
నా గుండెపైఁ గాల్చె నతని తమ్ముండ యగ్నిగోళమ్ము

పలికినట్టి పల్కు, బ్రదికిన బ్రదుకును
గట్టకడకు సార్థకమ్ముగాఁగ
రామ! రామ! యనుచు రక్తంపు మడువునఁ
గూలె గాంధి, మోడ్పుఁగేలుతోడ

మానము, విత్తమున్, భరతమాతృసపర్యకు ధారవోసి, లో
కానకు సేవచేయు నవకాశము కాంచితి నింతదాఁక; నా
ప్రాణము నిచ్చి, రక్తమును బాయలుపాయ లొనర్చి, భారత
క్షోణికి సేవచేసితిని జూ! యిపుడంచు మహాత్ముఁ డుబ్బెడిన్

ఆనాడు తుమ్మలవారు మహాత్ముని మృతిపై దు:ఖావేశముతో మహోర్మింబోని కన్నీటితో వ్రాసిన స్మృతికవిత ''అమరజ్యోతి'' లోని కొన్ని

పద్యములు చదవండి -

చచ్చిరి దేశభక్తులు *విశాంపతు లిద్ధకవుల్ ప్రవక్తలుం *రాజులు
జచ్చిరిగాని; ము న్నెవని చావునకుం బ్రజలిట్లు క్రుంగి; రే
సచ్చరితుండు పోవునెడ సర్వజగంబు లిటుల్ వెలార్చె న
త్యుచ్చతరాదరంబు, హృదయోద్గతభక్తియు, సానుభూతియున్

నిను రామాదులఁ జేర్చి మెత్తు, రది మన్నింపన్, రిపుగ్రీవముల్
రణరంగమ్మునఁ గోసి, రక్తఝురిలో రామాదు లోలాడి, రా
పనికిన్ నీకును లేదు పొత్తు, రిపుతన్ బాధించి, విద్వేషిపై
నెనరుం జిమ్మెదవు, చిక్కదు ప్రభూ! నీయోగ మెవ్వానికిన్

స్వమతవిధుల్ ప్రశస్తములు, సత్యములంచు భజింతు; వన్య ధ
ర్మముల సమాదరింతు; వపరాజితసూత్రములన్ గణింతు; వీ
సమరసదృష్టి ప్రాక్తనులు శంకరముఖ్యుల కింత యున్నచో
సమరములెన్ని క్రిందువడి శాంతి యదెంత ఫలించియుండునో!

కులవర్గములఁ గ్రుళ్ళి కుమిలిన నీమతం
　　బుద్ధరింపఁగఁ జక్కదిద్దు కతన
మాలకై మందారమాల కైసేసి నీ
　　దేవాలయము తల్పు దెఱచు కతన
పొగలతో సెగలతోఁ బొగులు హిందూముస్లి
　　ముల కౌఁగిలింతలు వలచు కతన
పేదసాదులనెత్రు పీల్చి గఱ్ఱునఁ ద్రేఁచు
　　సాహుల నదలింప సాగు కతన

ప్రజ నెదిర్చిన నాఁడు మీబ్రదుకు లేదు
లేదనుచుఁ గింప్రభుల మందలించు కతన
కాల్చితఁటరా! - జగత్త్రయీ కర్మయోగి
లోకమూర్ధాభిషిక్తు - గోడ్సే కిరాత!

మతము పే ర్వెట్టి కపటధర్మములు పల్కి
మోస మెఱుఁగని సాదుల ముంచి ముంచి
బొజ్జ పెంచెడు వారికి బుద్ధిసెప్ప
కాల మేతెంచె నని యెఱుంగవె జడాత్మ!

పుట్టుకతో నాధిక్యము
పెట్టెన్, సోమరికిఁ బెద్దపీఁటను వైచెన్

ముట్టుకొనరానిమానవుఁ
గట్టా! నీ మెచ్చు మతమ కద సృజియించెన్

ఋుక్కు లొకనికి, నొకనికిఁ జెక్కభజన
ప్రభుత యొకనికి, నొకనికి బానిసమ్ము
గ్రామ మొకనికి, నొకనికిఁ గసటు గూడె
మేమి సౌభ్రాత్ర, మేమి హిందూమతంబు

నశ్వరమైనకాయము వినాయకథూర్తుఁడు కూల్చెఁగాని, నీ
శాశ్వతమైన యాత్మనెటు చంపఁగలం డతఁ; డస్త్రశస్త్ర తీ
వ్ర శ్వసనాగ్ను లేకమయి వచ్చునపో! యది లెక్కసేయ; దీ
విశ్వము దానిచల్వ శుభవృద్ధము సత్యము సుందరంబగున్

క్రుళ్ళిన యెముకకై కుక్క గుంపులవోలె
నధికారమునకుఁ గారాడువారి
లంచాలగడ్డి కాసంచి సేవాధర్మ
నియమముల్ బలిసేయ నేర్చువారి
కుహనావణిజ్యోపగూహ నోద్రిక్తులై
సుధవోలెఁ బ్రజనెత్రుజుఱ్ఱువారి
పరమతద్వేషాగ్ని మరగి నారీ, వృద్ధ,
శిశు మండలిని జీల్చి చెండువారి

దేశహిత కృత్యముల పేరఁదెచ్చునర్థ
మాత్మబంధువులకుఁ బంచునట్టివారి
బ్రతుకుఁ గనలేక కన్నుమూసితివిగాని
కలఁడె నీగుండెపైఁ బ్రేల్వఁగల మగండు

(మహాత్ముడు పిస్తోలుగుండ్లకు చావలేదట. మహాత్ముడే తన మరణమును కోరుకొనెనట. ఎందుకని? కారణము కానిదానిని కారణముగా భావించి, కవిగారు రమణీయముగా, వ్యంగ్యముగా సమాధానమిచ్చినారు - రచయిత శ్రీ గొల్లపూడి ప్రకాశరావు)

అపవర్గబాంధవం బదికి లౌకికధర్మ
మాలపించితి నందబాలు నట్లు (శ్రీకృష్ణుడు)
కనుదిక్కులేక సోలిన మూఁగజీవాల
మూల్గు మాన్పితి శాక్యముని విధాన (బుద్ధుడు)
సతతక్షమా ప్రేమ శరణమై నరదైత్య
కిల్బిషం బోర్చితి క్రీస్తు వోలె

ఆత్మ నిత్యము; దైవ మది యొండె; యని ప్రతి
    ష్ఠింపఁజాలితి సోక్రటీసు కరణి

బానిసము వ్రేఁగు డించి, కింపాకజాతి
కండగా నిల్వఁబడి తత్ప్రహాము పగిది
నద్భుతంబాయె మనుగడయంద కాక
మృతివిధిన్, వీరి ననుసరించితె మహాత్మ!

చిరదాస్యమున బ్రుంగి పిఱికివాఱినజాతి
    కలవరించితివి సాహసికముద్ర
మోఁకరించి కృపాణములు సలాములు సేయు
    నస్త్ర మెత్తితివి సత్యాగ్రహంబు
పరధర్మలుబ్ధులై పరువులెత్తెడివారిఁ
    ద్రిప్పఁజాలితివి జాతీయవిధికి
అడుగడ్గునకు నడ్డపడిన కోటలఁ గూల్చి
    సవరించితివి సమాజవ్యవస్థ

దిక్కెఱుంగక రేపవల్ దేవురించు
ప్రజకు నేర్పితి వాత్మగౌరవ సమీక్ష
బాపుజీ! స్రష్ట వీవు! నీ చూపు సోఁకి
ద్రష్టలైనారు కొంద ఱీ తరమువారు

వేయిగాదు లక్షవిశ్వకలాపరి
షత్తు లెన్నినాళ్ళు మొత్తుకొన్న
నేర్పలేనితెల్వి నీ వీ జగమ్మున
కిచ్చినాఁడ విరులు విచ్చి వీడ

నీపల్కుగాక యీ నిఖిలభారతమహీ
    చక్రంబు ద్రిప్పు శాసనము గలదె
నీయున్కిగాక పండినపాపముల నెల్ల
    రాపాడు పుణ్యతీర్థమ్ము గలదె
నీకిన్కగాక మానిసిగుండెలోఁ దూఱి
    చెడుగుపాదు పెకల్చు శిక్షకలదె
నీకూర్మిగాక నిర్నిద్రయోగసమాధిఁ
    బడలి సంపాదించు పదవి గలదె

కలదె నీజీవనపథమ్ముగాక లోక
శర్మ సంపత్తి నొదవించు ధర్మశాస్త్ర

మద్వితీయంబు నీతపస్యావిధాన
మెవ్వని మనీష నిల్చు నిన్నెఱిఁగి పల్క

నిన్నుం గొల్చినయట్లు కొల్చి నిను ఖూనీ చేసి రే గోముఖ
చ్ఛన్న వ్యాఘ్రము లే పయోముఖ విషస్థాలుల్ దయాసూనృత
స్కన్కుల్ వారలె నీకు దేవళములం గట్టించు పన్నాగముల్
పన్నం బూనిరి స్వప్రయోజనకరప్రజ్ఞావిధాచుంచువుల్

బుద్ధుని యెంపముక్కల కపూర్వములౌ గుడులిట్లె కట్టి, సం
విద్ధన మెల్లఁ జూపి, రపవిత్రవిధుల్ కథలుం బురాణముల్
వృద్ధి యొనర్చి, రాతఁ డుదయించిన భూములనుండి యెన్నఁడో
బౌద్ధము నెట్టి వైచిరి జపాను సయాముల నాశ్రయింపఁగన్

మనుజుఁడవు గావు నీవు, కోమటివి గావు
బడలిపోయిన భారతీయుఁడవు గావు
కావు గాంధివి - లోకలోకముల వెల్గుఁ
జూపు నిరవధికామరజ్యోతి వోయి!

అఖిలదైవసంపదాస్థానమగు గాంధి
నరుఁడుగా జనించి, పురుడులేని
మహిమ సంతరించె మానవతకు - దివిన్
భువికిఁ దెచ్చె, భువిని దివికిఁ జేర్చె

గుడులకేగలేదు, గుహలకుఁ బోలేదు
ప్రజల నడుమఁ గడపె బ్రదుకు నెల్ల;
ఒడలు దేశసేవ, కెడఁద రామునిసేవ
కప్పగించి ముక్తినందె గాంధి

బాపుగాఁ గర్మయోగంబు రూపుదాల్చె
భక్తి విడరానిచుట్టమై పరఁగె, దాని
కెఱుక చెలియయ్యె, నయ్యోగి నరసి మనుట
ధరణిఁగల సర్వపుణ్యతీర్థములఁగనుట

పతితజగత్సముద్ధరణభారము నౌదలఁదాల్చి, ధాత్రిపై
బ్రతికిన యన్నినాళ్ళు పలుభంగులఁగర్మము లాచరించి, తు
ట్ట తుదకు నిర్మమత్వము కడల్కొన బంధములూడ్చి, భారతీ
యతకు మెఱుంగుపెట్టిన మహాత్మ! భవత్కథ మమ్ముఁదేర్చుతన్!

గాంధియుగమునఁ బుట్టితి; గాంధినడుపు
నుద్యమంబుల నలఁగితి నోపినంత;
గాంధి నీక్షించితిని; గాంధికవిత వ్రాయఁ
గంటి; నీజన్మమునకు నీపంట చాలు

ఇంతటిగాంధి నేఁడు మనకెంతయు దవ్వయిపోయె, వాని సి
ద్ధాంతము విస్మరించితి మయారె! నిరంతరలాభలోభ దు
ర్దాంత జవమ్ము నోర్వఁగల దార్ఢ్యము కోల్పడి, సర్వదా మన
శ్శాంతి విహీనతన్ బ్రదుకసాగితి, మీఁగితి మెల్లతప్పలన్

గాంధితో నడంగెఁ గర్తవ్యనిష్ఠ, మ
హాత్ముతో వివేక మస్తమించె
భారతోర్వి నిపుడు పదవుల కాట్లాట
తక్క నేమికలదు నిక్కమరయ?

మతము కులము ధనము మంత్రంబు తంత్రంబు
తోడుగాఁగ, నీతి బీడుగాఁగ ........
పదవి సిరి నీచభోగముల్ పడయ నరుఁడు
పరుగు లెత్తుచునున్నాఁడు పగలురేయి

మిద్దెవాఁడు నాల్గుమేడలవాఁ డాయె
గుడిసెవాఁడు పోయె గుట్టనీడ
కేల తెల్లవారి నెదిరించి వెతలోర్చి
పడసె నేలుబడిని భారతమ్ము?

సిరిగలవారి కోశములు చిన్నవి పెద్దవియయ్యెఁ; సంపదల్
పెరిఁగినవారి కబ్బినవి పెత్తనముల్; నిఱుపేద కెంతయున్
బరువుగ మాఱె జీవితము, ప్రాణములున్నశవమ్ము కైవడిన్
దిరుగు నతండు నేఁడు నిజదేశనికృష్టదశాపతాకయై

మీవిభూతి (అభ్యుదయము)నపేక్షించి, తావిభూతి (విబూది)
యయ్యె దేశీయులార! మహర్షిగాంధి!
అతని కలలను బండింపఁ బ్రతినపూనుఁ
డింట నింటను శాంతిసౌహిత్య మెసఁగ

నియతిలేని రాజనీతి; వేసటలేని
కలిమి; నడతలేని తెలివి; పాడి
లేని బేర; మీవిలేని పూజావిధి;
చెనఁటితప్పలని వచించె గాంధి

అల్పవేతనమునఁ దృప్తి నందువాఁడె
జగతి కాప్తుఁడనం దగు ప్రెగడ యనియె
మనది పేదదేశము కాన మంత్రికూడఁ
బేదగా నుంట యస్మదభీష్ట మనియె

మన పెద్దలు గద్దెలకున్
బెనఁగుటతోపాటు పేదపెంపునకును లె
స్స నలంగవలయు, సేవా
జనితానందమును మించుసౌఖ్యము కలదే!

మేడకు మిద్దెకు గుడిసెకు
నూడల వ్రేలాడుచున్నయుట్టికిఁ గల దీ
నాఁ డోటు; తత్కృపార్థులు
గూడెమ్ములవారి సేవకుం జనవలయున్

భౌతికబలమ్ము సుఖదాయియై తనర్ప
జాతి కాధ్యాత్మికంబగు శక్తివలయు
నేఁటి కయ్యములకు, నెల్ల చేటులకును
హేతు వీశక్తి లేమిగా కేది సెపుఁడి!

**వచనము** : "నన్ను చుట్టియున్న యీజగత్తునందలి చరాచర వస్తువులన్నియు జననమరణాది పరిణామములు చెందుచున్నను, వీని కాదరువై నిర్వికారముగానుండు చైతన్యమే దేవుఁడు. అతఁడు మృత్యువు నందఁడు-అమరుఁడు; చీఁకటికిఁ చిక్కఁడు-జ్యోతిర్మయుఁడు-దు:ఖమెఱుఁగఁడు-ఆనందమూర్తి." అని మహాత్ముడు దైవతత్వమును వివరించెను.

వచ్చినపెత్తనమ్ము చిరవైభవ మీవలె, జాతిరీతిలో
నచ్చపుమైత్రి పుట్టవలె, నాఁకటిమంటలతో, నవిద్యతో
ముచ్చముడుంగువారు నగుమోములతోఁ దలయెత్తఁగావలెన్
మెచ్చి స్వతంత్రభారతికి మేదిని హారతిపట్టఁగావలెన్

నీకు రుచించుమార్గమున నీవు ప్రయాణము సేయవచ్చుఁ; గా
నీ! కలనైన సత్యము నహింసయు లేబరమైన త్రోవకుం
బోకుము; నిల్వనేర దవిపోయిన సంఘము; గెల్వనేర దా
రేకలులేని సంస్కృతి; చరిత్ర వెలార్చిన సాక్ష్య మీనుడుల్

అది సర్వోదయ సారభూత; మదిహింసాతీత, మన్యోన్య సౌ
హృదమూలం; బది సత్యశీల; మది సాహిత్యంబు, నిత్యంబు; ధీ
సదనుల్ మెచ్చిన గాంధిధర్మమది; తచ్ఛాయన్ బ్రయాణించుచో
నెదిరింపం గలవాఁడు లేఁడొకఁడు, నిన్నీ విశ్వవిశ్వంబులన్

## ✻ శ్రీ కల్లూరి చంద్రమౌళి ✻

(ఉమ్మడిమద్రాసు, ఆంధ్రరాష్ట్రములందు మంత్రిగానుండిరి-మోపఱ్ఱు,గుంటూరు)

ఏసతిసత్కృపావిభవ మించుకసోకనినాఁడు మానవ
శ్రీసముదీర్ణ శౌర్యమయజీవిత మెల్ల నరణ్యవీధిలోఁ
గాసినవెన్నెలట్లు కొఱగానిదియై పొలివోవు - నప్పయో
జాసనురాణి వాణి విజయంబు లిడున్ మనచంద్రమౌళికిన్

సేవాత్యాగవిశిష్టధర్మమున వాసింగాంచె కాంగ్రెస్సు-తత్
సేవానిర్వహణంబునన్ ఘనయశశ్శ్రీగన్న యోధుండవై
నీ వీగుంటురుమండలంబునకు వన్నెందెచ్చుటన్ చంద్రమౌ
ళీ! వర్ణింతురు సత్కవుల్ కవనకేళిన్ దేలి నిన్నెప్పుడున్

నీ మనుగడ *కెరవాడ *(గాంధి)
శ్రీమందిరయోగి త్రోవ జీవము నొసఁగెన్
నీ మేలిమేలి కొల్వుల
నామెతలం బడసెఁ గాంగ్రె సాంధ్రధరిత్రిన్

వేలల్ దాఁటిన దేశభక్తి నినుఁ గవ్వింపన్ బ్రజాసేవలో
వేలున్ లక్షలు లెక్కసేయ వని నే విడ్డూరముం జెంద న
ప్పోలీస్‌రక్కసి *నాఁడు కన్నుఁగవ నిప్పుల్ రాల నిన్‌గిట్టి డా
*1930
కేలన్ గుత్తుకనొత్తియెత్తినను గాంగ్రెస్‌వీడమిన్ మెచ్చెదన్

నీ వొకమంత్రి వైనను జనింపదు నూతనతుష్టిమాకు, రాఁ
బోవదు నీకుసైతము ప్రభుత్వముదక్కినఁ గ్రొత్తపొం; గహో!
లేవు భవన్నిఘంటువున లెంకయు ఱేఁ డను రెండుమాట, లీ
పావనజీవనమ్ము సిగబంతిగదా జగదాప్తకోటికిన్

తొలుసంజఁ బుట్టునాజ్ఞలకు బైసి దొఱంగి
  మలుసంజ నపరకర్మంబు సలిపి
కులపాశములఁ దగుల్కొని శుంఠలను బిల్చి
  యుత్తాలపదవిఁ గూర్చుండఁ బనిచి

లంచాలగడ్డి కాసించి లోకులఁ గ్రుమ్మ్మ
నధికారిపశువుల కచ్చుపోసి
చీకటిబేరముల్ సృష్టించి పేద నె
త్తురు పీల్చురక్కసి నురక విడిచి

పరువు దక్కించుకొన్నట్టి దొరతనంబు
లేదు భువనత్రయమ్ములో లేదు లేదు
చెప్పనేటికి విద్యావిశిష్టుఁడైన
మంత్రిముంగడ ధర్మమర్మంబు లెత్తి.

(సన్మానసంచిక --20-5-48)

## ❋ శ్రీ గుట్టం సుబ్బరామయ్య ❋

(నిడుఁబ్రోలు కాలేజి ప్రిన్సిపాలు)

అంతర్వాణులు సచ్చరిత్రు లధికార్యగ్రేసరుల్ వేనవే
లంతేవాసులు కొల్వఁగా సొగయుభాగ్యం బందుకోనేర్చి వి
శ్రాంతిన్ గంటివె! నేఁడు; శాంతిజగతీ సామ్రాజ్య సింహాసనా
క్రాంతిన్ బ్రొద్దులుపుచ్చు మింకగురువర్యా! సుబ్బరామాహ్వయా

పరుఁ డెదిచేసినంత నిజభావము దావశిఖల్ వెలార్చుఁ దా
నొరుదెస దానిఁ జేయమి సముజ్జ్వలధర్మ మటన్న సూక్తి నీ
చరితకు జీవధాతు; వది సత్కవి శేఖరకావ్యవస్తువై
తరతరముల్ త్రిలింగజనతాహృదయమ్ముల గూఁడుకట్టెడిన్

ఎవ రూహించిరి *నాయఁడు
కవి యౌ నని యేఁబదేండ్లు కడచినవెనుకన్
భవదీయమైత్రి నీతని
కవురా ! యీగాలి సోఁకె నన కే మనెదన్

*పాములపాటి బుచ్చినాయడు

ముగ్గినమావియౌ తెనుఁగు మూర్వనమూదలగా నిగా జగా
పగ్గెలు చూపి కబ్బములు పల్కిన మేలితరమ్మువాఁడ వీ
వుగ్గను గ్రోలునాఁడె చవు లూరెడి కైతలు గూర్చి రచ్చలో
నెగ్గినవాఁడ వీ; వగుట నీఁ డిటు లౌటకు నబ్బ మున్నదే!

తిక్కనకైత నాంగ్లమునఁ దీర్చెద వుత్తమకావ్యఫక్కి; నీ
చక్కనిసృష్టి 'విశ్వకవిచంద్రుఁడు కొమ్మనముద్దుగుట్ట' యన్
నిక్కము చాటి తెల్గులకు నిర్భరకీర్తి ఘటించు; ధన్యతా
రుక్కమనీయ! నీకు నివె మ్రొక్కులు గుట్టమువంశవర్ధనా! (సమదర్శి- 5-8-65)

## ❋ శ్రీ డా॥ పావులూరి కృష్ణచౌదరి ❋

(హోమియొవైద్యవిద్య నభ్యసించుటకు లండను పోవు తఱి)

జయ జయ! కృష్ణచౌదరి! ప్రశస్తచికిత్సకలోకశేఖరా!
జయ జయ! సాధుశీలపరిసర్పితగౌరవదీప్తిధూర్వహా!
జయ జయ! సాహితీరసవశంవదధీపరిణద్ధజీవనా!
జయ జయ! దుర్మతాంధతమసప్రసరాపహవాదకోవిదా!

మమ తాహంత లెఱుంగని
సమతాధర్మానురక్తి సడలని బ్రతు కె
ట్లమరినది నీ; కహొ! గౌ
తమ దర్శననిష్ఠ యిట నిదానం బనెదన్.

ఆ నగుమొగ మావినయం
బానెయ్యం బామృదూక్తి యాగఱువతనం
బేనెఱి నందితి వన్నా!
యీ నిక్కులమారిలోక మెదుటన యుండన్.

చదివినట్టిచదువు చాలక మఱికొంత
తెలియ నాసచేసి తే! సెబాసు!
అంతులేదు విద్య కను కీ లెఱింగిన
నీకుఁగాక యెవ్వనికి జయంబు?

లండనువారు నిన్నుఁ దగులాగున దిద్దినవెన్కఁ, బాపముల్
పండినమూఁకలన్ నిజము పల్కు టెఱుంగనిమూఁకలన్ రవల్-
పిండి పిసాళిమూఁకల శపింపక మెత్తురిదేమి? దారికిన్
రండని వారికిన్ బలుతెఱంగుల బుద్ధులు సెప్పిరావయా!

(10-10-65-సమదర్శి)

## ❋ దేశభక్త శ్రీ గుళ్ళపల్లి పున్నయ్య శాస్త్రి ❋

(షష్టిపూర్తి సమయము గుంటూరు)

అచట సాబర్మతీతటి నసహయోగ
సమరదుందుభిరావంబు సాగె, నిచట
గుళ్ళపల్లి పున్నయ్యశాస్త్రి గొంతునుండి
వెడలె గాంధికిజే యన్న వీరవాణి.

తెలుఁగునేల నితఁడు తిరుగనిసీమ లే
దపుడు కాంగ్రెసునకు నండ యగుచు

పశ్చిమాంధ్రభూమిఁ బ్రాభాతభేరి మ్రో
గించె నితఁడు దెసలయంచు లదర.

ఒకకాలు బందిగమ్మున
నొకకాల్ గుంటూర నిడి మహెూద్యమనిర్వా
హకుఁడై పున్నయ యానాఁ
డకుతోభయుఁడై యెదిర్చె నాంగ్లప్రభుతన్

ఎంతనలఁగిన నేమి స్వతంత్ర భార
తావతరణమ్మునకు నెంతతీవ్రమైన
తప మొనర్చిననేమి యే తాదృశులకుఁ
జోటులే దేల్చడిని జిన్నపీఁట లేదు.

జందె ముంట తక్క శాస్త్రియు నొకమంత్రి
గామికిన్ గొఱంత యేమికలదు
నాఁడు ఖద్దరైన వాడనివారలే
నేఁడు ప్రభువులైరి వాడవాడ.

కాంగ్రెసును దిట్టి బ్రదికిన కవులు తక్క
నొరులు లెక్కకు రాకుంటయును ఘటిల్లె
పాప మిది పండి యేరేతి బ్రద్దలౌనొ
లోక మిఁక నెంత యల్లకల్లోల మగునొ

అర్హణీయుల మఱవ నభ్యాసపడిన
తెలుఁగుదేశాన నిన్నుఁ గీర్తింపఁజూచు
*హనుమయాదికు లుంట మాదాత్మ తనిసె *(చేబ్రోలు హనుమయ్య)
నన్నయా! పున్నయా! వీరి కగు జయమ్ము.

బోటి కఱవు దీర్చె ము న్నొకహనుమయ్య
యొక్కప్రాణి బాధ నుక్కడంచె;
నీటి కఱవు దీర్చె నేఁ డొక హనుమయ్య
కోటిమందిప్రజల గోడు మాన్పె (గుంటూరికి కృష్ణనీరు సాధించిన చైర్మన్)

ఈ చేఁబ్రోల్వంశజుఁ డీ
శౌచప్రియబుద్ధి నిన్ను సమ్మానింపం
జూచుట యన నౌచిత్యము
పూచుటకద గుళ్ళపల్లి పున్నయశాస్త్రీ!

పరులమేలు వలచు గఱువ మేడూరి నా
గేశ్వరుని మహత్త నీసదస్సు
సకలవైభవముల జరుగును గాంధేయ
గౌరవంబు నెల్లకడలఁ జాటు.

ఆంధ్రరాష్ట్రమునకు నారటించి వటించి
సిద్ధినందినట్టి జెట్టి వగుటఁ
బట్టు పట్టు మిఁకను బళ్లారి కోలారు
తమ్ములెల్ల మనకు దక్కునట్లు

తెలుఁగుదివాణమందుఁ బరదేశపువాణికి వాసిముట్టుచో
వలచిన రాష్ట్రమేల? యది వచ్చుటకున్ మనపెద్దలకటా!
బలియగుటేల? యిట్టి దొరపాడియుఁ గాననివారు పెత్తనం
బులకుఁ బెనంగనేల? వనభూములకుం జనరాదె మౌనులై.

ఇంతలు నంతలైన మనయేలికలందఱు తెల్గువ్రాతఁకున్
సంతనకట్టి తీర్పవలెఁ చట్టము లానలు; పాడిపట్టునన్
గంతులు వేయుచున్ దెనుఁగుగడ్డనుడుల్ వొగడొందు కోవలెన్
వంతలు తీఱెనంచుఁ పెఱవాయి నెఱుంగనివారు నావలెన్.

ఇంగిలీసురామి నేను గుమాస్తాల
చెంత లజ్జఁ గూరు టెంతకాల
మోర్వవలయు? వలయునుద్యమ మూహించి
తెలుఁగునుడికి వాసి తెమ్ము శాస్త్రి.

ఉపవాసగౌరవం బిపు
డపాత్రులకతానఁ జెడియెఁ నది పూనక లాఁ
తిపథమ్ము ద్రొక్కి పెఱబా
సపోటు తప్పింపుమయ్య! సైదోడులకున్

తంజనగర శారదాభవనమ్మునఁ
జీకువడిన తాటియాకుఁబొరల
మూల్గు తెల్గుకైతమును దెచ్చి పూజింపఁ
బంపుమయ్య! రాచపెంపువారి

లండనులో నమరావతి
పండించిన ప్రతిమ లుండఁ బనియేమి? కళా
ఖండము లవి మనగడ్డకుఁ
దెండా! యని తఱుమవయ్య! తెనుఁగుందొరలన్

ఇంకొక యర్వదియేండ్లు ని
రంకుశభాగ్యమున నుత్కటారోగ్యమునన్
జంకనియశమున గౌరీ
శంకరకారుణ్యమున నెనంగుము శాస్త్రీ! (8-11-1966-సమదర్శి)

## ❋ శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ❋

(ప్రజానాయకులు ఎమ్.ఎల్.ఎ గుంటూరు)

కోరఁ డర్థములను గోరఁడు కాంతను
కోరఁ డాజ్ఞసేయ గొప్పపదవి
కోరు వావిలాల గోపాలకృష్ణుఁ డ
ట్టడుగువాని కొల్వు నహరహంబు.

ఇతని కఠోరజీవితమె యీతనికిన్ జయహేతువై నుతి
ప్రతతి గడింప వీని కొకపక్షముతోఁ బనియేమి? సత్య సం
గతులగువారు భోగములఁ గాదనువారు పరార్థకల్పన
వ్రతులగువార లేకుదుటివారయినన్ విడనాడ రీతనిన్.

తాన యుదికినవలువను దాల్చుఁగాని
చలువసవరింత లేనాఁడు వలవఁ డితఁడు
వంకరలులేని నడత కావలయుఁ గాని
మడత యెట్లున్న నేమి లే మానవునకు.
(30-12-66-సమదర్శి)

## ❋ విద్యాపోషక శ్రీ పాములపాటి బుచ్చినాయుడు ❋

(పి.బి.యన్. కళాశాల స్థాపకులు, నిడుబ్రోలు, గుంటూరు)

సిరిగలవారు భోగముల చెంతకుఁ బోక జగద్ధితక్రియా
పరు లగు టొప్పు నంచు మనబాపు వచించినపల్కు నీ దెసన్
గరము ఫలించె; నీరసలఁగ్రాఁగు సమాజముగుండెపై భవ
చ్చరితము చాఁగురే! యమృతసారము చిల్కెను బుచ్చి నాయఁడా!

కొడుకులు లేనివాఁడు తనకూర్చినసంపద వేనవేల యా
మడలకొలంది నున్న కొఱమాలినచుట్టము పాలుచేసి వాఁ
డెడపెడ వెచ్చ పెట్టుతఱి నేడ్చు 'లబో' యని; నీవు మాత్ర మీ
బెడఁదను దప్పుకొంటివి వివేకవిఖండిత మోహవల్లరీ!

నీ పేర నీ యీవి పరమహేతువై నిడుఁబ్రోలు నందు
రూపుదాల్చిన కళాశాల భవదాత్మరోచి: పతాక;

ఏప్రొద్దు భారతీ చరణమంజీరమృదుఘులంఘులలు
నీప్రాంగణమ్మున మొరయు; ధన్యతానిధి వోయి! నీవు.

నిన్నుఁ బరిష్కరించిన మనీషిచయమ్మున మున్నుమున్నుగా
సన్నుతిసేయఁదగ్గకృతి సైరికబంధువు గోగినేని రం
గన్న కరంగఁగా నెనరుకాలువలన్ బరఁగించి పల్లెటూ
రున్నతినందఁ జేసితె! గుణోజ్జ్వల! పాములపాటిసత్కులా!

వినయ వదాన్యతా రుచిర వేంకటసుబ్బమ నీవధూటియున్
దన యనవద్యమైన సహధర్మచరిత్వము కోటికెక్కఁ దీ
ర్చెను సదనం బుమాపతికిఁ బ్రీతిగ శ్రీగిరినెత్తమందు; మీ
మనుగడ వస్తువై కవుల మాదృశులన్ గదలించు నాయఁడా!

నీకు నఱువదేండ్లు నిండిన వని మహో
త్సవ మొనర్ప జగము సాగెనట్టె!
మంచిమాట వింటి మది నిర్భరానంద
భవన మయ్యె నుదితకవన మయ్యె.

వయసువెంట నాత్మవైభవ మధికమై
మబ్బు విడిన గగనమణివిధాన
ముసురుకొనెడి మోహమును ద్రోసి విడుమర
మరగి సజ్జనుండు మెఱుఁగుదేలు.

ఇదిగో! యీ "సమదర్శి" కావ్యమును నీ కీనాఁడు మేల్బంతి సూ
డిదగా నిచ్చెద మాననీయజనగోష్ఠిన్ దీనిఁ గైకొమ్ము సొం
పొదవన్ విచ్చినమల్లెపూఁబొదవలెన్ యుష్మద్యశఃకాంతి సం
పద దిగ్భిత్తులకెల్ల వెల్లగ సుహృన్మౌళీ! విరాజిల్లఁగన్.

(సమదర్శి--1967)

## ❋ శ్రీ లాల్ బహద్దరుశాస్త్రి ❋

(మాజీప్రధానమంత్రి)

మాతృమహీవైభవ సం
ధాతృ మహావీరధర్మతత్పర ! గాంధి
చ్ఛాత్రవర! శాంతిరణమఖ
హోతృమణీ! లాల్బహద్దరూ! శౌచఖనీ!

బాపుజీ లేని జవహరపండితుండు
కానిపింపని కొఱఁత యెవ్వానిమదికిఁ

దోఁపని విధాన లాల్‌బహదూరు శాస్త్రి
పరఁగె సాత్త్వికరాజసప్రభలు ప్రమ్మి.

చక్కఁదనమ్ములేదు, సడిసన్న బి.యే. మొదలైనపట్టముల్
దక్కనులేదు, లేదు ధనధాన్యపటుత్వము నీకు; నైన నీ
వెక్కినపీఠ మిమ్మహి మహీయ మహో! నినుఁజేరినట్టి యీ
పెక్కువ చొక్కంపుబ్రదుకు పిండినసారమురా! బహద్దరూ!

వలువలీవికతన వచ్చునా, సుచరిత్ర
వలన వచ్చుఁగాని విలువ నరున;
కేల డంబమందు; వెంద అమాత్యు లీ
కరణి వక్కణింపఁగలరు? శాస్త్రి!

కృతిమతి జవ్హరుండు పదునెన్మిదియేండ్లు ప్రధానమంత్రిగా
జతనము లెన్నియో సలిపి సల్పి గడింపనిపేరు, పెంపు నం
దితివటె! సార్థవత్సరము నిండియు నిండకమున్నె; శాత్రవ
ప్రతతి నెదిర్చి కీ లెఱిఁగి వాతలుపెట్టి మనీషిసత్తమా!

జవహర్లా లతిలోకశక్తులఁ బ్రశంసాపాత్రుఁ డయ్యున్, రణ
వ్యవసాయంబన డయ్యుచుంట కతనన్ వైరుల్ నిరాఘాటులై
యవనిం దోఁచిరి నాఁడు; నేఁడు నిరవద్యక్షాత్రరోచిర్మయా
జవసంజాతుఁడ వీవు నేత వగుటన్ స్రగ్గెన్ దదాటోపముల్.

పాకీస్థానమెకాదు, దానికి విషత్ప్రాతక్రమం బూఁదుచున్
దోఁకాడించు పెకింగుచిల్వయును నీ దుర్వారవిక్రాంతి రే
ఖా కార్కశ్యము గాంచి, వంచె ఫణ; మల్కంగొన్న హిందూర్విపై
దూఁకం జాలుమగండు లేఁడని ప్రజల్ తోషింప ఘోషించితే!

గీతకు నీ వుదాహృతివి, కృష్ణుఁడు దిద్దినక్రీడి వీవు, నీ
చేతము మోహపుందెరలఁ జీల్చి, స్వధర్మము నాదరించి, శీ
తాతప సౌక్యసంకట జయాపజయమ్ముల భేదమెంచమిన్
బ్రీతమనస్కుఁడై హరి వరించె భవద్రథ సారథిత్వమున్.

ఈశ్వరానుభూతి కీవు నోఁచితివి, నీ
వ్రేఁగునెల్ల నిడితి వేల్పుమీఁద
వెఱపు నిన్నుఁ గదియ వెఱచె బహద్దరూ!
వలచి నిలిచె నీదు వలన గెలుపు

పిఱికి కండలేని బిరుదు నా సడిసన్న
నీవు దేశమునకు నేత వగుట

నగుర! తెగువ హెచ్చి, మగఁటిమి రెచ్చి, మై
మఱచి పగఱ నెదిరిచె మనదళమ్ము.

ఆటోపించిన భారతీయభటుఁ డుగ్రాస్త్రచ్ఛటల్ గుప్పి, పాక్
పాటన్‌టాంకుల, జెట్‌విమానముల డిప్పల్ రాల్చి, లాహోరు పెన్
కోటన్ ముట్టిననాఁడు, దేశ మిది నీ కూర్పాసమై, బాహు వా
స్ఫోటింపన్, రిపుకోటి యుడ్డుగుడిచెన్ భుగ్నాశమై శాస్త్రిజీ!

మనపగతైనముస్లిములు మామహి నాకము, పుణ్యలోక మం
చనిశము చాటుచుండినను, హైందవసంస్కృతి విశ్వమానవ
ప్రణయపతాకయౌ కతన భారతదేశమహమ్మదీయులున్
బెనఁగి రహెూ! దివిన్, భువిని బిండిరి నెత్తురు మాతృభూమికిన్.

ఆలము నల్లెమున్ సమత నారయుజోదు హమీదు గుండెకుం
గాలము కాఁగ, శత్రువు కకావికలై, సకలోర్వి నున్న చు
ట్టాలను జీరి చీరి యకటా! గతిగానక చేతులెత్త, నీ
నేలను గడ్డిపోఁచయు మనీషిమణీ! తలయెత్తె నేడ్తెఱన్.

రాజపదాభిరాముఁ డపరాజితశస్త్రుఁడు రామభద్రుఁ డాం
ధ్రాజవసంభవుండు జగదద్భుతలక్ష్య విపాటనక్రియా
భ్రాజిత దృగ్ధురా వహనపండితుఁడై పడఁగొట్టెనట్టె! ఘో
రాజికిఁ దారసిల్లు *విమతాభ్రచరమ్ములఁ గాకులంబలెన్.

*జెట్‌విమానాలు

మచ్చరికించి శ్రీనగరమండలమున్ విదళింప, ఱివ్వునన్
వచ్చెడు గాలియోడఁ జిఱుప్రయ్యలుగా నిలఁగూల్చి, నీ నెఱా
మెచ్చు గడించుకొన్న బలుమేటియుఁ దెల్గుల పోతరాజె! యీా
చిచ్చఱపిడ్గు పే ర్వినినఁ జెమ్మటలూరు నరాతికోటికిన్.

విక్రమరాశియౌ భరతవీరుఁడు శాంతినకోరు; శాత్రవుం
డక్రమచర్యకుం గడఁగినప్పుడు నిప్పులుచిమ్ము; వైరి నా
వక్రత సైఁపుమన్న హిమవన్నగమౌ; ననుసత్యమున్ మహీ
చక్రమునందుఁ జాటితివె శాస్త్రి ! వజీరు లజయ్యు లౌననన్.

అంతచేసినరిపుమోల, నంతగెలుపు
చేపడినవేళ, నీ వింత చెలిమితోడ
నింత మన్ననతోడ, భాషింతు, వెంత
నిండుమది నీది! యెంత వినీతి నీది!

నీ కగపడ్డనిగ్రహము నేర్చుట కెల్లరు కారు; శైలమున్
డీకొని వ్రక్కలించు నశనింబలె గట్టితనమ్ము, తమ్మిపూ
రేకువలెన్ మృదుత్వము ధరించినడెందము నీది; బాపుజీ
పోకడ లాఁచికొన్న నెఱప్రోడవు నీవు బలా! బహద్దరూ!

గాంధిపుట్టినదేశము, కరుణ, ప్రేమ
సత్యము, సముద్ధరించిన జాతిపిత జ
నించిన ధరిత్రి శాంతికి నేస్తమగుట
సముచితం బన్న నీవాణి యమరవాణి.

నీవలె నచ్చపుంబ్రదుకు నేర్చి, సుఖమ్ముల రోసి, జాతికిన్
సేవయొనర్చు నాయకుఁడు సీమకు నొక్కఁడుగా లభించినన్
లేవు నిరాశ, లీరసలు లేవు, రణంబులు లేవు, బాపుజీ
రావలెనన్న రాజ్యమది రాకకు నాఁకలు లేవు, శాస్త్రిజీ!

పడవవాఁడు మెత్తఁబడనినాఁ డుత్తుంగ
భంగభయదయైనగంగ నీఁది
వీథిబడికిఁ జన్నవేళనే ప్రజలు నీ
గుండెబిగువు మెచ్చుకొనిరి శాస్త్రి.

దోవతి మాని కేవలవధూజనవేషము పూని చారులన్
గావలికాండ్రఁ గన్మొఱఁగి గాంధిపతాక ప్రయాగరథ్యయం
దీ వలనాఁడు నిల్పినపుడే, భవదీయము కార్యదీక్ష స
ర్వావని కబ్రమయ్యె; వల పబ్బుఁగదా చిఱుమొగ్గ కేనియున్.

నీవలె నర్థకామముల *నెట్టికసీలతనమ్ము నూఁదినన్ * సదాచారము
నీవలె *నార్జవంబును గణించిన, గర్వము డిగ్గనాడినన్ * శీలము
నీవలెఁ గూర్మియుం గృపయు నేర్చినఁ దియ్యనిపల్కు పల్కినన్
దేవుఁడయై నరుండు జగతిన్ వినుతిన్ బడయున్ బహద్దరూ!

ఆయం బొప్పమి నన్ను మున్ పద్రుచు పుణ్యక్షేత్రయాత్రారతిన్
ద్రోయన్ నేర్పితిఁగాని నేతృపదమందున్ నిల్చి యిష్టాకొదన్
బాయంగంటిని సర్వభారతము నాపాలన్ మహాతీర్థమే
యాయెన్ నేఁడని లోకసేవకు విశాలాధ్వమ్ము సూచించితే!

మంత్రిపదము వీడినంతన సర్కారు
కారు నెక్కు హక్కు కడచె నంటి;
వింటి కేగి జీత మిగిరిన దిఁక నొక్క
యిగురు చాలు నంటి వింతితోడ.

కాలము సాయమై చిఱుతగద్దెకు వచ్చినవారలే వెసన్
దూలములేనికొంపలను ద్రోసి, విహాయసచుంబి రమ్య హ
ర్మ్యాళి రచించి రర్థపతు లైరికదా! మఱి పాకయైన నీ
పాలిది కానరాదఁట! సెబా సిది చాలు భవన్మహత్తకున్.

పేదవుగా జనించినను బెన్నిధివంటిపదమ్మునందు న
ష్టాదశవర్షముల్ నిలువఁజాలితి; వైన *నకించనత్వమే * పేదరికమే
యాదరణీయ మంటి; విది యౌనని మెచ్చెదఁ గాని, సాధ్వి నీ
పైదలి యెంత యెత్తిడఁగఁ బ్రాఁకితి వీకొసకొమ్మజుంటికిన్?

నగలమాట కేమి, నల్లబంగారము
మాటకేమి, యింటిమాట యైన
నెత్తలేదె యెన్నఁ డిల్లాలు మాయురే!
లలిత నీతపఃఫలమ్ము శాస్త్రి!

మనసిరియుండుచోట మనమానసముండును, గాన మానవుల్
ధనమును ముక్తిరాజ్యమున దాఁచుట మంచిదిగాని, బంధకా
రణ మగు నిమ్మహిన్ నిలుపరాదని రాదిఋషీంద్రు; లీనుడిన్
మననముచేసి చేసి ఋజుమార్గము గంటివి నీవు కోవిదా!

ఈ జగత్తు సర్వ మీశ్వరు సొత్తౌటఁ
బరులసిరుల కాసపడక నరుఁడు
బ్రదుకవలయు నీవిపంట; నన్న మహర్షి
వాణి కీవు తారకాణ వన్న!

'జైజవాన్' 'జైకిసాన్' రవస్రష్టవై, వి
శిష్టచైతన్య మావహించితివె ప్రజకు
కత్తి, కఱ్ఱు నిరాఘాటగరిమ గన్న
దేశ మవమతి సెందునా లేశమేని.

ఇఁక నొకవేయివత్సరము లేగెడుదాఁక నశింప వీధరి
త్రికి నిపు డీవు నేర్పిన వితీర్ణియు, శౌర్యము, నైకమత్యమున్;
తికమకలాడుచున్ భరతదేశము దిక్కులుచూచువేళ నా
యకపదమంది మందిహృదయమ్ము నలర్చితివా! బహద్దరూ!

ఈతని సంస్కృతికిన్ గుఱు
తై తనరం జేసితిని "మహాత్మకథేతి"
ఖ్యాత బృహద్రచనమ్మును
నాతపమున మేలిపంట నాఁ దగిన కృతిన్. (మహాత్మకథ --1968)

## ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశముపంతులు

(జాతీయపోరాటయోధుడు-సైమను సంఘమురాక 1928- ప్రకాశము వీరోచితచర్య-
ఆంధ్రరాష్ట్రప్రథమముఖ్యమంత్రి)

**సైమనుసంఘము చెన్నపురిం గదిసినపుడు-**

దొరతనమ్మువారు సిరి తద్దవెచ్చించి
రింబుమీఱ నాఁటిడంబములకు;
దిద్దియుంచెఁ బ్రజలఁ దెనుఁగుసింగము బహి
ష్కరణ మద్వితీయగతిని సాగ.

పొమ్ము! సైమనూ వెన్కకుఁబొ! మ్మటంచు
నల్ల జెండాలతోఁ బ్రజల్ నడిచి రెదురు
అబ్ధినా వచ్చు జనసమూహమును జూచి
యధికృతుల్ దురహంకృతి కగ్గపడిరి.

కాల్చిరి లఘునాళికలన్
బ్రేల్చిరి గుండ్లను జనాళి బెదరుట కనుచున్
వ్రాల్చె నొకపౌరుఁ-డురముం
జీల్చినగోళమున సొమ్మసిలి-కాయంబున్.

వచ్చుచున్నది వెల్లువవలె జనాళి
పృథివి కొరగిన పార్థసారథిని జూడ
నదయు లధికారు లొకచిన్నగదిని శవము
నునిచి కావలిపెట్టి రా యొవరికిని.

**అపుడు ప్రకాశము రాక-**

నెట్టుకొని యెవ్వఁడేని లోనికిఁ బదమ్ము
పెట్టెనా కాల్తుమనుచు ఱంపిలిరి బంట్లు;
అత్తఱిఁ బ్రకాశమక్షుల నగ్నికణము
లడరఁ బ్రజముందు నిల్చి వీరాంకమూర్తి

ఎవఁ డాకాల్చెడువాఁడు? కాల్పవలె నా యీఱొమ్ముపై; నీశవం
బవలోకింపక పోవ నే నిపుడు; న న్నాఁపంగ నెవ్వాని కు
న్నవి గుండెల్? నిటలాక్షుఁ డడ్డుపడినన్ నాథాకకుం జాలఁ, డీ
యవనిన్ భీరులు లేరు లేరు, పరగర్వాగస్సహిష్ణుల్ శతుల్.

ఏనే కా దీజనతతి
లో నొక్కరుఁడైన సజ్జలోఁ గల బడుగున్

గానక మఱలఁడు మఱలఁడు
సైనికులారా! తొలంగిచనుఁ డవ్వలికిన్.

**వచనము** : అని యార్చి కూర్పాసముం ద్రోసి వక్షముంజూపుచు
గదిలోనికిన్ దూసికొని పోవంజాగిన-

పుల్లవడి డిల్లవడి భటుల్ తెల్లమొగము
వైచి సూరెల నిల్చి యవార్యశౌర్య
ఖనికిఁ దెరువిచ్చి రీవీరఘట్ట మెవఁడు
మఱచు నత్యద్భుతం బతిమానుషంబు. (మహాత్మకథ-1968)

## ❊ దేశభక్త శ్రీ అడుసుమల్లి శ్రీనివాసరావు ❊

(గ్రంథాలయ స్థాపకులు - వేటపాలెము గుంటూరుజిల్లా

పదవులు కోరక దేశా
భ్యుదయమునకు నలఁగు పూరుషోత్తముఁ; డీతం
డెదురైన నయత్నమ్ముగ
విధేయమగు విఙ్ఞకోటి వీటన్ బాటన్

ప్రజకు నిక్కమైనబలము సారస్వత
బల మటన్నపాడి దెలిసికొన్న
పెద్ద యితఁడు, పెనఁగి పెనఁగి యజ్ఞులఁ దీర్చి
దిద్దు నితఁడు, వీని కుద్ది యెతఁడు?

కవులు పుట్టిరి, సంఘసంస్కర్త లుదితు
లైరి, మాతృమహీదాస్యభార మణఁపఁ
బ్రతినపూనిన యోధులేర్పడిరి, శ్రీని
వాసరా వొనరించుసేవలు ఫలించి

ఏఁబదేండ్ల నుండి యెడయ కీతనివంటి
త్యాగధనులు కర్మయోగరతులు
కడఁగి నడిపినట్టి గ్రంథాలయోద్యమ
మద్వితీయతేజ మాంధ్రమహికి

సారసాహిత్యకిరణప్రసార మెచట
నొదవె నచటనె సత్యాగ్రహోద్యమమ్ము
మెప్పుగన్నది పరరాజ్య మొప్పునన్న
పలుకు మ్రోఁగినది *హరిత్తు లులికి *వ్రీల. *దిక్కులు *బ్రద్దలయ్యె

(1968-మహాత్మకథ)

## ❋ వీరమహిళ అలమేలు మంగమ్మ ❋

(చీరాల)

గర్తపురిసీమ వెలనాటి ఖండమందు
రాణగల పల్లెయగుచుఁ జీరాల వెలయు
వలువనేఁతల జీవించువార లచటఁ
బెక్కు రున్నారు పేదర్కిఁ జిక్కువారు.

చీరాలను దత్సోదరిఁ
బేరాలన్ గలిపి యొక్క పేఁటను జేయన్
దీరుపు సేసిరి నాఁ డధి
కారులు; వారలకుఁ గోటగద పేఁట యనన్.

ఏలుబడివారినిర్ణయ
మాలించి కరార్తి పెంచి యలయించుపురం
బేలా మన? కిది బీదకు
మేలా? యని దానిఁ ద్రోయ మెయికొనిరి ప్రజల్.

ఆంధ్రరత్నము నేతయై నిల్వ, నాఁడు
చీరాలఁ బేరాలఁ జెలఁగుగృహస్థు
లింటిపన్నీమని యెదిరించి దొరల,
గాంధికిజే యంచుఁ గారకుం జనిరి.

మునుముందు చనినట్టి మొన కలంకృతిగ
నలమేలు మంగమ్మ యనువృద్ధ కలదు
సకలభారతభూమిఁ జట్టముం ద్రోసి
చెఱసాల కేగినస్త్రీలలో నీమె
మొదటిదియై తెల్గుముదిత కపూర్వ
యశము గూర్చిన దంట యబ్రమ్ముగాదు
మఱవరాని వీరమహిళయీమె (మహాత్మకథ 1968)

## ❋ శ్రీ ఆచంట శేషయ్య ❋

(పశువైద్యశాలా భవనదాత-అప్పికట్ల-గుంటూరు)

పాఁడియుఁ బంటయున్ బ్రథమభాగ్యముగా మదినమ్మి నిచ్చలున్
వాడనిదీక్షతో సురభివంశము నేలుచు నేలదున్నుచున్
నాఁడును నేఁడు శాంతిసదనమ్ముగ భారతజాతి వెల్గు; నీ
పోఁడిమి రాదురాదు పరభూముల కెన్నియుగాలు దాఁటినన్.

మీఁగడ మెక్కుచున్ బసుల మేపెను మాపెదవేల్పు; మూఁపుపై
నాఁగలి మోపి శాత్రవగణమ్ము నదల్చె నొకయ్య; గిత్తపై
సాగుచు నొక్కవేల్పు జలసంపద పంచును సేద్యగాండ్ర; కీ
భోగము యోగమున్ భరతభూమికిఁ దక్కె నగణ్య పుణ్యమై.

నిశలు పగళ్ళు గాసివడి నేలనగల్చుచు, వ్రేఁగు నీడ్చుచున్
గృశతలఁ దూల్చు దుగ్ధమొలికించుచు, నుర్వికి జీవగఱ్ఱలౌ
పశువులహర్షముల్ నరులపండువులౌటరుదా? గదాళికిన్
వశపడి మూల్గుమంద మన వాసికి, వన్నెకు మచ్చయౌఁగదా!

(గదాళికిన్ - రోగములకు)

శేషయ! యెంతమంచిపని చేసితి! సోమరియైన మాసికై
యౌషధశాలలన్ నిలుపునయ్యలఁ గాదని, యాఱుగాలమున్
శోషిలి దున్నిదున్ని చెడి చుమ్మలువాఱు పశుప్రజంబు లు
న్మేషము నంద నీదుకలిమిన్ వెదపెట్టి వివేకివైతివా!

ఆచంటాన్వయ! శేషయార్య! భవదీయంబైనపుణ్యమ్ముచే
*నాచార్యాగ్రణిరంగనాయకులు నీ కాత్మీయుఁడై, బంధువై
ధీ చైతన్యముగూర్చె; నేర్చినది యుద్దీపించె నీనాఁడు; నీ
యౌచిత్యమ్మును మెత్తు రీజనచయం బాచంద్రతారమ్ముగన్.

*(రైతునేత ఆచార్య ఎన్.జి. రంగాగారు)

కలిమికి నీవి వన్నెలిడుఁ; గాని నినుంబలె నెంతమంది నీ
తెలివి వరించె, విజ్ఞత జితించినమానిసి వీవు; నేఁటిపె
ద్దలు సడిసన్నవారు శుచితానిధు లిచ్చుశుభాశిషమ్ములన్
బలిమి గడించి సౌఖ్యములు పొదుకొనన్ మనుమా శతాబ్దముల్.

పశువులపెంపు కర్షకుల భాగ్యము; కర్షకతుష్టి సర్వ లో
క శుభము; లోకశాంతి ప్రభుకామ్యము; కానఁ ప్రభుత్వపీఠముల్
వశపడియుండు నెవ్వరికి, వారు పశూన్నతిఁ గోరి, వాని దు
ర్దశలఁ దొలంగఁజేయు కవిరాజుల నెల్లెడ నిల్పు టొప్పుగున్.

(కవిరాజులు-వైద్యులు)

పసరపు మూఁగబాస విను ప్రజ్ఞలునేర్చి తదీయ సేవకున్
విసుగక మందు మాఁకు లిడు వెజ్జులు భూతదయారసార్ద్ర మా
నసులు, సమస్తకర్షకజనప్రియబంధువు లాయు రున్నతుల్
పొసఁగ సుఖింత్రుగాక! మనభూమికి నేర్పడుఁగాక! భద్రముల్;

(8-11-68- అభినందనసంచిక)

## ❊ శ్రీ తాళ్ళూరి జియ్యరుదాసు ❊

(మాజి యమ్.యల్.ఎ- తాళ్ళపాలెము గుంటూరు)

దైవము పౌరుషమ్ము శుభదాయకమై భవదీయగౌరవ
శ్రీవిభవమ్ములన్ బెనుపుసేయ శతాధికవర్షజీవన
ప్రావహదాత్మసంయమ విభావళితో జగదీడిత ప్రజా
సేవన రక్తితో మనుము జియ్యరుదాస! సభల్ సెబాసనన్.

అఱువదియేండ్లు నీబ్రదుకునందు గతించిన నేఁడు బాపుజీ
సురుచిరమూర్తి నీయెడఁద జొంపపుమల్లియ, నీదుపల్లియన్
మెఱయుట మేలిచేఁత; యిది మేరలు దప్పినవారి పాలికిన్
గురువగుఁగాక ధర్మమునకున్ నెలవేర్పడుఁగాక యిమ్మహిన్.

హరిజనుఁజేసె నిన్ను భవదభ్యుదయమ్మునకై నిరంతర
త్వరఁ బయనించె; హైందవమతమ్ము సమూలముగా నశించినన్
వెఱవను గాని, మాలదెస వేఱిమిసైఁపను, దీనిఁ ద్రోయఁగన్
మరణమునైన సైఁతును జుమా!యని నిల్చె మహాత్ముఁ డద్రియై.

హరిజన ప్రవేశ మంగీకరించిన
తెనుఁగునాట మొదటిదేవళమ్ము
కానిపించె నపుడె కావూర మాయూరఁ
దెఱచె నది సబర్మతీమహర్షి.

తగు నస్పృశ్యత యనఁగన్
జగద్గురువులైన నేఁడు చాల రయారే!
భగవానుఁ డెవఁడు ? ధర్మ
ప్రగతి కుపాదానమైన బాపూ తక్కన్?

జియ్యరుదాస! గాంధికి రుచించిన ధర్మువుగాక నెయ్యమున్
దియ్యము గూర్చి లోకమును దిద్దుట కెద్దియుఁజాల; దీర్ఘ్యలన్
వ్రయ్యలువ్రయ్యలై యడుగువట్టిన తమ్ముల నుద్ధరించుచున్
డయ్యఁ గదోయి! నీమనుగడన్ బ్రజలందఱు నాదరింపఁగన్.

బ్రదికినఁ జాలునా? నరుఁడు, పాడికి నూడిగమాచరించుచున్
బ్రదికిననాఁడె తద్భవము పండును, నిండును వాని కీర్తియున్;
కదలిన యర్వదేండ్లఁగని కందక రాఁగల యర్వదేండ్లతో
మదిమది నందవోయి! పలుమాటలు నీదెసఁ జెప్పనేటికిన్?

చదివితివి; రాచసిరిగల
పదవుల నందితివి; సుకవిపండిత మైత్రిన్
గుదిరితివి; సాధుసంస్కృతి
పొదలెడి మండలము నందుఁబుట్టితి వన్నా!

తాతలనాఁటినుండి శుచితామయజీవన మాసచేసి వి
ఖ్యాతిగడించె నీకుదురు; గాంధి నినుంగని వెల్లఁబాఱి సం
ప్రీత మనస్కుఁడై తెనుఁగుపేఁటల బాటలఁ ద్రిప్పె నిన్ను; దద్
జ్యోతికి నంజలించి మహసుందరతన్ గనుమయ్య జియ్యరూ!

(16-4-1970 - చక్కట్లు)

## ❋ శ్రీ మేడూరి నాగేశ్వరరావు ❋

(గుంటూరు జిల్లా పరిషత్ అధ్యక్షులు)

జయ! మేడూరివనీ వసంతసుషమా సంధాతృ చూడామణీ!
జయ! నాగేశ్వరనామధేయ! జనతా సంహూత సభ్యాగ్రణీ!
జయ! నానాముఖలోకసేవనవిధా సంతర్పితాంధ్రావనీ!
జయ! షష్ట్యబ్దసనాథ! సాధుచరిత స్ఫార ప్రతిష్ఠాఖనీ!

మేడూర్ నాగేశ్వరుఁడు క
వీడార్ద్ర రసజ్ఞతా మహిష్ఠుఁడు సేవా
రూఢ చరిత్రుఁడు తోడై
ఱేఁడై గుంటూరిసీమ రెక్కొనఁ జేసెన్

ఒకనాఁడు సమతాప్రయోగనిష్ఠా నిధుల్
శాతవాహనుల కాస్థాని యగుచు
ఒకనాఁడు వైదిక ప్రకృతిలుబ్ధమనీషు
లిక్ష్వాకులకు నధీనేల యగుచు
ఒకనాఁడు సారస్వతో పాసనప్రియుల్
కొండవీడ్విభులకుఁ గోట యగుచు
ఒకనాఁడు దానధర్మకళానిధులు వాసి
రడ్డి భూపతులకు రాజ్యమగుచు

నఖిలదిక్కుల విఖ్యాతి నందుకొన్న
గర్తపురమండలము నేలుగద్దె వడసి
పేఁటపేఁట నహో! యనిపించుకొంటి
వెంతధన్యుఁడవోయి! నాగేశ! నీవు

కేవలమంత్రతంత్ర పరికీలిత ధీనిధి నాధికారిక
శ్రీ వరియింప నొల్లదు, వరించిన మెచ్చదు నాల్గుపూఁటలున్
నీవలె నెవ్వఁ డౌచితి గణించి లభించిన *పారుపత్తెమున్ *ఆర్థికాధికారం
సేవకు రేవగల్ వ్యయముసేయు నతండె రుచించు దానికిన్

సంపదలెన్నియున్నఁ పరిషత్తులుమెచ్చిన విద్యలున్న గ
ర్వంపడఁ డీమనస్వి; రిపువర్గముసైతము మెచ్చు నీతనిన్
లంపులమారిమూఁకల బళాబళిసందడి యెంతరేఁగినన్
దింపఁడు పెద్దవారి; వెనుదీయఁడు సత్యము నాదరింపఁగన్

నిదురంబాసెద వేటుకూర; వరగానిన్ స్నానమున్ దీర్తు; వె
న్మదలం ద్రావెద వింత టీ; కొణికిలో మాటాడి, యద్దంకివా
రెదురై నిల్వు బసం బసాపడుచు నాయీ వాదముల్ తీర్చి, పూ
నెద వధ్యక్షత మద్దిపాటిపురవాణీ కౌముదీవేదికన్

సభలన్ నీవు ప్రసంగముల్ సలుపుచో సాహిత్యలక్ష్మీ నవ
ప్రభ లవ్వారిగఁ బల్కు పల్కున రసప్రాలంబముల్ వెల్వడున్;
ప్రభుతన్ మోసెడి వారిలో నినుబలెన్ భాషావధూటీ కృపా
విభవాహర్తలఁ బెక్కురన్ గనము నీ విద్వత్తకున్ భద్రముల్!

దిక్కులనెల్ల నేలుజగతీపతి వచ్చిన నిల్పి నీ వహో!
చక్కని కబ్బముల్ నుడువు సత్కవి కర్చన లాచరింతు; వీ
పెక్కువ యెల్లవారికి లభించునె గుంటురి సీమవారికిన్
దిక్కనకైతసొంపులు జితించినవారికిఁగాక ధీనిధీ!

పెడపెడగా రిపుల్ పరుగుపెట్టఁగఁ బాండ్యమహిన్ దెనుంగువాల్
సిడములు నాటుచున్ గృతులుసెప్పఁగఁ జెప్పెడి వెంకనాదులన్
గడు నలరింపఁగాఁ జదురుగన్నఘనుల్ రఘునాధరాణ్ముఖుల్
సడిసనినట్టి నీ కొలముసాములు నామది నిల్తు రిత్తఱిన్

వీరులకోవ నీవు ప్రభవించుటఁ జేసి మహీస్వతంత్రతా
భేరిరవమ్ము ప్రమ్మి వినిపించినయంతన సంతతవ్యధా
గారము కారకుం జని జగాకడిమిన్ వెడలించి యంచితా
చారులమెప్పు లందితివి చాఁగురె! మేడురివంశవర్ధనా!

గాంధి గురుండుగా బ్రదుకఁ గంటివి, గాన నిరంతరక్ష మా
గంధము పట్టె నీ; కెదిరి కందనిపల్కు లభించె నీకు; గ
ర్వాంధుల కన్ను విచ్చువినయమ్ము వశంపడె నీకు; ధీరతా
బాంధవ మబ్బె నీకు, నయభద్ర! జయమ్ములు నీకు నిత్యముల్

మతము మఱచుఁ, గులము మఱచు, నిన్నెఱిఁగిన
వాఁడు, తనదునూరు నాడు మఱచు
నిక్కమునకు నీవు నిఖిల ప్రజాబంధు
మౌళి, వచ్చమైన మానవుఁడవు

తనిసిరి షష్ఠివర్షకలితమ్ము హితమ్మగు నీదుమన్గడన్
గనిన తెనుంగువారు నినుఁ గమ్మనికైతలతో సరాగముల్
తొనికిసలాడు దీవనలతో సురభిప్రసవ స్రగాళితో
గొనబులు చిందు కాంచనదుకూలపరంపరతో నలర్చుచున్

జనుఁ డొనరించుసేవ ఫలసంగము లేనిది యైననాఁడు, త
న్మనమున రాగవైరములు వ్రందిననాఁ డతఁ డన్యుదోషమున్
గొనక, గుణమ్ము నెంచ ననుకూలత సూపిననాఁడు, లోభమున్
దునిమిననాఁడు, వాని కకుతోభయవైభవ మబ్బు టబ్రమా?

జగమున దంభదర్పముల సందడి హెచ్చె, దురాశ రెచ్చె, నీ
సెగసె, ననార్యభోగకలనేచ్ఛ కడల్కొనె; సత్యశౌచముల్
దిగువకు వచ్చెఁ, బ్రేమ సెడె, దెప్పరముల్ పదివేలు మూడె; నీ
తెగులు నడంచి సంఘమును దిద్దు వలంతులె ధన్యతానిధుల్

ముం దపరిగ్రహమ్మునకు మూర్ధమువంచుట, దీనమానవా
నందము కోరి పెద్దయుఁ బెనంగుట, పట్టి పెనంగువారిపై
దుందుడుకుల్ దుమారములు ద్రోయకయుండుట, సత్యనమ్రతా
మందిరమై నుతుల్ పడయు మన్గడ గంటయు నేఁటి కృత్యముల్

తుంటతడిక పెట్టి గుంటూరు, వంగవోల్
వేఱువేఱు చేసినారు దొరలు;
ఏది యెట్టులైనఁ బోదుగదా కవి
బ్రహ్మ, శంభుదాస బాంధవమ్ము

ఇంకొకయర్వదేండ్లు జగదీడ్యపథమ్ము పదమ్ము నీకు న
భ్రంకషమైన కీర్తి నపరాజితమైనసుఖమ్ము గూర్చ ని
శ్శంక మనీషమై మనుము సభ్యమహాశయు లీసదస్సు -నల్
వంకలవార లీనుడు లవశ్యము పండు నటంచుఁ బల్కఁగన్

(19-4-70 - కదంబకైత)

## ❋ శ్రీ పేరుచూరి వేంకట సుందరవరదులు ❋

(న్యాయవాది - రామనగరము - తిరుత్తని తాలూకా - చిత్తూరు)

బహుముఖప్రజ్ఞ సాహితీపాటవమ్ము
విద్వ దారాధనేచ్ఛయు వెల్లివిరియ
వఱలుఁ బరుచూరి సుందరవరదు లాంధ్ర
తమిళభాషావిపశ్చితుల్ తనివి నంద

వరదు లలవోకగా నాకు వ్రాయుకమ్మఁ
దెలుఁగుఁ జెలువం బహో! గుబ్బతిల్లుచుండుఁ
జదురు మాపాలి దని జబ్బ చఱచువారు
మ్రాను దేఱెద రితని సామర్థ్య మరసి

ఎంత లాయరైన నితఁడు హాలికవృత్తి
నాదరించుచుండు నహరహమ్ము
శాంతి వలచు వంగసమువాఁడు కృషిక ధ
ర్మమునఁగాక యెందు రక్తిఁ జూపు? (13-9-71 - నా కథలు)

## ❋ శ్రీ యం. ఆర్. అప్పారావు ❋

(జమీందారు, నూజివీడు)

ఈవు పుట్టి యఱువదేండ్లాయెనా! యెంత
వింతగూర్చు వార్త వెడలె నేఁడు!
జవ్వనంపు బిగువు సడలమి కే యోగ
మందు కొంటి రంగయాప్పరాయ!

ధర్మువుదప్పని కోర్కులు,
నిర్మల జీవిత, మహంత నేర్వమి, నీకున్
*వర్మములై వార్థక వ *కవచములై
క్రోర్ముల నరికట్టె నందు నుర్వీరమణా!

నరులకడగండ్లు తీర్చినదొరలు కలరు
గాని మీ యప్పరావుచందానఁ బసుల
బాధలున్ దొలఁగించిన ప్రభువు లవనిఁ
గలరె ధర్మావతార మా తెలుఁగు ఱేఁడు

దోమలరాయిడి కడలెడు
గో మహిషచయమ్ము రుద్దుకొనఁ బ్రాంశుశిలా

స్తోమము కొల్లేటన్ బలు
భూముల బాఁతించె నతఁడు పొంగినకరుణన్

కవిపండితపోషకులై
కవితావైదుష్య రుత్ర్పకాశితులై వీన్
మివిలిరి మీ పెద్దలు; త
ద్భవితవ్యము నిల్పి తీవు ప్రాజ్ఞతకలిమిన్

రాచబిడ్డవగుట రాష్ట్రోపలబ్ధికై
యెల్లలేని సేవ కియ్యకొంటి;
వలఁతలోర్చి యోర్చి యాంధ్రమహాసభా
యాజమాన్యమూని యశము గంటి

ఈ యుగము ప్రజాతంత్ర వి
ధా యుక్తముగాన మంత్రితా గౌరవమున్
నీ యదియయ్యె సమాజ
శ్రేయము నర్థించి మెప్పుసెందితివపుడున్

విజ్ఞలోక మలర *విశ్వకలాపరి *ఆంధ్రవిశ్వవిద్యాయం
షత్తు నేఁడు నీ మహత్త వలచె
నఖిల విద్య లెసఁగి యాంధ్రశారదకీర్తి
ప్రబలుఁగాక నీదు పాలనమున

ఆయుష్యం బారోగ్యము
శ్రీయున్ బ్రాభవము నీకుఁ జేకూర్చుత! నా
రాయణుఁ డపారముగ; సుగు
ణాయతనప్రాయ! రంగయాప్పారాయా! (19-2-75 - కదంబకైత)

## ❋ శ్రీ యలమంచిలి వేంకటేశ్వరరావు ❋

(గాంధిశిష్యులు - పాముఱ్ఱు - కృష్ణా)

బాపుజీపదసన్నిధి బహుదినాలు
కాదు - బహువత్సరమ్ములు కడపి కడపి
మనుగడను దిద్దుకొన్న సజ్జనుని వేంక
టేశ్వరుని దెల్గువారెల్ల రెఱిఁగియుంద్రు

కల్లకు బాహిరంబయిన గాంధియుగమ్మునయం దహింసకున్
దల్లిగనున్న కాలమున దాస్యనికృంతన దీక్షతోడ అం

పిల్లిన వీరకోటి నొకవీరుఁడ వైతివి తెల్గునేల; నీ
తొల్లిటిపున్నె మీగరిమతోఁ దనిపెన్ నిను వేంకటేశ్వరా!

తెనుఁగునాటన కాదు గాంధేయ దీప్తి
సోఁకిన ధరిత్రినెల్ల నీసుకృతి కెంద
ఱెందఱో మహారథు లుందు రిష్ట లగుచు
నల్లవో! కానరానిమానవుఁ డితండు

అనితరలబ్ధ ప్రత్యయ
మనూనధీశక్తి యండయై నిలువంగన్
వనము నలవోక విద్యా
వనమును గావించు నిన్ను వర్ణింత్రు కవుల్

హిందీ భారతజాతిభాషయను పల్కేనాఁడు లోచూపుతో
గాంధీ పల్కె, మహాంధ్రమెల్ల నిది యుక్తంబంచు భావించె, నీ
చందంబున్ మదిమెచ్చి శిష్యకసహస్రజ్యోతివై క్రొత్త వా
పొందున్ నేర్పితి వీవు తెల్గులకు మెప్పుల్గంటి వాచార్యతన్

పొట్టకూటిచదువు నేర్పునట్టిబడులు
కలవు మన కూరనూరను, గలవు గాని
భుక్తికిని ముక్తికిని సరిపోవుతెలివి
నితని *విద్యావనమె శిష్యతతికిఁగఱపు
*పామఱ్ఱుచెంతకలదు

తోఁకలేనిక్రోఁతు లీకలాశాలకు
వచ్చి యచ్చమైనబ్రతుకు నేర్చి
కన్నవారి యెడఁదఁ గల వ్రేఁగు డించెద
రెన్న రానిచిత్ర మిట్టిమార్పు

నైతికసంపద మానవ
జాతికి రక్షక మటంచుఁ, జట్టుల జనకున్
రీతి సవరించుఁ బగలున్
రాతిరియును వేంకటేశ్వరగురుం డోర్మిన్

పోకిరుల చెల్మి మరగిన
నా కొడుకొక్కండు తిన్ననకు రా నీతం
డీ కొన్న యలఁత యసదా!
చేకుఱునా యిట్టిసహనశీల మొరులకున్

మచ్చలేని మానవులు నిర్మాణకార్య
కర్త లీనేల నెందఱో కలరు గాని
బిచ్చమెత్తక సంస్థలుఁ బెనిచి మనుచు
దంట లెందఱు కలరు నీవంటివారు?

ఇతఁడు పేదయయ్యు ధృతి, చిత్తశుద్ధి, లో
కజ్ఞతయును, గార్యకరణచతుర
మతియు, సేవనాభిరతియుఁ, బూన్కియు, నుంట
వెలితిలేని ధర్మవీరుఁడాయె

నరుఁడొకఁ డొక్కనాఁడు భువనస్తవ నార్హములైన కృత్యముల్
జరిపి, యతాత్మలేక దిగజాఱును గ్రన్నన వేంకటేశ! నీ
వరమరలేని పూన్కి జగదభ్యుదయ ప్రవణుండవై నిరం
తరముగ స్రగ్గుచుందు; గుఱిదప్పనియోగము నీకు లోపడెన్

లోకము వక్రమార్గములలోఁ బడె; రాబడి చూపుతక్క నీ
మూఁకను ధర్మదృష్టి లవమున్ గనిపింపదు; హింసకున్ నమో
వాకము లిచ్చుబుద్ధి పరివర్ధిత; మియ్యెడ నిన్నువంటి సే
వాకృతు లాయు రున్నతనిరామయజీవనులై మనన్ దగున్

నీడవోలె నిన్ను వీడక సేవించు
సతి సరస్వతమ్మ సంతసింప
నందికొనుము విద్వదాశీస్సు లింకొక
షష్టిపూర్తిమహము సాగు సభను (26-7-75 - కదంబకైత+)

## ❊శ్రీ జలగం వెంగళరావు ❊

(రాష్ట్రముఖ్యమంత్రి - ఖమ్మం)

తెలివి చాలదు, యుక్తిచాలదు
దేశమును పాలించువానికి
వలయు వెంగళరావు గుండియ
వాఁదిగలతనమున్.

అభయ మన్నది దైవసంపద
నాదిమం బని గీత పల్కెను
మంచి పనికిఁ దెగించువాఁడె
మానవోత్తముఁడు.

కట్టతెగి గోదావరీ ఝరి
కడలి పాలగువేళఁ పంటకు
చెట్టరానీనన్న యీనెఱ
జెట్టి కగుశుభముల్.

మంత్రిమండలి కొమ్ముగావఁగ
మహి వెలుంగు తెలుంగు లందఱ
నొక్కవేదికఁజేర్చి ప్రస్తుతి
కెక్కె నీదిట్ట. (మొదటి ప్రపంచతెలుగు మహాసభలు)

తరతరాల తెలుంగుపెద్దల
తపమునకు వెలలేని పంటగ
నాధికారికభాషయై తెలుఁ
గందె గౌరవమున్.

తెగువచూపి నదీనదమ్ముల
తగవులను దెగటార్చి రాష్ట్ర
ప్రగతి కండగ నిల్చిన జగా
ప్రగడ కగు జయముల్ !

విలయవార్ధులవోలె నెగసిన
విప్లవంబులు రెండు సమసెను
ఐదుకోట్ల తెలుంగుప్రజలో
హార్దములు పూచెన్.

తెలుఁగు సంస్కృతి వన్నె కెక్కెను
తెలుఁగు సంపద పొంగిపొరలెను
రాష్ట్రరమతోఁ దెల్గువానికి
రాణ చేకూరెన్.

ఆంధ్రభూమికి సాటిలేదని
యాంధ్రజాతికి నుద్దిలేదని
యెల్లరాష్ట్రము లుగ్గడించిన
వేకకంఠముగన్. (8-8-1976- కదంబకైత)

## ✲ రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి ✲

(రాష్ట్రముఖ్యమంత్రి-లోకసభస్పీకరు పదవులు నిర్వహించిరి-అనంతపురం)

మంచిమాట వింటి మన తెన్గుబిడ్డ సం
జీవరెడ్డి లోకసేవఁ బండి
యెదురు లేనిపోర నెక్కటిగెల్పుగాఁ
బడసెనట్టె! రాష్ట్రపతి పదంబు

ఇది చిన్నది యిది పెద్దది
యిదికీ డిదిమేలు నాక యీతఁడు పడవా
లెది కృత్య మనె హసా దని
యది చేసి గడించె నిమ్మహావైభవమున్

బడలి బడలి బీళ్ళు పండించి ప్రజకెల్ల
బువ్వఁ బెట్టు రైతె పుడమినేల
వలయు నన్న గాంధివాక్కు నేఁడు ఫలించి
భారతమున నూత్నపర్వ మొదవె

జయజయధ్వను లీనాఁడు షష్టికోటి
కంధరల సందడించి క్రక్కదలుఁ జదలు;
శివునికుత్తుకఁ గలకప్పు చెడెఁగదా త్వ
దీయ మహనీయ కీర్తి దీధితికి రెడ్డి!

ఏదికలదు కోర నెవ్వానికేని యీ
నేల నింతకంటె మేలిగద్దె?
ధన్యమయ్యె భావతభవమ్ము దేశమ్ము
రడ్డి! మనుము శతశరత్తు లెలమి (20-7-77 - కదంబకైత)

## ✲ శ్రీరామసేవక శ్రీ రాగం ఆంజనేయులు ✲

(రామనామక్షేత్రము - గుంటూరు)

తిక్కయజ్వ జనించిన *యిక్క యనుచు *భూమి
దేశభక్తుఁడు నెలకొన్న తిన్నె యనుచు
శారదాదేవి కొలువుండు సౌధ మనుచు
గారవించితి నిన్నాళ్ళు గర్తపురిని.

ప్రాయ మరుగ నరుగ రామనామక్షేత్ర
మెసఁగు పుణ్యభూమి యిది యటంచు

గొప్పతనము నిత్తు గుంటూరి కీ నాఁడు
తేఱి తేఱి బస్సు దిగినయంత.

ఎడఁద నలఁచు వ్రేఁగు సడలుఁ బొరింబొరి
ముసరి కలఁచు తమము ముడుఁగఁబాఱు
రాపులెల్లఁ దొలఁగు రామనామక్షేత్ర
దర్శనమున భవవిమర్శనమున.

నవభక్తిమార్గముల జగ
దవనప్రియు రాము నభవు నచ్యుతు రేయుం
బవ లిటఁ గొల్చుటఁ గాంచిన
నెవనికి నంతర్ముఖత్వ మేర్పడకుండున్!

అంగనా గాఢతరపరిష్వంగ జనిత
సౌఖ్యమె పుమర్థ మనువారు; చావెముక్తి
యనెడువారు; దేహమె యాత్మయనెడివారు;
మూఁగవోవరె యీక్షేత్రమునకు వచ్చి.

సుజను లెంద ఱెందఱొ దీని సృజనకై క
ఠోరమగు తపమొనరించినారు గాని
యెన్నవలె మున్నువీరిలో శ్రీశభక్తి
హత సమస్తాఘ సముదాయ నాంజనేయు.

ఆర్తసేవలేని హరిసేవ రిత్త; ని
ష్కామయోగనిష్ఠ కరఁచు వేల్పు;
నాదరింపవలయు నపరిగ్రహం; బన్న
సత్య మెఱిఁగినట్టి సాధు వితఁడు.

మచ్చమసరలేని మానిసి యగుట నీ
యన్న తలఁపు లప్పుడపుడె పండు
వేఁడివేఁడి ప్రజలు వేలువే లంపఁగా
నితఁడు తీర్చిదిద్దు నీ యయోధ్య.

రామసేవ నితఁడు సామీరి; కాన నీ
యాంజనేయునకు మదాంజనేయ
*కవిత నిడెదఁ గాన్కఁగా; రాగమన్వయుఁ
డీ కృతిన్ బరిగ్రహించుఁగాక!

*(హనుమాన్ చాలీసా - 1978)

## ✻ శ్రీ .వి. లక్ష్మీసుందరరావు ✻

(జాతీయపోరాటయోధుడు - బాపట్ల)

సుందరరావు దేశహితశూరతఁజాటు కుమారకోటిలో
ముందటిబంతినుండునని మున్నితనిన్ సవరించునాఁడు నా
డెందమునం దలంచితిఁ గడిందిగ నుబ్బితి నంత నీతఁ డ
స్పందజయేచ్ఛమై జననిబానిసమున్ దెగటార్పఁ జూచితిన్.

ఆశయసిద్ధికై యితఁ డహర్నిశమున్ బహిరంతరుద్యమ
క్లేశములెన్నియోసయిఁచి కేవల మాతృమహీస్వతంత్రతా
వేశవశంవదప్రకటవృత్తిఁ జరించిన నాఁటి గాథ లీ
దేశము విస్మరింపదనితెల్పుట కీసభ తారకాణయౌ.

విత్తము కాదుపెత్తనపువేడుక కాదు సవిత్రిసేవలోఁ
దుత్తుమురైన మానవుని తుష్టికిఁ బుష్టికి సోదరప్రజా
చిత్త మవశ్యమున్ వలయు, శిష్యుఁడు సుందరరావు పొందె నీ
యుత్తమగౌరవంబు హితులొజ్జలు మిత్రులు నుల్లసిల్లఁగన్.

ఈతని షష్టిపూర్తిసభ నీక్షయొనర్చుసదస్య సజ్జన
వ్రాతమొసంగు దీవనలబల్మి నితండుశతాబ్ద జీవన
ప్రీతమనస్కుఁడై ప్రజలపెంపునకై శ్రమియించు కుజ్జికున్
నీతులునేర్పుచున్ దెనుఁగునేల కపారయశమ్ముగూర్చుతన్!

## ✻ శ్రీ మఱ్ఱి చెన్నారెడ్డి ✻

(ఆంధ్రప్రదేశ్ మాజి ముఖ్యమంత్రి)

అఱువదియేండ్లకేమి శతహాయనముల్ మహనీయపీఠముల్
పరమసుఖమ్ములున్ గనుచు భారతదీప్తికి నంధ్రకీర్తికిన్
మెఱుఁగులుదిద్దుచున్ జనసమీహితధర్మ భరమ్మునోర్చుచున్
సరసకవిప్రశంసల నెసంగుము మఱ్ఱికులైక భూషణా:

రవితో సాగెదు లోకమున్ గొలువ; గార్లన్, జెర్లలో, రాణ్మహెం
ద్రవర క్షోణిని, హేమదుర్గనగరిన్, రాపూరిలో, గుత్తిలో
నవనిర్మాణ విధానముల్ గఱపి చెన్నారెడ్డి! రేప్రొద్దు వ
త్తువు గోల్కొండసభాప్రసంగమున కెందున్ జూడ మీ యోగమున్.

కటకమునుండి కంచిదనుకన్ నిఖిలాంధ్రము తావకాన్వయుల్
పటుతరదీక్ష సర్వజన భావుకసాధక దృష్టినేలి దిక్

తటములనింపినారు కవితామయముల్ జయగాథ; లమ్మహో
ద్భటులఁ దలంతు మిద్ధగుణభద్రు నినున్ దిలకించుపట్టునన్.

నలఁగి నలంగి తెచ్చుకొనినారము నిన్న సమగ్రరాష్ట్ర; మీ
కలిమినిజీల్చు టొప్పునను కర్ణకఠోరనినాదముల్ బయల్
వెలలెనదేమి? నేఁడిది వివేకముగాదని చాటి, నెయ్యముల్
నిలుపుము; జాతివైభవమునిల్పుము; నిల్పుముతెల్గుతేజమున్.

జాతికి నెగ్గువచ్చుపని సల్పఁగరాదు నరుండు, జాతికై
యాతఁడు స్వప్రయోజనమునాఁగి పెనంగుట నీతి, జాతిపెం
పే తనపెంపుగా నెద సహించుట వాని కవశ్య కృత్య, మీ
రీతియె శాంతిమూలము, ధరిత్రికిఁ దారక మీ సరాగమే!

"పొరపులు పోరులున్ మఱచి పూనుఁడు కర్జము నెందఱోదొరల్
చిఱుకిఱుముక్కచెక్కలుగఁ జేసినగడ్డకు నొక్కయేల్బడిన్
మెఱవణిగూర్పు ఁడన్న" ! లని మేనికవోష్ణపునెత్రుతోఁ గృతుల్
పఱపినవాఁడనౌట నిటుపల్కెద డెందము కొందలింపఁగన్.

గంగనుగౌతమిన్గలుపుకాల మదెప్పుడొకాని గౌతమీ
తుంగతరంగసహ్యసుతతోడను గృష్ణతరంగపెన్న తో
సంగడిసేయునట్లు కృషిసల్పుము; కార్మికహాలికప్రజా
మంగళదాతవై మనుము మంత్రిమణీ: సకలార్థసారణీ:

(20-11-78-చక్కట్లు)

## ❊ వాణిజ్యవేత్త శ్రీ యార్లగడ్డ వెంకన్న చౌదరి ❊

(కారంచేడు-గుంటూరు)

ఉన్నది నీకు నైహికసుఖోన్నతికిన్ దగినంత కల్మి; యీ
యున్నది యెల్లవారి దను నుత్తమసత్యపు గుట్టెఱింగి యా
యున్నది కోరి యీవిదెస కొగ్గిన మేటికి నీకు లేని దే
మున్నది వెంకనా! జగ మహో! యనసాగె భవన్మనీషకున్.

కలవారందఱు కన్నువిప్పి జగతీకల్యాణ మర్థించినన్
గలుముల్ పంచెడి ధర్మకర్తలగుచున్ గార్పణ్యమున్ ద్రోసినన్
విలయం బెద్దియు రాదు జాతికని మున్ వేమాఱు ఘోషించె నే
యలఘుం డాగురుమౌళి గాంధిని మఱా కార్జింతు వాత్మోన్నతిన్.

పదుగుర బాగునందె తన బాగు కుదుర్కొని యుంట గన్నవాఁ
డది యిది కాదు జన్న మన నన్యులకున్ దనచేయు మే లటం

చెదను దలంచువాఁడు పరమేశ్వరుఁడిచ్చిన చాతురుల్ సిరుల్
పదవులు సంఘసేవ కిడి పాయని శాంతికి నాటపట్టగున్.

చెంతకు వచ్చి విన్నపముచేసి కవుల్ కడుమెచ్చి డస్సినన్
సుంతయు ముట్ట ఁజెప్పుటకుఁ జూడని సాహు లనేకులుండ నీ
వెంత మనస్విహో కవులయింటికిఁ గాన్కలు దెచ్చియిచ్చి భం
గ్యంతర సాధుశీలమున కాస్పదమైతివి దాతృసత్తమా!

యతమార్గప్రియులన్ మహాత్ముల నహింసారాధనా సూనృత
వ్రతపారీణుల మెచ్చుమాదృశుల నవ్యాజానురాగమ్మునన్
మతిమన్మఖ్యు లిటుల్ భవాదృశులు సమ్మానింప జాతీయ సాం
స్కృతికఖ్యాతి సదాతనంబ యని పొంగెన్ దేశ మట్రాశియై.

(2-1-80-కదంబకైత)

## ❊ శ్రీ బెజవాడ గోపాలరెడ్డి ❊

(రాష్ట్ర ముఖ్యమంత్రి - కేంద్రమంత్రి
గవర్నరు-పదవులను నిర్వహించిరి) - నెల్లూరు

ప్రతిభటగర్వపర్వత విపాటనదక్ష సమీకచాతురీ
ధృత బహుమండ లాంధ్రజగతీభరులై వరణీయశీలురై
వితరణమూర్తులై బుధకవిస్థిరజీవన కారణమ్ములై
కృతిశతకర్తలై నుతివహించిన రెడ్లమహత్త నెన్నెదన్.

కాలము మాఱి హాలికుఁడుగా మనుచుండిననేమి ధారుణీ
పాలకలక్షణంబులను బాయఁడు రెడ్డి; నిజాన్వయప్రభుల్
ప్రోలయవేమరెడ్డి యనపోతమహీపతి వీరభద్రరా
ణ్మౌళిముఖుల్ ప్రియంపడినమార్గము లేమఱఁ డెంతవిజ్ఞుఁడో !

వాసి కెరవైన బెజవాడవంగడమున
రాణకెక్కెను పట్టాభిరామరెడ్డి;
యితఁ డుదారగుణమ్ములకెల్ల నెల్ల,
యితఁడు మకుటము లేని మహీవిభుండు.

పల్లెల్ పట్టణముల్ సెబా సనఁగ నీ పట్టాభిరామాహ్వయుం
డెల్లన్ధర్మము లాకళించి తనపల్కే తీర్పుగా నర్థకా
మోల్లాసంబున హద్దుమీఱిన జనవ్యూహంబులన్ దిద్దుచున్
మల్లీమంజులమంజరీధవళిమన్ మాయించెఁ గీర్తిచ్ఛవిన్.

తగవులు తీర్చితీర్చి యలఁతం గను నీపెద రెడ్డికొల్వులో
నెగయును భారతీచరణనిష్ఠిత నూపుర కింకిణీ ధ్వనుల్;
జగమునఁ బేరుగన్నకవిసత్తము లుత్తమ వైదుషీనిధుల్
సొగసరికైతలన్ వినుచుచో రసచర్చలకున్ గడంగుచో.

కవులకుఁ గాన్క లీగి యనఁగా మనరెడ్డికి దొడ్డపండువై
నవనవహర్ష మిచ్చు; నొకనాఁడు మొగమ్మున మొల్కమీసలున్
గవియని రాయప్రో లితని కట్నములందె వధానవిద్యలోఁ
దగినమెఱుంగు చాటి, కవితానిధిసుబ్బన జంటగా నిలన్.

తనగార్హస్థ్యముపంటగాఁ గనియె నీధన్యుండు సాబర్మతీ
మునిధర్మంబు రవీంద్ర భావగతి దుర్మోహారువల్లీ నిశ్చం
తనశక్తం బరవిందదర్శనము నంతశ్శుద్ధిమై మెచ్చునం
దనులన్ మువ్వుర శిష్టతుష్టికరకృత్య స్తుత్య చారిత్రులన్.

ఈముమ్వురలో నొకఁడై
శ్రీమద్గోపాలరెడ్డి చెలఁగెన్ భరత
క్ష్మామాతృ దాస్యవిదళన
కాముకతన్ సారెసారె కారలఁబడుచున్.

కొనియాడందగు రాజకీయపదముల్ కోకొల్లగా నబ్బినన్
దనడెందమ్మును సాహితీ సరణికిన్ దత్తమ్ముఁ గావించుటన్
దెనుఁగుంబల్కు వెలంది పెంపునకు నర్థిన్ డయ్యు నిమ్మేటి; యిం
త నెఱామన్గడ నేర్చియున్ మఱవఁడేనాఁ డేని నమ్రత్వమున్.

ఏరెడ్డిమఱచె వినయ ర
మా రమ్యగుణంబు నితఁడు మఱచుటకు; నహం
కారప్రియు లాత్మస్తుతి
పారీణులు గాని రెడ్లు పడయుదురు సిరుల్.

కులము మతము మఱచి గోపాలరెడ్డి మా
నవత నాశ్రయించినాఁడు గాన
నవత యితని బ్రదుకునన్ నిరంతరముగా
నుజ్జ్వలించు నవఁత యుండ దెపుడు.

సమతానురక్తి సాహి
త్యము పెట్టినభిక్ష; సకల ధరణీస్తుతిపా
త్ర మహాకవి రవిగురు కృప
నమరిన భాగ్యంబు రెడ్డి కని యూహింతున్

ఉత్తమోత్తమ పదముల నున్నరెడ్డి
కహితుఁ డొకఁడైన లేమికి నబ్రపడెద
నీసుతోఁ గుందు మహి నుదయించువాని
కింతకంటెను ధన్యత యేమి వలయు?

పావనభావపేటి పితృపాదులపేర నితండు నన్ను సం
భావనచేసె నిద్ధకవిపండిత మండితమౌ సదస్సునన్;
ఈ విభవం బణంకువమెయిన్ గొనువాఁడ, దెనుంగు వాణికిన్
సేవలొనర్చువాఁడ నని చేతులుమోడ్చు సదస్యకోటికిన్

శంఖమునఁ బోయఁ దీర్థమై జల మపార
మహిమమున్ గనురీతి సమ్మాన మిది "అ
కాడమీ" ముద్ర వడి కడున్ గణుతి గాంచి
నన్నుఁ దనియించె ననెద నానతుఁడ నగుచు (27-1-80 -
కదంబకైత)

## ✳ శ్రీ మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి ✳

ఎందఱులేరు నేఁడు సుకవీంద్రు లఖండకవిత్వరాజ్య సం
క్రందను లంధ్రవిశ్వజనగౌరవభాజను లట్టివారిలో
నెందఱ కబ్బె నీకు లభియించిన యించిన కూర్పునేర్పు లో
సుందరరామశాస్త్రి! నినుఁ జూచుటె పండువు తెల్గువారికిన్ (పఱిగిపంట)

## ✳ శ్రీ కొనకళ్ళ వేంకటరత్నము ✳

పంకజభవతరుణీపద
కింకిణిరవమై, రసజ్ఞకృత నుతిభరమై
వేంకటరత్నము గేయము
బింకము వెడలించుఁ దెనుఁగుపేఁటల నదిరా? (సమదర్శి)

## ✳ శతావధాని శ్రీ సి.వి. సుబ్బన్న ✳

పావిత్ర్యప్రథితాంధ్రసంస్కృతకలా పాథోనిధాన త్ప్రభా
భావప్రస్ఫుటహర్ష కారణముగా భాషావధూటీప్రియ
గ్రైవేయమ్ముగఁ గైతసెప్పి గెలుపున్ గాంచెన్ వధానక్రియన్
సీ.వీ. సుబ్బన ధారణాకుశలతన్ చీరాలపట్నమ్మునన్
(సమదర్శి)

## ❊ సి.పి. బ్రౌను ❊

మూల్గుచున్నకృతుల ముద్రించె; నిర్భర
క్లేశమోర్చి సల్పెఁ కోశరచన;
తెలుఁగువానికంటె వలదుగా నాంధ్రిని
గొలిచెఁ బుణ్యరాశి విలిచె బ్రౌను, (సందేశసప్తశతి)

## ❊ శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రి ❊

కపటమెఱుఁగని విద్వదాఖండలుండు
పండితకవీంద్రుఁ డౌదార్యమండితుండు
సరససాహితీవ్యాఖ్యాతృచక్రవర్తి
మేలి నుడితీరుపరి వెంపరాలశాస్త్రి (సందేశసప్తశతి)

## ❊ మధురగాయకుడు శ్రీ ఘంటసాల వేంకటేశ్వరరావు ❊

అతఁడు గొంతువిప్పినంతన *దక్షిణా *చల్లని పైరగాలి
నిలము వీచుఁ, దేనె తొలఁకఁబాఱు,
నార్తుఁడగుట, నీశ్వరాన్వేష్టయగుట, నీ
కమ్మఁదనమునందె ఘంటసాల

## ❊ శ్రీ యలవర్తి రోశయ్య ❊

(ప్రిన్సిపాల్ - జాగర్లమూడి, కుప్పుసామి చౌదరి కళాశాల, గుంటూరు)

ఆశలఁ దూల్చు నింద్యముల; నన్వహమున్ గురుధర్మరక్షణా
వేశము దాల్చు సత్యపదవీనదవీయసియైన వాణికిన్
గోశముగాఁ దనర్చు; బుధగోష్ఠికి వార్చు; నెలర్చుఁ గైతకున్
రోశయ; శాంతిసౌఖ్యరుచిరుం డగుఁగాక యితండు నిశ్చలున్!

తెలుఁగునేర్ప నేమ దిట్టల మనువార
లడలుచుంద్రు రోశయాఖ్యుఁ గదియఁ
గలఁడె యింగిలీసు కఱపెడి యాచార్య
సముదయమున నిట్టి సవ్యసాచి!

మఱపునంబడి కాదు కా; దెఱుకలేక
వ్రాసినాఁడను మును *''యశోవంత'' మనుచు *(యశస్వంతము-ఒప్పు)
దోసమును దీనిఁ దెల్పిన ధీసముద్రుఁ
డితఁడ *మేవడిమైఁ దన కేకతమున *వినయముతో

చిన్నయసూరినామ మునిచెన్ దనపట్టికిఁ; జాలుఁ జాలు నీ
యెన్నిక తెల్గుమేల్మికొఱ కీతఁ డొనర్చు తపమ్ముఁ జాటఁ; దాఁ
బన్నిన కమ్మయున్ వెలఁది పల్కులకున్ గుదురై రహింప నీ
యన్న పెనంగు; శౌచ మఖిలాశల లాస్యము సల్పు వీనికిన్

తన కొకరీతి యున్నదని తా నొకసంస్కృతి కండదండగా
మనుట యవశ్యకార్యమని మానసవీథిఁ దలంపు మాని నేఁ
డనుచిత మార్గముల్ వలచు నజ్ఞజనావళి నల్వరింతకై
మనవలె రోశయాదులు సమాత్తవివేకు లనేక వర్షముల్!

(29-9-81 - కదంబకైత)

## ❈ గుంటూరు గాంధి శ్రీ వట్టికూటి వేంకటసుబ్బయ్య ❈

(సర్వోదయ నాయకుడు - దొప్పలపూడి, గుంటూరు)

ఏ నతఁడెవ్వఁడో యెఱుఁగ, నిద్దఱ మేపనులో కదల్చుటన్
బైన మొనర్చుచుంటి మొకబస్సున; నాకెలనన్ దనర్చు న
మ్మానిసి యెండ వానలకు మాల్గని కేవలహాలికుండుగాఁ
గానఁబడున్, గడున్ బెదరు, గారవ మార నతండు నన్గనున్

మోహవలాహకప్రతతి మూఁగినడెందముతో, రజోగుణ
స్నేహముతో, నహంకృతివిశీల చరిత్రముతో, దయార్ద్ర వా
ద్రోహసమీహలేక, యకుతోభయతన్ దిరుగాడు నన్ను, మీ
*వ్యాహృతి లెస్సదిద్దెనని వంచెద నౌదల మీ మొగమ్మునన్ *కావ్యము

కట్టిఁడిమాసి జాతిపితగాంధిని జంపిననాఁడు పల్లియల్
పట్టణముల్ విషాదమున, పట్టుగ దీల్పడునాఁడు, మీరు మీ
వెట్టనుజాటఁ *బల్కిన కవిత్వము నన్నొకమంచిబాటకున్
బిట్టు మరల్చె నిట్లు, పెదపిన్నల నెందఱిఁ జక్కదిద్దెనో!

*("అమరజ్యోతి" కావ్యము)

లేదులేదు ననుం గదలింపనట్టి
పద్య మొకఁడేని నయ్యనవద్యసృష్టి
నదిర! *"క్రుళ్ళిన యెముకకై" యెనెడి సీస
మన్నిటను మిన్నయనెద నాయనుభవమున

*ఈగ్రంథములోని "మహాత్మకథ" కవితలో కలదు

కర్మఫలేచ్ఛలేని గుణగణ్యుఁడు *వెంపటియింటిపంట, సా
బర్మతియోగిసత్తమునిభక్తుఁడు యుక్త*వినో_పథప్రియుం

డర్మిలి నాచరించుపను లందఱమేలు వరించుకార్యముల్
నేర్మికి సూత్రపడ్డసరణిన్ బచరించెద నేఁడు మీకృపన్
*(డా॥ వెంపటి సూర్యనారాయణ - *వినోబాభావే)

దొప్పలపూఁడియందు నిలుతున్, నను వేంకటసుబ్బయాఖ్యతోఁ
జెప్ప జనమ్ము, నా కెదురుసెప్పటకొల్లని యాలుబిడ్డలున్
జొప్పడినారు, లేమివెతసోఁకనిగేస్తుఁడ, వట్టికూటి నా
నొప్ప గృహాఖ్య నాది, తమ రొజ్జలు శిష్యుఁడ నేను సత్కవీ!

ఆపయనం బిటుల్ మధురమై నను, సుబ్బయ మిత్రుఁజేయుటన్
నాపనులాఁపి యీతనిఁ గనన్ బయనించెద నప్పుడప్పు; డీ
కాఁపునుగంట యోగివరుఁగంట, విపన్న సమాజసేవకై
బాపు తలంచినట్టి గుణభద్రునిగంట, యగున్ మదాత్మకున్

ఒకనాఁడు నడివీధి నూడ్చుచున్ గనిపించు
మునుకొన్నదుమ్ములో మునిఁగిమునిఁగి
ఒకనాఁడు గుంటదీయుచుఁ గనిపించు గు
టుక్కని క్రుళ్ళినకుక్కఁ బూడ్వ
ఒకనాఁడు గొడ్డటినొడ్డుచున్ గనిపించుఁ
ద్రోవఁ గ్రమ్మినరేఁగు దుడు కడంప
ఒకనాఁడు చిఱుపాఱ నుఱుకుచున్ గనిపించు
గుడిచెంతఁగల పెంటకుప్ప లెత్త

మోయలేని ఖాదీవల్వమూటతోడ
నూరువిడుచుచుఁ గనిపించు నొక్కనాఁడు
పదుగురకు లగ్గుచేకూర్చుపనికిఁ దక్క
సుబ్బయ కడంగఁ డీనాఁడు సొంతపనికి

ఆర్యసమాజధర్మ మిపుడౌనను సుబ్బయ, గోపదేవు నా
చార్యకులావతంసము నచంచలభక్తి భజించు, నాత్మ సౌం
దర్య నిదాన వైదిక విధాన సుఖమ్ము గడించు, నింద్రియా
నార్యత నార్చు, నోర్చును మహత్ప్రణుతాశ్రమమున్ దృతీయమున్

మతమెదియైన సుబ్బయకు మానవసేవ ప్రధానధర్మ, మీ
కృతమతి దీని నించుఁ బరమేశ్వరసేవగఁనెంచు, నార్తునం
దితనికిఁ దోఁచు రాముఁడు, రహీము, నెహొవయు;నిక్కతమ్మునన్
జతపడె మాకు నెయ్య;మిది సాగు నిరంతరనూతనద్యుతిన్

తానై విత్తము లెస్సగానొసఁగి విద్యాశాలలన్ నిల్పె, మి
త్రానీకంబున బంధుబృందమున దానాసక్తి గల్గించి, వి
జ్ఞానశ్రీపరిపుష్టికృద్విధులు విజ్ఞంజేసి, యభ్యాగమ
క్షోణిన్ దిద్దెను, వట్టికూటి సుజనస్తోమంబు సేబాసనన్

సత్య మహింస నిర్భయత చాగము యోగము నేర్పఁజాలు, సా
హిత్యము దెచ్చితెచ్చి యితఁ డెండుచు, నానుచు విక్రయించి సౌ
హిత్యము గూర్చుఁ గర్తలకు; నీదృశుఁ డూరికి నొక్కఁడున్న దౌ
ర్గత్యపుఁ దాఁకులేక మనఁగల్గుఁగదా సుకవీంద్రబృందముల్

ఒకసభకో వివాహమునకో పొరుగూరికి నేగుచున్నఁ బు
స్తకములసంచి వీడఁడు, బజాఱుల దిద్దుటకైన సాధన
ప్రకరము విస్మరింపఁడు, నిరంతరసేవయ మేటివిందుగా
సుకముల మిన్నగాఁ దలఁచు సుబ్బయ సాధుపథానుయాయియై

బ్రతుకిటు చక్కదిద్దుకొనుప్రాజ్ఞుఁడు సుబ్బయతేరుసాగ, నం
చితగుణధామ రామతులసీశుభనామ గణేయహేతు; వీ
యతివ మగం డొనర్చుపను లౌనని మెచ్చు, నితాంతదీక్షమై
నతిథులఁగొల్చుఁ, బెన్మిటికినబ్బిన మిక్కిలికల్మి నాఁదగున్

మన్ననసేఁతకున్ దగినమానిసి వేంకటసుబ్బయాఖ్యుఁ; డీ
మన్నన పెండెరంబిడిన, మాన్యములిచ్చినఁ, బట్టమిచ్చినన్,
బ్రన్ననిసేలుగప్పిన, సెబా సనిపించుకొనంగఁ జాల; దీ
యన్నయశంబు నిల్పుటకు నంచితమైన కవిత్వమే తగున్

రావయ్యా! సర్వోదయ
సేవావ్రతలోల! మధురశీల! మదీయం
బీ *వాణి నందు కొనుమా!
శ్రీ వేంకటసుబ్బయా! వశీకృతహృదయా!

ఇది సకలార్థసంకలిత, మెల్లమతమ్ములనిగ్గు, బాపుజీ
బ్రదిమికి దర్పణం, బిహపరప్రమదమ్ములఁగూర్చు నొజ్జ, కో
విద, కవి, మాననీయ పదవీనదవీయసియైనభాషకున్
సదనము, నీవు మానిసికి సల్పినసేవ, కుపాయనం బగున్

## ❋ బుద్ధుడు ❋

పుట్టినయింటి రాచసిరిపొంగులు, జవ్వనపుంబసందు,చే
పట్టినరాణిచక్కనలు, పాపనితీపి దొఱంగి, దైన్యపుం
గుట్టలు గూల్చి, లోకమునకున్ సుఖశాంతులుగూర్పఁ గావులం
గట్టిన శాక్యసింహుని వికస్వర వీరగుణంబు మెచ్చెదన్

మూర్ఖ లొకవంక, జగమును మోసపుచ్చి
బ్రతుకు వా రొకవంక, భారత ధరిత్రి
నున్ననాఁడు-జనమ్ముల నుద్ధరింపఁ
బుట్టెఁ బురుషోత్తముఁడు, శాక్యభూపమౌళి;
అసఘుఁ డాతఁడు వేదశాస్త్రాదు లెఱిఁగి;
తపమునం బెద్ద డస్సి, సత్యమునుగాంచి,
బుద్ధుఁడయ్యె, నహింసా ప్రబోద్ధయయ్యె,
కరుణకున్ దీవి యయ్యె, లోకమును గొల్చు
వానికే నిక్కమగు ముక్తి వచ్చునన్న
దివ్యసందేశమును జాటు దిట్టయయ్యె;
వర్ణము లడంగెఁ, గులములు వదలెఁ, జదువు
లింటికింటికి వచ్చె, నెయ్యెడను గన్నఁ
దియ్యములు నెయ్యములు పొంగె, దిక్కు లేని
పక్షి యయ్యెను మూఢవిశ్వాస, మొక న
వీన భవ్య ప్రపంచ మావిర్భవించె,
శాక్యముని వాక్కుతో సుఖశాంతులెసఁగె;

వెతకు నిల్లు జగము; వెతకున్ గతము కోర్కి;
కోర్కి సమసినపుడు కూలు వెతయు;
మంచిచూపు, తెలివి, మాట, మున్నగునవి
మణఁచుఁ గోర్కి ననియె మారజిత్తు (బుద్ధుడు)

బుద్ధుఁడీ భారతమ్మునఁ బుట్టఁడేని
మేక లావుల మందలుగాక, నరులు
నెందఱో చావుమూడెడి, దింద్రలోక
సుఖము నర్థించు వెడఁగుల సురియచేత (1-11-1981)

## ※ దేశభక్త శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ※

(విజయవాడ)

నూఱేండ్లనాఁడు పుట్టిన
వారలకే చెల్లె నిప్పువలె జీవింపన్;
పోరాము లెట్టి వైనను
సైరించిరి వీరు దేశజననీసేవన్

వలచి నూనూఁగు మీసాల వయసు నందుఁ
గడఁకమై ధరించిన వీర కంకణంబు
నయ్యదేవర కాళేశ్వరాభిధుండు
విప్పఁడయ్యె నహెూ! మేను విడుచుదనుక

బానిసమునఁ గ్రుంగు భారతదేశంబు
విక్రమించి విశ్వవీథి నిల్చి
శిరము నెత్తఁ జాలు తరుణమ్ము రా నితం
డియ్య కొన్న వెతల కెల్ల కలదె?

మొగజోదు లిట్టిదిట్టల
తెగువఁగదా కనె సబర్మతీఋషి జయముల్
పగ నణఁచి పగతు నణఁపక
జగదద్భుత సంగర ప్రసాధకుఁ డగుచున్

సేవ కిష్టపడక యీవి నెఱుంగక
రాచపరువు నందఁ జూచువారు
తెలియవలయు నయ్యదేవర చరితంబు
నలయవలయు జాతి కహరహమ్ము (1-1-82 - కదంబకైత)

## ※ ఇంజనీర్ డా॥ కె. యల్. రావు ※

(కేంద్ర ఇరిగేషన్ శాఖామంత్రి - విజయవాడ)

కే.యల్.రావు దరిద్రతాహతజనక్షేమార్థి, సాంకేతిక
శ్రీయోగప్రవిభాసి గాసిపడి తేల్చెన్ మున్నె-గంగాసరి
త్తోయస్ఫారఝరిన్ గవేరతనయా తోయంబునం జేర్చినన్
మాయున్ భారతభూజలార్తి యని ధీమంతుల్ బలారే యనన్.

వేలవేలకోట్లు వెచ్చింపవలయు నీ
జన్నమున కటంచు సచివచయము
జంకరాదు, ప్రజలసాయ మవ్వారిగా
వచ్చు నిందుఁ గనకవర్ష మనఁగ

శ్రమదానపరాయణులై
క్షమఁగల యువజనులు, గురులు, ఛాత్రులు దీనన్
జెమరోడ్తురు తగునాయకు
లమరినచోఁ, బ్రజలు సైఁతు రలఁతల నగుచున్.

రాము సద్గుణాభిరాముని జూచి వా
నరులు కడలిఁ గట్టినారు మున్ను;
గాంధి నాత్మశౌర్యకంధిని గని మొన్న
త్రోలినారు తెల్లదొరల నరులు.

నదులివి సంగమించిన ననంతమహిన్ బహుధాన్యముల్ పదిం
బదిగ ఫలించు, ఊలపయిఁ బండును రాజనముల్, క్షుధావ్యథన్
మదిచెడియున్న మానిసులు మంగళమూర్తులుగా రహింతు, రీ
సుదినము రాక భారతవసుంధరకున్ శనిపోక నాఁదగున్.

(11-3-82-కదంబకైత)

## ❊ శ్రీ వెలువోలు సీతారామయ్య ❊

(జాతీయపోరాటయోధుడు, కవి, కళాశాలస్థాపకులు, తెనాలి-గుంటూరు)

శ్రీ 'వెలువోలు' కులోదధి
జైవాతృక! సజ్జనప్రశంసితచరితా!
కోవిద కవి మండల గో
ష్ఠీ వికసిత హృదయపద్మ ! సీతారామా!

గమ్య మాశ్రయణీయమ్ము గ్రామ మనుచు
నడిపెఁ గాంగ్రెసురథము నేనాఁడు గాంధి
పూనె నానాఁడ 'వెలువోలు' పుణ్యవంశ
రత్న మరమరలేక స్వరాజ్యదీక్ష

వాడవాడల బాపూజీవాణి వినిచి
నరకసఖమైన చెఱసాల నిఱికియిఱికి
పురుగు లురలెడి "దేవతాపులుసు" త్రాగి
వేఁగె నిర్వీరుఁ డాగర్భభోగి యయ్యు

(జైలుపులుసునకు"దేవతాపులుసు" అనిపేరు)

రాజకీయవర్గరణము దారుణముగా
సాగినపుడు 'శాంతి, శాంతి' యనుచు

దుండగీంద్ర పోట్లతోఁ జచ్చి బ్రదికిన
పురుషుఁ డితఁడు పుణ్యచరితుఁ డితఁడు.

జాతీయత కేనాఁడో
*హూతి యొసంగినది 'యమృతలూ; రయ్యది యా *పిలుపు
సీతారామయ్యను గని
యాతత యశమున్ గడించె నాంధ్రధరిత్రిన్.

ఇతనిదేశసేవ కితనివితీర్ణికి
వెలుఁగుదెచ్చె వీని వినయనిష్ఠ
కోరకున్న నితఁడు గుంటూరి సీమకు
నేత యయ్యె శుభవిధాత యయ్యె.

చాలూఁజాలు నొక తెనాలికలాశాల
యితని లోకహితమనీషదెలుప
వెలయవచ్చు రేపు విశ్వకలాపరి
షత్తుగా నుదాత్తసరణి నిదియు. (వి.యస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కాలేజి)

గద్య పద్య సృష్టి కావించి నీవును
జేసినాఁడ వాంధ్రిసేవనమ్ము;
ఉచితశైలి వెలయ రచియించినట్టి నీ
"ప్రేమ" కావ్య మది సుధామయమ్ము.

నా కవితాసరస్వతి ననర్ఘసువర్ణమహాభిషేక సు
శ్రీక నొనర్పఁగాఁ బగలు రేలు నలంగినవారికెల్లఁ గ
న్నా కయి నీ వహెూ! నిలిచినాఁడవు నాఁడు; తదీయ సంస్కృతుల్
నాకు నిరంతరమ్ముగ మనమ్మునఁ గ్రమ్ముకొనున్ సుహృన్మణీ!

ఆ మధురానిభూతి కతమై పచరించిన మామకీన నా
నాముఖ ఖండకావ్యరచనమ్మునయం దిది "పైరపంట"; ధ
ర్మామృతపూరవర్ధితము నక్షరరూపమునై తనర్చు; నీ
శ్రీ మెఱయింప నెంచితి విశిష్టమతీ ! భవదంకితమ్ముగన్.

పైరపంట క్రొత్తబాటఁ సాగినకైత
నేర్మియున్నవాఁడు నియతభాష
నందఱకును తెల్లమగుచందమున వ్రాయ
వచ్చు నన్న తెలివి నిచ్చుకైత. (పైరపంట-1964)

## ❊ శ్రీ మంతెన వేంకటరాజు ❊

(జాతీయపోరాటయోధుడు,ఎమ్మెల్యే, - మంతెనవారిపాలె-గుంటూరు జిల్లా)

ముద్రల్ కోట్లకొలంది వెచ్చపడినన్ ముంగైముగామున్న సం
విద్రాజుల్, సరకార్లు, విశ్వపరిషద్వీథుల్ ప్రఘోషించినన్
నిద్రంబాయనిపల్లెటూళ్ళ కెవఁ డున్మేషమ్ము సంధించె నా
భద్రాకారు సబర్మతీఋషి నెదన్ బ్రార్థింతు శుద్ధుండనై.

ఈ పరతంత్రజీవనము నెట్లు సహింతురు, విశ్వమెల్ల ను
ద్దీపితమై స్వతంత్రత కతీవకృషిన్ దలదాల్చి మానరే
ఖా పరిపుష్టమయ్యె, త్రిజగంబులగెల్చినవారిబిడ్డ లీ
యాపదనుందురా యని మహాత్ముఁడు పల్కె నుదాత్తధర్మమున్.

అతనిపల్కు వినుచు నంతవా రింతవార్
కన్నువిచ్చి రెల్ల కడలయందు
మెఱసె నపుడె మొలక మీసాల వేంకట
రాజు కరమునందు రణపతాక.

వేంకటరాజనన్ దెలుఁగువీరులలో, జగతీహితక్రియా
కింకరకోటిలోఁ, బ్రచురకీర్తి గడించిన కోడెగాండ్రలో,
నంకిలిలేనిపట్టుదల కందియవైచిన ధీరజాతిలో,
వంకరరాని మన్గడకు వార్చి జయించిన జోదు నాఁదగున్.

మతకులభేదముల్ మఱచి, మానవులందఱు నొక్కతల్లి సం
తతి యని విశ్వసించి, జనతాపరితాప నివృత్తికై అనా
రతముగ డస్సి డస్సి, యపరాజితశౌర్యము వెల్వరించి, యీ
కృతమతి యెల్లవారలకు కేవలబంధువుగా నుతుల్గనెన్.

ఆశయసిద్ధికై యితఁ డహర్నిశమున్ బహిరంతరుద్యమ
క్లేశము లెన్నియో సయిఁచి కేవలమాతృమహీ స్వతంత్రతా
వేశ వశంవద ప్రకటవృత్తిఁ, జరించిననాఁటిగాథ లీ
దేశము విస్మరింపదని తెల్పుట కీసభ చాలు సాక్షిగన్.

ఒక్కనాఁడు తెల్గుముక్కలు నాల్గు
నానోట విన్న వినయపేటి, మేటి
<u>విజయరామరాజు</u> విశ్వహితం బీ (<u>ఎమ్.ఎల్.ఎ</u>)
సదస్సు గూర్చి లెస్స తనిపె నన్ను (స్మారకసంచిక - 1983)

## ✲ శ్రీ గుత్తికొండ రామబ్రహ్మము ✲

(జాతీయపోరాట యోధుడు-మోపఱ్ఱు-గుంటూరు)

సహజంబుల్ ధృతి శాంతి సత్య శుచితా సత్త్వాదు లెవ్వాని, క
న్వహ మెవ్వాఁడు పరోపకారఘటనా వాల్లభ్యమున్ సైఁచు లో
కహితాచారులనెయ్య మెవ్వని ననర్ఘశ్రీబలెన్ దేర్చు, న
మ్మహనీయాశయు గుత్తికొండకుల రామబ్రహ్మమున్ మెచ్చెదన్.

గాంధియుగమున మోపఱ్ఱు కన్నకీర్తి
జగ మెఱుంగు మెఱుంగు; శ్రీచంద్రమౌళి
తులసిబా యితఁ డితరయోధులును దీని
కండగా నిల్వఁ బండువుల్ పండు నిట్లు

సారతరప్రవర్తనులు జాతివికాస పరాయణాత్ము లూ
రూరఁ దెలుంగునాట జయహో! జయహో! యనుచున్ సబర్మతీ
తీరమహర్షి సేనల నతీవ వితీర్ణికి నుత్స హించుచున్
జేరెడునాఁడు దాస్యము నిసీ! యనునాఁడు త్రివర్ణకేతన
స్ఫారమయూఖముల్ నలుదెసన్ విరియన్ రణవీథికేగి దు
ర్వారపరాక్రమక్రమ విరాజితుఁడై ఋతభారతీ కృపా
భార వినమ్రుఁడై పరనృపాలక గర్వనిరాసక క్రియా
పారగుఁడై ప్రజావళి సెబాసన నిల్చెను గుత్తికొండ; క
ర్పూర పటీర హీర సురభూరుహ శీతన గామరాపగా
శారదకౌముదీ రజతశైల మరాళ ఫణీశ కాంతులన్
మీఱు యశమ్ము నేలుకొను మేటిగ నిల్చెను గుత్తి కొండ; యీ
వీరుఁడు తల్లిదీనదశ వీడెను లే యని గుఱ్ఱుపెట్టెనా
తోరము విప్పెనా వెతలఁదోఁగు జనమ్ముల యార్తనాద మీ
ధారుణి లేనినాఁడె, జనతావదనమ్ము వికాసరేఖలన్
సౌరు వెలార్చునాఁడె ప్రతిసద్మమము నందు సుఖంబు శాంతియున్
మూరిననాఁడె యీ సుకృతమూర్తి విడున్ దన కంకణమ్ము; నీ
పేరిమి వచ్చుదాఁక ప్రజపెంపునకే చెమరోడ్చెదన్ వయో
భారము లెక్కసేయ నని భావెగురుండు విధించు సేవలో
నోరిమి చూపుచున్ జిఱుతయుంబలె సాగుచు నిత్యనుత్య గం
భీరత చాటుచున్ సిరులు పెంచుట గద్దెవరించు టెన్నఁడుం
గోరక దారిదప్పుప్రజకున్ గతిఁజూపుచు నాత్మజీవితం
బూరికిఁ బట్టణమ్మునకు నొజ్జగఁ జేయును గుత్తికొండ; యీ

భూరి వివేక సంపదలఁ బొంపిరివోవు నుదాత్తశీలు తీ
రారసి చంద్రమౌళిముఖు లార్జవశోభితు లీ మహాసభం
గూరిచి యిమ్మనస్వి గుణకోటిని మెచ్చి మనమ్ములిచ్చి స
త్కారముసేఁత గాంచి కవితాసతి పొంగి కరంగి నాదెసన్
గారుణికత్వముం బఱపెఁ గాన జయించితి, రిత్తగా సభన్
జేరనివాఁడనైతి; సుఖసేవధిగా మనగుత్తికొండ నూ
ఱాఱు శరత్తు లుండు నని యాశిషముల్ పచరించి యీ సభా
స్తారులకున్ జొహారువులు సల్పి యిఁకన్ విరమింతు నీ కృతిన్.

(15-7-83-కదంబకైత)

## ❋ శ్రీ కాకరపర్తి వేంకటేశ్వర్లు ❋

(ఎల్.ఐ.సి. చీరాల)

నన్ను ననుగ్రహించెఁ గరుణామయి విద్యలరాణి వాణి, నా
పున్నెము పండె నంచుఁ - దనపొత్తున నిల్చువయస్యకోటితోఁ
దిన్ననిబాటలో గురుతఁ దీర్చుతఱిన్ మన వేంకటేశ్వరుం
డన్ననుడుల్ - *రమారమణి కాగ్రహమున్ గలిగించెఁ,గోడలిన్ *లక్ష్మీదేవి
మన్ననచేఁత సైఁపఁగల మంచితనమ్మును దవ్వుచేసె, నీ
పిన్నకు భారతీకృప లభించిన మేడలు మాడ లుండెనా
*యన్నువ సాయమున్ జలుపు నాబిడ కింతపొగడ్త చెల్లునా? *అల్పము
పెన్నిధు లిచ్చి, దాని మఱపించెదఁ గాఁకరపర్తిసత్కులున్
దన్ను భజించువానిఁగ నొనర్చెద, మార్చెద నంచు లక్ష్మి తాఁ
గ్రన్నన వీని నన్యపథకాముకుఁ జేసె నె.లై.సి. కొల్వులో
నెన్నికనందఁజేసె, గడియింపు మిఁకన్ ధన మిచ్చదీఱ, నీ
విన్ననలెల్ల జాఱ నని, వెంకన కర్మిలి చాటె; నీతఁడున్
మన్నికసేయఁగాఁ దగినమార్గము వీడక, *పూఁటకాఁపు ల *(ఏజంట్సు)
భ్యున్నతచిత్తు లౌట, నెఱియున్ సిరియున్ గడు సంతరించెఁ,దా
నున్నపదంబునం దనరుయోగ్యులలో గణనీయుఁ డయ్యె, సం
పన్నిధు లెందఱో కననిప్రాభవమున్ గనెఁ గల్మి కీవియే
మున్నగురక్ష యన్ననుడి మూఁగినయర్థపు గుట్టెఱుంగుటన్
బ్రన్ననికర్జముల్ సలిపె బ్రాజ్ఞు లహెూ! యన, లోకసేవలో
విన్ననువున్ వెలార్చె, నిది వీక్షయొనర్చి *పయోధికన్య య *లక్ష్మీదేవి
న్నన్న! మదీయమైనదయ నందెను గాఁకరపర్తి కీర్తి నం
చు న్నినదించుఁ, గాని నుడిసుందరినెమ్మియు నుంట, దుర్విధుల్

పన్నక నీచభోగపరిపాటికి నాదర మీక, యర్థ్వమౌ
తెన్ను లెఱింగి, సజ్జనవిధేయత నేర్చి, రమాప్రసన్నతన్
గన్నపసిండి సార్థకముగా నొనరించె నితం డటంచు వి
ద్వన్నికరంబు పల్కు; నిది తథ్యము; నిమ్మయపట్టి పెద్ద లీ
కొన్నపథంబు మెచ్చుచు నకుంఠితముల్ జయముల్ గడించుచున్
*వెన్నునిలేమకున్ సుకృతవేదిక శారద కర్చసేయుచున్ *లక్ష్మీదేవి
స్విన్నతలేని జీవనము చేకొనుఁగాక శతాధికాబ్దముల్ (8-6-82)

పిన్నవు నీవు ప్రాయమునఁ; బెద్దను నే; నటులయ్యు సర్వదా
న న్నలరించు భావములు నా నుడికారము తీరుతెన్నులున్
ని న్నలరించుఁ గానఁ దన నిక్కపుశిష్యుఁడ వైతి వీ; వవి
చ్ఛిన్నముఁ జేఁతకై జతన చేసెద నీ రుచిరానుబంధమున్

కాఁకరపర్తి నిమ్మయకు గాదిలిబిడ్డఁడ వైన నీకు మా
ధ్వీ కమనీయశీల సముపేతము జీవిత మబ్బె నద్దిరా!
నీ కవితాప్రియత్వమును, నీ సరసత్వము, నీ వినీతియున్
నీ కృతబుద్ధియున్, దనుపు నిచ్చలు నా మది వేంకటేశ్వరా!

అటుగానన్ బహుమానమై తనర నీ కస్మత్కృతిన్ దీని "నె
క్కటులన్" మక్కువమై నొసంగెదను, నాకా! యింత వ్రేఁ గంచు నో
హటిలన్ బోకుము, తెల్గులెంక కొక లెంకై వాసిగన్నట్టి నీ
విట జంకం బనియేమి? సాధుతరసాహిత్యార్చనప్రీణధీ !

పదుగుర సంతుష్టింగని
ముదమందెద వీవు, లోకమోహనగుణ మి
య్యది, నీకు నైకశుభములఁ
గదియింపన్ మనుము చిరము ! కాకరపర్తీ ! (1984)

## ❊ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ❊

బ్రహ్మవిద్యగుట్టు పామరజనకోటి
చేతి యుసిరికాయఁ జేసి చేసి
నతులు నుతులు గన్న నవభారతమహర్షి
వీరగురునివెల్గు వెలయు సతము.

మతము కులము లేని మానవతావాద
మాదరించె నిమ్మహాశయుండు;
కన్నువిచ్చె నితని తిన్నని పల్కుతోఁ
గొలఁదిలేనిజడతఁ గుందు వెలఁది.

అంటరానితనము గెంటనిచో జాతి
బాగుపడదు; దీని యోగు సెడదు;
తమ్ములార! లెండు! ధర్మానుసారులై
నడువుఁ డనియె నిమ్మనస్విమౌళి.

నాయందుఁ గలదు బ్రహ్మము;
నీయందున్ గలదు; జగము నిఖిలము బ్రహ్మ
శ్రీయుతమే యని చాటిన
ధీయుతు నీపోతులూరి దేశికు నెంతున్.

తత్త్వవేత్తల బోధన ద్రఢిమఁ గాక
సాంఘికక్రాంతి రాదు శాసనముకతన;
పుట్టె నీ కోవలో నాఁడు పోతులూరి;
అవతరించెను నేఁడు మహాత్మగాంధి. (చక్కట్లు - 5-3-84)

## ❋ శ్రీ గవిని సీతారామయ్య ❋

(ఆదర్శ హైస్కూల్ హెడ్‌మాస్టర్, వేజెండ్ల, గుంటూరు)

అతఁడేబ్రహ్మ యతండెవిష్ణు వతఁడే యార్యాప్రియుం డాతఁడే
శ్రుతిసూచించినతత్త్వ మంచు బహుధా శోధించి ప్రాజ్ఞుల్ గురున్
బ్రతిపాదించిరి తద్గురుత్వమున శోభన్గన్న నిన్ జూడ సం
తత సమ్మోదము మాకగున్ "గవిని సీతారామ" ధీమన్మణీ!

గురుఁడొక యోగమూర్తియయి కుఱ్ఱల దిద్దిననాఁడె దేశపుం
గరిమము హెచ్చు, జాతికి వికాసము చేకుఱు, నెన్ని చట్టముల్
పఱపిన, నెన్నికావ్యములు పల్కిన, వీని యొసంగు వెల్గు-స
ద్గురుఁడు ఘటించు తేజమునకున్ సరితూఁగమి నిక్కమే కదా!

*ఛాత్రుని దిద్దిదిద్ది జయశాలి నొనర్పఁగఁజాలు *దేశికుల్ *శిష్యుడు
*గురువు
ధాత్రి ననేకు లుందు రిది తథ్యమ, కాని తదీయజీవన
క్షేత్రము సంస్కరించి గుణసేవధిఁగా నతనిన్ యశఃప్రభా
పాత్రుఁగఁ జేయు దేశికులు పల్వురు లే రవనిన్ భవాదృశుల్

ఛాత్రుఁడు విద్యలో బ్రదుకుచందములో గణనీయుఁడై యశః
పాత్రత గాంచుటెట్టులను భావనతో నితఁడద్దిరా! పగల్
రాత్రియు విస్మరించి పలురాపులు సైఁచి కృతార్థుఁడై సభా
స్తోత్రములందెఁ బామరులు సోమరులున్ గనువిప్పనం బడన్.

నిష్కలంక చరిత నేర్చిన రైతువం
గడమునందు నీవు పొడముకతన
దక్కె నీకు నింతధర్మాభిరతి; నిన్ను
గారవింప నిదియె కారణంబు.

ఒక్క యమాత్యపుంగవుఁడొ, యొక్క కలెక్టరొ నిన్నుఁ జూచుచున్
మ్రొక్కి విధేయతన్ మెఱసి, మున్ నను విద్యలలోఁ, జరిత్రలో
మిక్కిలి సంస్కరించితిరి మీరు, పదం బిది నాకుఁ దక్కె మీ
*యక్కటికంబుచేత; నని యన్నపు డీ వెన్నిమార్లు పొంగితో!

*దయచేత

ఒజ్జతనమ్మునం బడయు నుత్తనుసంపద లిట్టిపొంగు; లో
సజ్జనమౌళి! నీ కివి వశంపడ, నిచ్చలు శాంతిసౌఖ్యముల్
విజ్జఁగ బంధుకోటి తనివిన్ గన, మిత్రులకోర్కి పండ, ను
దృజ్జయదీప్తితో నిలువుమా! శతవత్సరముల్ జగమ్మునన్

## ❋ హైకోర్టు న్యాయమూర్తి శ్రీమతి ఆచంట అమరేశ్వరి ❋

(అప్పికట్ల - గుంటూరు)

శ్రుతులు ఋషుల్ మహాకవులు సూనృతవాదులు ధేనువుల్ పతి
వ్రతలు వదాన్యతారతు లవారణవత్సలతా సమగ్రలై
సతతజయమ్ము నీకొసఁగ సర్వజనస్తవనార్హవై ప్రజా
హిత నయరక్షసేయు మమరేశ్వరి! విశ్వము మేలు మేలనన్

నీవు హైకోర్టుజడ్జివై నిన్ను గన్న
యప్పికట్లకుఁ గాక సర్వాంధ్రమునకు
సకలభారతమునకు యశస్సు నిడితి
విట్టి నిను మెచ్చి పడసెద మేము తృప్తి

హస్తిపుర ధర్మపీఠమం దధివసించు
యోగమున్నది నీకు, నత్యుక్తి గాదు
ఎచట నే గద్దెపైనున్న నీవు మమ్ము
విస్మరింపకు వైదుషీవిభవధన్య!

అతివల పెంపు దేశమునకాయువుపట్టని, తల్లితీరు సం
తతికి నవశ్య మబ్బునని, నాతి వికాసము దేశగౌరవో
న్నతికిఁ బ్రధానహేతువని నమ్మి శ్రమింతుము మేము, మాకు నీ
కతమున బుష్టి తుష్టియును గల్గునుగాక నిరంతరమ్ముగన్

కలశాబ్ధికన్యకా కమ్రగండాభోగ
  చిత్రితమకరికాపత్రమైత్రి
నీహారగిరిసుతా నిటలస్థ కాశ్మీర
  కుంకుమశ్రీఘుమంఘుమల చెలిమి
కమలాసనప్రియా కర్ణవేష్టన తటీ
  బద్ధ ముక్తాఫలప్రభల పొత్తు
పాకశాసనసతీ బంధుర ధమ్మిల్ల
  పారిజాతలతాంత బాంధవంబు

మానితాచార సంప్రదాయానుకూల
శీలసంసక్తవైన నీపాలి వగును;
రెండు కోవలవారికిన్ దృప్తిగూర్ప
వఱలు మమరేశ్వరీ! శతవత్సరములు (20-1-1985 - చక్కట్లు)

## ❋ శ్రీ యమ్. వి.వి.యస్. మూర్తి ❋

(పారిశ్రామికవేత్త - యం.పి - విశాఖ)

*మతుకుమల్లి వంశ మంజులోద్యాన వ *(వీరవెంకటసత్యనారాయణమూర్తి)
సంతమూర్తి; నీకు జయము; జయము;
నిత్యసత్యశౌచ నిర్భయార్జవ మహ
స్సురుచిరాత్మ; నీకు శుభము; శుభము;

ఎన్నఁడుఁ జూడనైతి నిను, నీవు చరించు పథంబెఱుంగ, నీ
సన్నిధినుండు నెచ్చెలుల జాడయుఁగాన, మదంబ వాణియే
నన్నెఱిఁగించె నీకు; నభినంద్యపదమ్మున నిల్పి 'తుమ్మలన్'
మన్ననసేయుమీ; యనియే మాన్యమతీ; పలుమాటలేటికిన్?

నిర్జరలీల మద్యశము నిల్వఁగ మామకసంజ్ఞ నాంధ్ర నా
గార్జున విశ్వభారతుల కర్థము వేలకు వేలొసంగి వి
ద్యార్జనగణ్యులౌ యువలకా సిరితోఁ బతకమ్మొలిచ్చు న
ట్లూర్జితపద్ధతిన్ నిలిపి యుర్వికిఁజాటితి నీ వివేకమున్

అతిరథులున్ మహారథులునైన బుధుల్ వరణీయ సాహితీ
చతురులు సత్కవీశ్వరులు చాఁగురె! భూసలిలా భ్రపద్యలన్
గుతుకమెలర్ప నీవు సమకూర్చు సదస్సున కేగుదేర వి
శ్రుతి గనియెన్ విశాఖపురి సుందరవాఙ్మయతీర్థరాజమై

నీ సారస్వతసేవన ప్రవణతన్, నీ నిర్భరౌదార్యమున్,
నీ సంకల్ప శుచిత్వమున్, మధురవాణీనిష్ఠ, నీ నమ్రతన్
నీ సంతృప్త్యదజాతశత్రుత నొగిన్‌వీక్షించి లోకమ్ము నీ
వాసిన్ గోరెడిచుట్టమై నిలిచె; దివ్యజ్జీవనాలంబనా!

శ్రీకటమంచిరెడ్డిబుధసింహము నన్ గొనియాట హేతువై
నా కవితాపటుత్వమును నాయశమున్ విపులంబులయ్యె, నేఁ
డా కృతిపేర వెల్గెడి మహాభవనమ్మున నన్ను గౌరవ
శ్రీకు నొనర్చి ధన్యతముఁ జేసితి; నీతలఁపింత యొప్పనే!

సాంబశివరావు సభ నేలి సభ్యకోటి
తనియ నమృతమ్ముపిదికె వాగ్ధారలందు;
అన్యులకు నిట్లు గావించుటరిది గాని
సాజమేకద "ఆవుల" సత్కులునకు

అంచితరాజవంశమున నాంధ్రసరస్వతి సేవలన్ నుతుల్
గాంచిన రాజవంశమున గల్గిన పీ.వి.జి. రాజుచేతఁ జే
యించితి సత్కృతిన్ సదసు "జే" యన నీవలె నౌచితీవిధిన్
మంచినవారిఁజూడఁ గవిమండలి డెందము కందళించెడిన్

ననుఁగనిలోక మేకరణి నవ్విన వెక్కకురాక వీఁకమైఁ
జినపెదకర్జముల్ వలచి చేసితిఁ బెక్కు ఫలేచ్ఛ తక్కి; యై
నను మును గేలి చేసిన జనంబుదరన్ ఫలమిట్లు దాత్తమై
మునుకొని వచ్చె నాకు గిరిమోసినవానికి లక్ష్మియుంబలెన్

వలచిన వానికిన్ ఫలమువచ్చుట దబ్బఱ, కాని ధర్మువున్
గొలిచి యసంగ యోగమునకున్ దలవంచిన వానిచెంతకున్
ఫలమది రాక నిక్కమని పల్కిన పెద్దల పల్కులెన్నఁడున్
వెలవెలపోవు; సత్యపదవిశ్రుత! విశ్వజన ప్రియవ్రతా!

పావిత్ర్యరాశి నీసతి
సావిత్రి, తదీయ భావ సఖ్యంబున నీ
భావములు పండినవి; నీ
త్రోవలు నిష్కంటకత నుతుల్గనె మూర్తీ!

వెన్నకు దీటు వచ్చుమది వెల్వడి వేలుపుఁదోఁటలోని తే
నె న్నిరసింపఁ జాలునుడి నివ్వటిలన్ ననుఁబల్కరించి యీ
పున్నెపుదీవి యీ వినయ భూషిత నాదెసఁ జాటు పేర్మితో
గ్రన్ననఁ దూలె నాబడలికల్ శతకుంజరసత్వ మేర్పడన్.

నీ గెలుపుల్ సదా వలచు నెయ్యరి, తియ్యనికైతలో యశ
శ్రీ గనినట్టి దిట్ట, శుభలీల విశిష్టుఁడు, రంధి సోమరా
జాఁగని పట్టుతో నిలిచె నస్మదుదీర్ణత నాసచేసి యీ
భోగము నాకు దక్కె గుణభూషణతోషణ! నీ కతమ్మునన్.

తగ సహస్రచంద్రదర్శను నన్నింత
మెచ్చి మేలికాన్క లిచ్చినట్టి
నీకు రెండువేల నెలలాయువగుత! నీ
యాలుబిడ్డలకు నయమ్ము లగుత!

"సాహులు ధర్మకర్తలయి సంపదలన్ జగతీహిత క్రియా
వ్యూహముపాలుచేఁతవలయున్; సుఖశాంతులు రావురావు లో
భాహితచిత్తవృత్తులకు" నన్నమహాత్ముని పల్కు మెచ్చు నీ
*యీహలు మోహబంధముల నిగ్గడి స్రగ్గడి వారిఁ దేర్చుతన్!

*కోర్కెలు (31-12-85-చక్కట్లు)

## ※ ప్రజాబంధు శ్రీ ప్రగడ కోటయ్య ※

(జాతీయ పోరాట యోధుడు - నిడుబ్రోలు-గుంటూరు)

దైవమిచ్చిన సంపద తనువు తెలివి
యెవఁడు వెచ్చించు జనతా హితేచ్ఛతోడ
నతఁడె గణనీయుఁడగు వానిబ్రదుకె లోక
మాన్యమగు ధన్యతాదీప్తిమంజు వగును.

ప్రగడాన్వయుఁడీ కోటయ
పగలిది యిది రాత్రియన్న భావము లే, కే
దిగు లెఱుఁగక మొగజోదై
నెగడె మహోద్యమములన్ మనీషులు మెచ్చన్.

స్వాతంత్ర్యము నార్జింపఁగ
రైతుల కార్మికుల పెంపు రాఁబట్టఁగఁ జే
నేఁత పనివారిఁ దేర్పఁగ
నీతఁడు పడినట్టివెతల కెల్లలుగలవా!

ఇతని దీవింప నలరింప నెందఱో మ
హారథులు డస్సి విచ్చేసినారు సభకు;
కోటయాఖ్యుని మన్గడతోఁట నేఁడు
విరిసి జగతికి నెత్తావి విందు గూర్చె.

చిన్న పెద్దపీఁట లెన్నోలభించె నీ
ప్రగడ, కౌనుగాని, *ప్రగడ పీఁట *మంత్రిపదవి
దక్కవలయు నద్యతన భావి; నిది సదా
వడయ వలయు నెల్లకడల జయము.

కూడు గుడ్డకాదు గూఁడు గాదు సమాజ
మునకు ముందు వినయముద్ర వలయు;
సచివులైనవారు చాలినవా రిది
రేయి పవలు విస్మరింపరాదు

కలలు నిక్కంబు లగు శుభకాల మిపుడు
వచ్చినది, దైన్యమున గ్రుంగి వగచు ప్రజకు
దొరలు వీరికి వెచ్చించుసిరిసమస్త
మందవలయును, వీరికే చెందవలయు.

పాడిదప్పి కల్మిపడసి గ్రుచ్చులవోలె
బ్రదుకువారి కిహము పరములేదు;
ఎల్లయెడల జాటు మీనీతి నిచ్చలు
గెలుతు వీవు ప్రగడ కులవతంస!

ప్రగడకోటయ్య సుఖ పరంపరలతోడ
వెండియున్ డెబ్బదేండ్లు జీవించుఁగాక!
ఇతనిసేవల జనచయం బెసఁగుఁగాక!
ఇతనిత్రోవల విజయంబు లిగ్రుచుఁగాక! (అభినందనసంచిక-1985)

## డా॥ కె. సదాశివరావు

(ఆస్పత్రి రజతోత్సవ సందర్భమున గుంటూరు)

కాసరనేని దంపతులు కాసులకంటెఁ బ్రజా సపర్యకున్
వాసియొసంగి రేపవలు వందురు వందల వేల రోగులన్
గాసికి దవ్వొనర్చి నవకాంతి సమగ్రులఁ జేసి ధన్యతా
భాసురులౌట సజ్జనుల పాలిటికిన్ శుభవార్తయై తగున్.

స్రుక్కువాని కష్ట సుఖములు తనవిగా
నరయువాఁడె వైద్యుఁడనఁ దనర్చు
నీ కఠోరనిష్ఠ నిరువది యైదేండ్ల
దాఁటిగెల్చెనటె! సదాశివుండు.

ఎంతమేటియైన నేమి యీడాక్టరు
గెలువఁ గలఁడె చెలువ చలువలేక
ఓ జయప్రదాంబ ! *ఆజానజములైన      *పుట్టుకతో వచ్చినవి
నీదు నోర్పు, నీదు నేర్పు నెంతు.

ఆలుమగలార! లోకసేవానుకూల
జీవనాసక్తులార! మీత్రోవనెల్ల
రాదరింపఁగఁ బరమాయురాదులంది
మనుఁడు నిర్భరకీర్తి సంపదలఁగనుఁడు

విడుమరలేనివృత్తిగొని వేసరుచున్నసదాశివుండు నల్
గడల-కవుల్ బుధుల్ తనియు కైవడి సాహితికొల్వు నీకొనెన్,
విడిముడికే బడల్పడెడి వెజ్జులు వీని యెడంద, వీని మ
న్గడ పరికించి, విశ్వహితకార్యధురంధరు లౌట యొప్పుగున్.

(అమెరికా పర్యటనకు వెళ్ళుచున్నతఱి)

అమెరికా తెల్గువారు ని న్నామతించి
మంచిపనిచేసి, రీవు తన్మానసముల
నుచిత సరణికి మరలించు నొజ్జవగుట
కాంచిరి సదాశివాఖ్య! లోకజ్ఞ ముఖ్య!

మనసోదరు లే దీవిని
మనుచున్నను మాతృభాష మఱవక పెంపున్
గనవలె నని పరిషత్తుల
వినిపింపుము మధురవచన విన్యాసములన్.

మనరాజనీతి విశ్వ
ప్రణయము నర్థించు, నీసు పజ్జకు నెపుడున్
జన దని *"రీగన్" సచివా      *అమెరికా అధ్యక్షుడు
గ్రణికిన్ మృదులోక్తి నుడువు కాసర నేనీ!

హస్తిన కరాచి చుట్టము లగుట కొఱకు
నమెరికా రషియా మిత్రు లగుట కొఱకు
దారుణ రణార్తి ధాత్రికిం దప్పు కొఱకు
బడలు మని పల్కు మా జగా ప్రగడతోడ.

నీ సాహిత్యార్చన జన
తా సేవానిష్ఠ, వైద్యదర్శనమర్మ

శ్రీసిద్ధియు రాణించుట
కాసింతుము నేఁడు విద్వదభినంద్యమతీ!

(19-6-85-అభినందనసంచిక)

## ❋ శ్రీతాతా వేంకటసుబ్బయ్య ❋

(ఆదర్శ హెడ్‌మాస్టరు, నిడుబ్రోలు-గుంటూరు)

తాతా వేంకటసుబ్బయాఖ్యునకు విద్యారాశికిన్ దేశిక
వ్రాత గ్రామణి కీకృతిన్ శుచితరవ్యాహారహృద్యాకృతిన్
జేతోమోద మెలర్పఁగాఁ నుపదఁగా జెల్లించి సంఘర్షమున్
ద్రోతున్ ధర్మపరాయణుల్ సుకవిచంద్రుల్ పెల్లురంజిల్లగన్.

ననుఁదనియించె నీతనిగుణంబులు సూనృత ధీరతా దయా
వినయ వితీర్ణిముఖ్యములు విశ్వజనస్తవనోచితమ్ము లీ
యనఘునితోడుతన్ గతిపయాబ్దములొజ్జగ నుంటఁజేసి, నా
మనసిటువంటి సజ్జనులమైత్రి వరించునదౌటఁ జేసియున్.

సంపదనిచ్చి, మెచ్చఁదగు చాన నొసంగి, యుదాత్తరీతులన్
బొంపరివోవుపుత్రులను బుత్రికలన్ దయచేసి, వాసిలో
వంపులులేని బంధుహితవర్గముఁగూరిచి, వేల్పు, సుబ్బయన్
బెంపరిగేస్తుఁజేసె నరుపెంచినఁపుణ్యము రిత్తవోవునే?

ఒకపట్టి న్యాయవాది కదంబకమునఁ బే
        ర్వడె మల్లికార్జున్వర ప్రసాదు
ఒకపట్టి వైద్యవృత్తికి వన్నెలిడె నుదా
        రత బాలకృష్ణవరప్రసాదు
ఒకపట్టి పడసె శస్త్రకలాధిక ప్రవీ
        ణత సత్యనారాయణప్రసాదు
ఒకపట్టి నేర్చినేర్చి కలెక్టరై ప్రజా
        మాన్యతం గనియె రామప్రసాదు.

చదువునందు, సదాచార సరణియందుఁ
గూఁతులల్లురు యశమందుకొనిరి లెస్స;
గేస్తు లెందఱు కీతృప్తి విస్తరిల్లె?
సుబ్బయా! నీదు ధన్యత్వ మబ్బురంబు.

అగునగుఁగాని మానవున కైహికసౌఖ్యములెన్నిదక్కినన్
దగిన సుఖంబు 'సోఒహ' మనుదారికి వచ్చిననాఁడె దక్కు; నీ
ప్రగతివశంపడన్ దపముపట్టుమనున్ మనధర్మ; ముత్తముల్
పొగడువిధాన నిప్పనియుఁబూని యణంచితి వింద్రియోద్ధతిన్.

కష్టసుఖముల సమదృష్టిఁ గానఁదగిన
పరమ భాగ్యముగా స్థితప్రజ్ఞ భావ
మెన్నఁడో కల్గె నీ; కిఁక నెఱుకగుట్టు
గోచరించుట చిత్రమా శౌచరాశి!

నేఁటి తత్త్వవేత్తృ నికరంబునన్ దొలి
గద్దె నలరు యతి జగద్గురుండు
చిక్కె నీకు నదిర! చిన్మయానందుండు
కన్నువిప్పునొజ్జగా మనస్వి !

సాదులు భారతీయమగు సంస్కృతికిన్ నినువంటి గేస్తునిన్
మూదలగా వచించెదరు; మోహమునం బడి క్రుంగు బేలయున్
నీదెస మన్ననల్ పఱపు; నెచ్చెలి! యెచ్చట దై వసంపదల్
ప్రోది గనున్ జగం బచటఁ బువ్వులు చల్లుట సాజమే కదా!

కొన్ని మెఱుఁగులు నాపట్ల నున్న నేమి
కరఁగుదున్ నినుఁ జూచి నీ సరణిఁ జూచి
హేతువిది కాఁగ సుబ్బయా! యీ కవిత్వ
మంకిత మొనర్తు నీకు; నౌ ననుము చాలు.

"నలుగురమెప్పు గన్న నరు నాకృతికిన్ బతిఁగా నొనర్తు" నన్
పలుకెపుడో వెడల్చితిని; బాములనైనఁ దదుక్తికండగా
నిలిచితి గెల్చితిన్; నియమనిష్ఠలనోర్చితిఁ, గర్మయోగమున్
వలచితి సుబ్బయాఖ్య! ఫలవాంఛ యెఱుంగని కైసరుండనై.

నీ, నా మడుఁగుంజెలిమికి,
నీ నా తలఁపులకు, మాననీయాచార
శ్రీనిరతికిఁ "జక్క" ట్లివి
కానంబడు నానవాలుగా నిఁక సుకృతీ! (చక్కట్లు- 9-4-1987)

## ❋ శ్రీ తూమాటి దొణప్ప ❋

(శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ కులపతి)

అఱువది యేండ్లు నిండెను దొణప్ప కటం చనువారిమాట ద
బ్బఱ యనఁజాలఁ గాని యెలప్రాయపునిగ్గుల నీతఁ డుంట క
చ్చెరువడెదన్; సదాశయవిశిష్టుని డాయ జరాపిశాచికిన్
వెఱపు జనించునేమొ నిజవిక్రమ మక్రమమై తొలంగఁగన్.

బాసలుపెక్కునేర్చి ప్రతిభానిధిగాఁ దెనుఁగుందపస్విగా
వాసిగడించి, తల్లినుడి వాకొనునర్థపుగుట్టు చాటి, సే
బాసని పెద్దలాడఁ బరభాషపదమ్ములఁ దేల్చి పల్లెలన్
గాసిలు పాట కాటకు వికాసముగూర్చి దొణప్ప పేర్గనెన్.

ఎందఱో సాహితీవ్రతు లితనియాన
నంధ్రకవితాంబుధిన్ ద్రచ్చి రలఁత కోర్చి
యెందఱో పరిశోధకు లితనిముద్ర
నుత్తమోత్తమ పట్టంబు లొంది రదిర!

మమత సమత గడించి 'తూమాటి' మేటి
యోగి యయ్యెఁ జిదానందభోగి యయ్యె;
ఆత్మశక్తి సమగ్రున కందరాని
ఫలము లేదు సమీచీన బలము లేదు.

పాలకపాలితుల్ తనియుభంగి దొణప్ప తెనుంగు విశ్వవి
ద్యాలయసేవ సల్పుచు నిరంతరసౌఖ్యము లందుచున్ యశః
శ్రీలకు నాలవాలమగు జీవిత మేలుచుఁ బ్రాజ్ఞకోటి మే
ల్మేలన నిల్చుఁగాక మనమేదిని నింకొక షష్టివర్షముల్!

(సన్మానసంచిక - 12-8-87)

## ❈ కేరళ కేలప్ప ❈

(వైకము సత్యాగ్రహము 1925 మార్చి)

ఆనాఁడు దక్షిణభారతావని యందు
రహిఁ తిరువాన్కూరు రా జేలుమహిని
వైకమన్ పేరఁ బిల్వంబడు నూర
సూరుల కిరవైన శ్రోత్రియమందుఁ
కేలప్పనాఖ్యుఁ గాంగ్రెసుపనుల్ దీర్చు
నంచితాశయరాశి యాజమాన్యమున
సాగె నుత్కటమైన సత్యాగ్రహంబు;

అగ్రహారపువీథులందుఁ గొన్నింట
మాలలు మాదిగల్ మడమ నానింప
రాదను కట్టెడ రక్కసుపనుపు
తరతరంబులనుండి తలయెత్తియుంట
నిది దారుణాచార, మిది నిషేధ్యంబు
త్రోయందగున్ దీనిఁ ద్రుంగింపఁదగును
కదలుఁడీ, నావెంటఁ గదలుఁడీ, యనుచుఁ
కేలెత్తి, జేకొట్టి, కేలప్ప నడువ
నవమానహతిఁ గుందు నాసీమజనులు
నవమాన నంపాదనస్పృహం గదలి
వైకమునం దెల్లవాడలన్ నడువ
బంధింపఁ దొడఁగి రేల్బడివారు వీరి;
మోహనుం డిదివిని మోదఖేదముల
కగ్గమై బిఱబిఱ నచ్చోటుచేరి
కేలప్పసేవలఁ గీర్తించి, చెఱల
కేగినవారెల్ల రిలుచేరునట్లు
నగ్రహారమ్మునం దన్నివీథులను
నరమాత్రులందఱు నడయాడునట్లు
విభు నియ్యకోలందె విశ్వ మౌననఁగ.

(గాందిగానము-1987)

# జాతి గర్వించదగ్గ మహాకవి

"సర్వతంత్ర స్వతంత్రుడౌ సత్కవీంద్రు డెన్నడో కల్పమున కొక్కడే లభించు" - తెనుఁగులెంక, అభినవతిక్కన, గాంధి ఆస్థానకవియైన తుమ్మలసీతారామమూర్తిగారు తెలుగుజాతికి, సాహిత్యమునకు 20వశతాబ్దమునందు లభించిన అపూర్వమైనకానుక. వారు కవితాహిమాలయము; పాండితీ మేరునగము, వారు ప్రతిభావంతులేగాదు, వ్యుత్పన్నులు కూడ. వారు ఆకారములో ఆంధ్రుడు; ధర్మములో భారతీయుడు; భావములో విశ్వమానవుడు. వారు ధర్మసంరక్షణార్థము కవితలల్లిన ఋషితుల్యులు. వారు ప్రాతక్రొత్తలవేలుకలయిక. ఆధునికాంధ్రసాహితీజగత్తులో వారు యుగధర్మమునుగుర్తించి, స్వతంత్రమార్గమున పయనించి, యుగకవితను సృష్టించిన యుగకవులు, వారి కవితలో యుగధర్మమును విశ్వరూపమున గాంచగలము. వారు కవిత్వమును సమాజసేవాసాధనముగా భావించి, "సామాజిక కల్యాణము కామించెద నవ్యభవ్యకవితా సృష్టిన్" అని ప్రకటించి, వారు రాజకీయ, మత, సాంఘిక, ఆర్థిక,నైతిక విలువలపరిరక్షణకొరకు చైతన్యవంతమైన కవితను సృజించిన సాహితీప్రవక్తలు. వారు ఆంధ్రావళిమోదముకొరకు జగద్ధితమైనకవితను కళాన్వితముగ గానముచేసినారు. వారి కవిత వ్యవస్థలన్నింటికి సంగమస్థలము, సమధర్మము సహజధర్మమని నమ్మి, సమకాలీన సమస్యలను స్వీకరించి, వాటికి పరిష్కారమార్గములను సూచించుటయేగాక, సార్వకాలీనత నిచ్చినారు. వారి కవితాశయము ఆంధ్రులఅభ్యుదయము, భారతీయులప్రగతి, సమగ్రతలు, మానవజాతి కల్యాణములు. సంప్రదాయము, సర్వోదయము, సార్వజనీనత, సౌందర్యము, సౌలభ్యములు వారి కవితాలక్షణములు. "కవిత్వమంటే ఇదీ కవిత్వము" అన్నట్లుగా వారికవితయుండును. వారి కవితకు గాంధిధర్మము పట్టుగొమ్మ. గాంధేయ సిద్ధాంతములు భారతీయధర్మస్వరూపములని, సర్వోదయసిద్ధాంతములు విశ్వమానవకల్యాణకారకములని వారు విశ్వసించినారు. వారి రచనలు సత్యం శివం సుందరం అనుధర్మములకు నెలవులు. వారి కవితలో మానవతాపరిమళములు వెదజల్లు విశ్వసంస్కృతి కలదు; అది మానవుని సంస్కారవంతునిగా జేసి, సమాజమును ఉన్నతీకరించును.వారి కవితలో జాతిజీవనము సర్వతోముఖముగ ప్రతిబింబించుచుండును. వారి ప్రతిపద్యమునందు సాంఘికస్పృహ కలదు; అంతే గాదు తెలుగుకవితా సొగసులపరిమళములు గుబాళించు చుండును. వారి కవిత వంద సం॥లభారతదేశ చరిత్రకు దర్పణము. వారు జన్మించినది 1901; మరణించినది 1990. ఆధునిక యుగలక్షణములన్నియు వారి కవితలో గాంచగలము. అందువలన వారి కావ్యములు ఆంధ్రుల, భారతీయుల నవయుగ హృదయస్పందనలకు రమణీయమైన అక్షరరూపములు. నవీనాంధ్ర సాహిత్య చరిత్రలో 20వ శతాబ్దమును "తుమ్మలయుగము" అని పేర్కొనవచ్చును. వారి కవిత పాఠకులకు భావప్రసన్నతను, హృదయవికాసమును, ఆనంద పారవశ్యమును, మానసిక ప్రశాంతతను కలిగించును. త్యాగరాజు సంగీతము, తుమ్మలసాహిత్యము ఒకే కోవకు చెందినవి. అనగా అవి వినినకొలది ఇంకను వినవలెననియు, చదివినకొలది మరలమరల చదువవలెననియు అనిపించును. అవే నిజమైన కళలు; అజరామరమైనవి. వారిద్దరి సంగీత సాహిత్యములు రసికలోకపు తఱుగనిసిరులు.

తుమ్మలవారు కవిగా ఎంత ఉన్నతులో, వ్యక్తిగా అంతకంటే ఉన్నతులు. వారి జీవితమే ఒక సందేశము. వారు జీవించిన కాలమునందు జీవించుటే మహాభాగ్యమని సమకాలికులు భావించిరనిన అతిశయోక్తిగాదు. విశ్వజనీనమైన యుగకవితను సృష్టించిన, ఆదర్శవంతమైన జీవితమునుగడపిన మహాకవి 20వ శతాబ్దమునందు తుమ్మలవారు గాక మరొకరులేరనుట తెగువగాదు. తుమ్మలవారు "నా అమూల్యసంపద, నా గౌరవపతాక" అని జాతి గర్వించదగిన విశిష్టమైన మహాకవులు "తుమ్మల20వ శతాబ్దియుగకవి; 21వ శతాబ్దపు యుగకర్త."